నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:9 175 సెప్టెంబర్ 2025 హైదరాబాద్

- విలీనం-విద్రోహం ఏది సరైనది?
- "భాషా ప్రయోజనాన్ని నిరూపిస్తే..."
- తెలంగాణకు 'రచనాశైలి' సాధ్యమేనా?
- తెలంగాణా తెలుగు మాటల నిధి (స్పీచ్ కార్పస్) ఆవశ్యకత
- జీవరాసి మాట - జీవంగల్ల మాట
- బతుకును కోల్పోతున్న బతుకమ్మ!
- సమవీక్షకులు-ఎస్వీ రామారావు
- కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణం మిగిల్చిన ప్రశ్నలు



నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

సెప్టెంబర్ 2025

సంచిక : 9

సంపుటి : 16

గౌరవ సంపాదకులు

ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహా మండలి

అల్లం నారాయణ

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ చింతా గణేష్

ప్రిన్సిపాల్ (పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ చింతకింది కాశీం

సంపాదకురాలు

స్నేహలత ఎం.

సంపాదకవర్గం

ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,

ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

డా॥చంద్రయ్య ఎస్. అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥శివరాత్రి సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డా॥ఇమ్మిడి మహేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : శేషు

రచనలు పంపాల్సిన చిరునామా

స్నేహలత ఎం.,

ఇంటి నెం.2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం.2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: **nadusthunnatelangana@gmail.com**

ఫోన్ నెం.: 9290745490

సంపాదకుని ఉత్తరం

వాక్యం
రసాత్మకమంటే
అక్షరం
చెమట సముద్రంలో మునిగి
కన్నీటిలో తడవాలి

కావ్యం
సౌందర్యాత్మకమంటే
కల్పనలు
తొలిచూలు ముద్దాడిన తల్లి స్తన్యంలా
పాలవర్షంలో స్నానమాడాలి

కవి
ఏ పక్షమో తేలాలంటే
స్వపక్షం
జంధ్యాన్ని విసర్జించి
లేతపల్లవిని గానం చేయాలి

సెప్టెంబర్ 30, 2025

నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

తెలంగాణ తొవ్వ

సంపాదకీయం

విలీనం-విద్రోహం ఏది సరైనది? — **ప్రొఫెసర్ చింతకింది కాశీం** — 5

సామాజికం

బతుకును కోల్పోతున్న 'బతుకమ్మ' — **గంధసిరి వీరన్న** — 6

15 ఏళ్ల బహుజన బతుకమ్మ — **డా. సి. అనితకుమారి** — 10

దారి చెప్పే కథలు

ఈ రిజర్వేషన్స్ మాకు ఇంకెన్నాళ్లు? — **ఇస్రం సంతోష్** — 15

తొవ్వ ముచ్చట

భాషా ప్రయోజనాన్ని నిరూపిస్తే, యువత నేర్చుకుంటుంది — **ఆచార్య వై.రెడ్డి శ్యామల**
ఇంటర్వ్యూయర్స్: నూకాలమ్మ, దుష్యంత్, సుచిత్రారావు, తరుణ్, కావ్య, పవంతిక — 17

తెలంగాణ భాషా దినోత్సవ ప్రత్యేక వ్యాసాలు

తెలంగాణకు 'రచనాశైలి' సాధ్యమయ్యేనా? — **డా. చంద్రయ్య శివన్న** — 22

తెలంగాణ మాండలికాల్లో జానపదుల, విద్యావంతుల ఉచ్చారణ — **డా. వి.ఎం.సుబ్రహ్మణ్యశర్మ** — 26

జీవరాశి మాట-జీవంగల్ల మాట — **డా. మట్టా సంపత్కుమార్ రెడ్డి** — 28

తెలంగాణ భాషా అస్తిత్వం — **జె.డి. ప్రభాకర్** — 31

తెలంగాణ తెలుగు మాటల నిధి(స్పీచ్ కార్పస్) ఆవశ్యకత — **డా.జి.ప్రవీణ్** — 34

సాహిత్య విమర్శ

తెలంగాణ సాహిత్య విమర్శ-వాదం, ధోరణి, ఉద్యమం — **డా.ఇమ్మిడి మహేందర్** — 39

పుస్తక పరిచయం

ఇరవై ఐదేళ్ల పాటల బైరాగి రమణ — **విప్లవ కుమార్** — 45

పరిశోధన పరిచయం

తెలంగాణ దాస కవిత్వం — **డా.ఉండేటి స్రవంతి** — 47

నివాళి

సమవీక్షకులు ఎస్వీరామారావు — **డా.వెల్దండి శ్రీధర్** — 49

కొంపల్లి వెంకటన్న మరణం మిగిల్చిన ప్రశ్నలు — **డా.చంద్రయ్య శివన్న** — 50

సంపాదకీయం

విలీనం-విద్రోహం: ఏది సరైనది?

ప్రొఫెసర్ చింతకింది కాశీం

తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17వ తేదీ అనగానే 'తెలంగాణ స్వాతంత్ర దినోత్సవం', 'తెలంగాణ విమోచన', 'తెలంగాణ విముక్తి' వంటి భిన్న పదాలు వినిపిస్తుంటాయి. 1996లో ఎల్.కె.అద్వానీ గారు హైదరాబాద్ వచ్చి, నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో ఈ అంశంపై చర్చ లేవనెత్తినప్పటి నుంచి, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీ రాగానే మీడియా, రాజకీయ పార్టీలు, మేధావులు ఈ చర్చలో నిమగ్నమవుతున్నారు. సామాన్యులుగా, ఆలోచనాపరులుగా ఈ విషయంపై స్పష్టమైన అవగాహన ఉండటం అవసరం.

1947లో బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ఇవ్వగానే, భారతదేశంలోని 500కు పైగా సంస్థానాలు స్వచ్ఛందంగా భారత యూనియన్‌లో విలీనం అయ్యాయి. అయితే, స్వతంత్రంగా ఉండాలనుకున్న సంస్థానాలలో రెండు ముఖ్యమైనవి: ఒకటి కాశ్మీర్, మరొకటి హైదరాబాద్ సంస్థానం. ఇవి 1947 ఆగస్టు తర్వాత కూడా భారత యూనియన్‌లో విలీనం కావడానికి సమ్మతి తెలియజేయలేదు.

1707లో ఔరంగజేబు మరణించగానే అసఫ్ జాహీ వంశస్థులు స్వతంత్రాన్ని ప్రకటించుకున్నారు. అలా 1724 నుంచి 1948 వరకు ఈ హైదరాబాద్ దేశాన్ని అసఫ్‌జాహీ వంశస్థులు పరిపాలించారు. చిట్టచివరి పాలకుడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనకు వ్యతిరేకంగానే తెలంగాణ మొత్తం పోరాటం చేసింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ కింద పోలీస్ పటేల్, పట్వారీ, జాగీర్దార్, జమీందార్, దేశ్‌ముఖ్ వంటి ఐదు అంచెల పరిపాలనా విధానం నిర్మితమై ఉంది. పాలకులు ముస్లింలే అయినప్పటికీ, ఈ దోపిడీ వ్యవస్థలో ఉన్నవారు 90 శాతం మంది హిందువులే. ఉదాహరణకు, వేల ఎకరాలు ఉన్న విస్నూరు రామచంద్రారెడ్డి, 40 వేల ఎకరాలను పాలించిన జన్నారెడ్డి ప్రతాపరెడ్డి వంటి దొరలు హిందువులే. వీరందరూ నిజాం అండదండలతో తెలంగాణను గుప్పెట్లో పెట్టుకొని, భూస్వాములుగా, దోపిడీదారులుగా పరిపాలించారు.

1930లో ఏర్పడిన ఆంధ్ర మహాసభ ఈ పోరాటానికి కేంద్ర బిందువు. ఇందులో కాంగ్రెస్, కమ్యూనిస్టు, ఆర్య సమాజకులు, స్టేట్ కాంగ్రెస్ వాదులు భాగస్వాములయ్యారు. ఈ సంస్థ ప్రధానంగా భూస్వామ్యానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడింది. భువనగిరి మహాసభకు వచ్చేసరికి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం తీవ్రమైంది. దొడ్డి కొమరయ్యను విస్నూరు రామచంద్రారెడ్డి కాల్చి చంపడం, బందగీని దొర గుండాలు హత్య చేయడం, చాకలి ఐలమ్మపై దాడులు జరగడం వంటి సందర్భాల తర్వాత, ఆత్మరక్షణ కోసం ఆయుధం పట్టాలని రావి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. దీంతో ఆంధ్ర మహాసభలోని కాంగ్రెస్, ఆర్య సామాజకులు వెనక్కి తగ్గగా, కమ్యూనిస్టులు మాత్రం తమ చివరి ఊపిరి వరకు పోరాటం చేశారు.

ఈ పోరాటంలో అక్షరాలా నాలుగు వేల మంది వీరులు నైజాం ప్రభుత్వానికి, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి నేలకొరిగారు. ఇది హిందూ-ముస్లింల మధ్య జరిగిన పోరాటం కాదు. ముగ్దుం మోహియుద్దీన్, షోయబుల్లా ఖాన్ వంటి ముస్లిం కవులు, రచయితలు సైతం నైజాంకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు అర్పించారు. తెలంగాణ ప్రజలు చేసిన ఈ పోరాటం కారణంగానే దోపిడీదారులు, రజాకార్ల సైన్యం తోకముడిచారు. ఆ సమయంలో ఢిల్లీ నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 1948, సెప్టెంబర్ 13న సైన్యాన్ని పంపించారు. సైన్యం వచ్చిన నాలుగు రోజుల్లోనే నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ లొంగిపోయాడు. సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాడు.

మన చరిత్ర పుస్తకాల్లో వల్లభభాయ్ సైన్యం, నాలుగు రోజుల్లోనే తెలంగాణను వశపరచుకున్నట్లు చదువుతున్నప్పటికీ, నిజం ఏమిటంటే, సైన్యం రాకముందే ఇక్కడ తెలంగాణ ప్రజలు తమ రక్తతర్పణతో నిజాం నుంచి, భూస్వాముల నుంచి విముక్తి సాధించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలిసిపోయింది కాబట్టి విలీనమనాలనీ, నిజాం పాలన నుంచి అధికారికంగా విముక్తి లభించింది కాబట్టి విమోచన అనాలనీ, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ నుంచి ప్రజలు పాక్షికంగా విముక్తి పొందారు కాబట్టి విముక్తి అనాలనీ ప్రముఖంగా మూడు చర్చలు జరుగుతుంటాయి.

ఈ పోరాటంలో ఆర్య సామాజికులు, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టు పార్టీవాళ్ళు ఉన్నారు. కానీ, అంతిమంగా చివరివరకు నిలబడి, రక్తతర్పణం చేసింది మాత్రం, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలోని ఆంధ్ర మహాసభ కార్యకర్తలే. చరిత్ర మన ఇష్టాయిష్టాలకు అనుకూలంగా నిర్మాణం కాదు. ఆర్య సమాజకులు ఎంత పోరాటం చేశారో వారికి అంత స్థానం ఇవ్వాలి, స్టేట్ కాంగ్రెస్ వాళ్ళు ఎంత పోరాటం చేశారో వారికి అంత స్థానం ఇవ్వాలి, అలాగే, కమ్యూనిస్టులు ఎంత త్యాగం చేశారో వారికి అంత స్థానం ఇవ్వాలి. ఎవరి చరిత్రనూ కనుమరుగు చేయకుండా భవిష్యత్తు తరాలకు నిజమైన చరిత్రను అందించాలి.

1948, సెప్టెంబర్ 17న, తెలంగాణ సమాజానికి మీర్ ఉస్మాన్ అలీఖాన్ నుంచి విముక్తి లభించింది నిజమే. అయితే, తెలంగాణ సమాజంలో భూస్వామ్యం, దోపిడీ ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. సంపూర్ణమైన స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యం కోసం ఆ పెనుగులాట వెన్నెలలాంటి సమాజం కోసం ఇంకా కొనసాగుతూనే ఉంది.

T

బతుకును కోల్పోతున్న 'బతుకమ్మ'

గంధసిరి వీరన్న

వికాసం చెందడం అనేది మనుగడ ప్రథమపద సోపానం. మనుగడ అనేది కేవలం శ్వాసించడమో, జీవించడమో కాదు. అది ఒక సమాజం తన ప్రత్యేకతను, తన భాషా సంస్కృతులను, తన ఆచారాలను నిలుపుకుంటూ ముందుకు సాగడం. మానవ సమాజంలో భాషాసంస్కృతుల పాత్ర అనిర్వచనీయమైనది. మానవ పరిణామం జరుగుతున్నకొద్దీ, కాలం కొత్తపుంతలు తొక్కుతున్నకొద్దీ అలవాట్లు ఆచార వ్యవహారాలు భాషాసంస్కృతులు మరింత పటిష్ఠం కావాలి. అపురూపం సంతరించుకోవాలి. అయితే, మనుగడ కోసం జరిగే సంఘర్షణలో ఆధిపత్యం గలవారి అలవాట్లు ఆచారవ్యవహారాలు, భాషాసంస్కృతులే కిందివారి లేదా బలహీనవర్గాల అలవాట్లు ఆచారవ్యవహారాలు భాషాసంస్కృతులుగా మారుతుంటాయి. ఆధిపత్యం గలవారిచేత ప్రభావితమవుతూ కొత్తరూపాలను తొడుక్కొని కృత్రిమంగా వ్యవహరిస్తుంటాయి.

ఇంకోవైపు, మనుషులు తమ ఆచారాలు, పండుగలను ఎంతో మమకారంతో కాపాడుకోవాలని ప్రయత్నిస్తారు. కానీ, అదే సమయంలో కొత్తగా ఏదో జోడించాలని, కొత్త రంగులు అద్దాలనే ఉబలాటంలో ఉంటారు. ఈ కోరిక, పెరుగుతున్న సాంకేతిక మాయాజాలం కలిసిపోయి సంప్రదాయాలను వేరే దిశలో నడిపిస్తోంది. అసలు ఉన్న మూలతత్వం, సహజత్వం పోయి, ఒకరకమైన సంకరరూపంలోకి మారుతున్నాయి. ఇది తాత్వికంగా చూస్తే, మన అస్తిత్వాన్నే ప్రశ్నించే పరిస్థితి. ఎందుకంటే, ఒక సమాజం తన పండుగల్లో, తన భాషలో, తన సంస్కృతిలోనే జీవిస్తుంది. వాటిని కోల్పోతే మనం కేవలం మనుషులుగా మిగిలిపోతాం. సమాజంగా ఉండలేం. అలాంటి ఒకానొక విపరీత ధోరణి నేడు తెలంగాణ పల్లె పండుగ బతుకమ్మలో కనబడుతోంది. బతుకమ్మ ప్రపంచంలోనే ఏకైక పూల పండుగ.

నిర్దిష్టంగా ఫలానా దేవత, దేవుడు అని కాకుండా, పూలతో పూలని పూజించే పండుగ. అలాంటి విలక్షణమైన పండుగ నేడు విపరీత పోకడలకు గురవుతోంది. ఏదైనా వ్యవహారం కాలక్రమంలో రాటుదేలి దృఢంగా రూపు దిద్దుకోవాల్సింది పోయి అనవసరపు హంగు, ఆర్భాటాలతో తన అస్తిత్వమే మరుగునపడిపోయే స్థితిలోకి జారుకుంటోంది.

ఈ సందర్భంగా బతుకమ్మ చారిత్రక నేపథ్యం నుండి బతుకమ్మ నిర్వహించడంలోని అనేకానేక అంశాల ప్రాధాన్యతను వివరిస్తూ నేడు వస్తున్న విపరీత పోకడలని చెబుతూ ఈ వ్యాసం ఉండనుంది. ఈ వ్యాసంలో పొందుపరచబడే అంశాలకు చారిత్రక గ్రంథాలు, వృద్ధులైన మహిళలతో జరిగిన సంభాషణలను ఆకరాలుగా తీసుకున్నాను. ఈ రెండింటిని సమన్వయపరుస్తూ, అనుసంధానిస్తూ ప్రత్యక్షంగా గమనించిన విషయాలద్వారా ఈ వ్యాసం రూపొందించబడింది. అయితే, సార్వత్రికంగా ఆచరణలో, అనుభవంలో ఉన్న అంశాలనే స్పృశిస్తూ చర్చించాను.

బతుకమ్మ పండగ–ఆవిర్భావం

బతుకమ్మ భౌగోళికంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన పండుగ. సామాజికంగా మహిళలకు మాత్రమే చెందిన పండుగ. స్త్రీలు మనసు విప్పి మాట్లాడేందుకు, దాచుకున్న ఉద్వేగాలను వలపోసేందుకు, ఆటపాటలు ఊతంగా చేసుకొని తమదైన ఒక వ్యక్తిగత, సమష్టి ప్రదేశాన్ని ఏర్పరచుకున్న పండుగ. వ్యవస్థీకృత విలువలు, కుటుంబ బాధ్యతలను దాటి, తమకోసం తాము బతుకమ్మ పేరు మీద ఏర్పరచుకున్న ఏకైక వేదిక ఇది. అయితే ఈ బతుకమ్మ ఎప్పుడు ఎక్కడ ఎలా ఆవిర్భవించిందనే దానికి నిర్దిష్టమైన స్థలకాల రుజువులతో కూడిన ఆధారాలు లేవు. తెలంగాణ ప్రాంతం ఒక జానపద నిర్మాణాన్ని కలిగిన సామాజిక రూపం. జానపద కళారూపాలకు స్థలకాలాలను అధిగమించిన సాక్ష్యాలుంటాయి. ఆ కోవలోనే బతుకమ్మ కూడా చేరుతుంది.

పౌరాణికంగా చూసినప్పుడు శ్రీ గౌరీ మహిషాసురున్ని చంపిన తర్వాత అలసటతో మూర్ఛపోతే, ఆమెను తేర్చడానికి స్త్రీలంతా గుమికూడి పాటలు పాడారు. పదవ రోజున ఆమె తేరుకొని స్పృహలోకి వచ్చింది. ఆమెను "బతుకమ్మ" అని పాడితే బతికింది. కనుక, ఆ పది రోజుల పండుగ జరుపుతారు.

చారిత్రకంగా చూసినప్పుడు, చోళరాజు ధర్మాంగదుడు తన నూరుగురు కొడుకులని కోల్పోయి సంతానం కోసం లక్ష్మీదేవిని ఉద్దేశించి తపస్సు చేయగా, లక్ష్మీదేవి వరంమేరకు ఆమెనే కూతురుగా జన్మించమని కోరారు. వాళ్లకు జన్మించిన లక్ష్మీదేవిని మునులు సందర్శించి 'బతుకమ్మ' అని పేరు పెట్టి,

ఉత్సవం జరిపించారు. ఆ విధంగా బతుకమ్మ పండుగ ఆవిర్భవించిందని మరొక ఆధారం కనబడుతోంది.

సామాజికంగా చూసినప్పుడు, కొన్ని శతాబ్దాల కిందట ఇక్కడి ప్రాంతంలో సంభవించిన కరువుకాటకాలు, వ్యాధుల నుండి కాపాడమని ప్రజలు పండగ చేశారు. బతుకు నిలిపిన దేవతే బతుకమ్మగా ప్రారంభమైంది.

ఇలా ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కాకతీయుల కాలంనాటి రచనలలో దీని ప్రస్తావనఉన్నదని, రుద్రమదేవి స్వయంగా బతుకమ్మ ఆడిందని పలు కథనాలు కూడా ఆచరణలో ఉన్నాయి. కానీ వాటికి తగిన ఆధారాలు లేవు. అంతేగాక పైన చెప్పుకున్న వేటికి కూడా ఇతమిద్దమైనటువంటి ఆధారాలు రుజువులు లేవు. కానీ ఏ ఆధారాలు లేకపోయినా ఏ సాక్ష్యాలు లేకపోయినా బతుకమ్మ అనే పండుగ ఆవిర్భవించి తరతరాలుగా ప్రస్తానాన్ని కొనసాగిస్తూ ఉన్నది. నాటికి నీటికి వన్నెతెగకుండా ఈ బతుకమ్మ వెలుగొందుతోంది.

బతుకమ్మ పేర్చడం ఒక కళాత్మక దృశ్యం

బతుకమ్మ నిర్వహణ అనేది తెలంగాణ సాంస్కృతిక జీవితంలో గొప్ప ఉత్సవ పద్ధతి. సమాజ జీవనశైలిని ఐక్యతను మహిళల ఆటవిడుపును, ప్రకృతితో మానవ సంబంధాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమం. తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ ఉత్సవం, 'పెత్తరామాస' (పెద్దల అమావాస్య) రోజున ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమవుతుంది. 9 రోజులు 9 రకాల బతుకమ్మల పేరుతో నిర్వహించబడినప్పటికీ, మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మకు ప్రాచుర్యం, ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. చివరిదైన సద్దుల బతుకమ్మ అత్యంత వైభవోపేతంగా భారీ ఎత్తున జరుగుతుంది.

ఈ బతుకమ్మ ఉత్సవాల్లో బతుకమ్మ పేర్చడం అనే తంతు హుషారుగా కళాత్మకంగా ఉంటుంది. పూలని సేకకరించడం, తెచ్చిన పూలని వేరు చేసి గుత్తులు గుత్తులుగా అమర్చిపెట్టడం, తర్వాత తాంబాలం/తబకు/పళ్లెం వంటి దానిపై బీరాకు లేదా గుమ్మడాకుల నుంచి పూలని వరుసలుగా, ఒద్దికగా బతుకమ్మని పేర్చుతారు. పువ్వులు సేకరించడం అనేది హుషారుగా సాగుతుంది. ఇంట్లోని మగ పిల్లగాండ్లు/మగవాళ్ళది బతుకమ్మలో ప్రధానమైన తంగేడు పూల సేకరణ బాధ్యత. పండుగ ముందురోజో లేదంటే పండుగ రోజో తెల్లారకముందే సంచులు సంకలో పెట్టుకుని పొలాలు, బీడు భూములు గుట్టలు, కంచెలు ఇలా తంగేడు చెట్లు పెరగగలిగే ప్రదేశాలను ఎరుకలో ఉంచుకొని సాగుతుందీ అన్వేషణ.

తంగేడు పూలు బతుకమ్మలో ప్రధానమైన పాత్ర వహిస్తాయి. ఇవి మహిళల సౌభాగ్యానికి ప్రతీకగా వ్యవహరించబడతాయి. ఈ తంగేడుకు పురాణ రచనల్లోనూ, కావ్యాల్లోనూ ప్రస్తావన లేకపోయినప్పటికీ, బతుకమ్మ మూలంగా విస్తృతమైన గౌరవమర్యాదలు ఇవ్వబడతాయి. గౌరీదేవికి ప్రతిరూపంగా భావించే ఈ తంగేడుని ముత్తైదువలు బాట వెంట నడిచి వెళుతున్నప్పుడు తప్పనిసరిగా తమ కొప్పుల్లో పెట్టుకుంటారు, అలా చేయకుండా ఉండే స్త్రీని ఉద్దేశించి 'మురికి ముత్తైదువ' అని తంగేడు చెట్టు శాపనార్థం పెట్టే సామెత కూడా జన బాహుళ్యంలో ఉంది. ఈ తంగేడు పూలతోపాటు అడవిలో దొరికే అడవి చామంతి, పునాసచేలలోని గునుగు పూలు కూడా సేకరించుకొని ఇంటికి తిరిగి వస్తారు.

ఇంటి దగ్గర ఉండే ఆడపిల్లలు ఎనుగులు, రాతి గోడల వెంబడి తిరుగుకుంటూ కట్లపువ్వులు, కాకరత్న పూలు సేకరిస్తారు. ఇల్లిల్లు తిరిగి మందారాలు సీతజడ పూలు తెచ్చుకుంటారు. వీటితోపాటు బతుకమ్మ పండుగ నాటికి వచ్చే విధంగా నాటిన గోరింట మొక్కలనుండి పూలు తెంచి పెట్టుకుంటారు. ఈ పూల సేకరణ నాందివాచకం అయితే బతుకమ్మ పేర్చటం కళాత్మక దృశ్యం. తెచ్చిన తంగేడు పూలకొమ్మల నుండి ఆకులని గిల్లి, పూలతో కాండ ఒక మూడు నాలుగు 'ఇంచు'లు కిందికి ఉండే విధంగా చూసుకుని, గుత్తులు గుత్తులుగా అమర్చుకొని, పీట అంచు కింద అణగబెడతరు. గిల్లిన తంగేడు ఆకులను జాగ్రత్తగా దాచిపెడతారు.

సేకరించిన మిగతా పూలని వేరుగా ప్రత్యేకపరిచి సిద్ధంగా ఉంచుకుంటారు. తర్వాత పూల పరిమాణాన్నిబట్టి

బతుకమ్మని పేర్చే పళ్లెం లేదా తాంబూలం తెచ్చుకుని దానిమీద గుమ్మడి ఆకు లేదా బీర ఆకు వంటి వెడల్పాటి ఆకులు ఒకటి నుండి మూడు అమర్చి, అంచుల వెంబడి సమానంగా కత్తిరిస్తారు. ముందుగా కింది వరుసలో తంగేడుపూలని పేర్చి, ఆ పై వరుసలలో రకరకాల పూలని పేర్చుతుంటరు. అయితే పేరుస్తున్న పూల వరుసలు పడిపోకుండా, బతకమ్మ మధ్య/ పొట్ట భాగంలో అప్పటికే జాగ్రత్తగా పెట్టుకున్న తంగేడు ఆకులని పోస్తుంటరు. బతుకమ్మలో ప్రధానమైన పాట ఈ తతంగం నుండే మొదలవుతుంది.

సాయంత్రం జరగబోయే ఉత్సవానికి ముందస్తు రిహార్సల్ లాగా, ఇంట్లో పెద్దవారు బతుకమ్మ పేర్చుతూ, మిగతా ఆడపిల్లలు సహాయపడుతుంటే, ఎవరో ఒకరు పాట పాడుతుంటే, మిగతావారు కోరసిస్తుంటారు. ఈ పాటలో బతుకమ్మ వైశిష్ట్యం, బతుకమ్మ ఆవిర్భావాలకు సంబంధించిన కథలు ప్రస్తావనకు వస్తాయి. బతుకమ్మ పండుగలో అన్నదమ్ములు–అక్కాచెల్లెళ్ల మధ్య ఉండే ఒక అపూర్వ సంబంధంతో కూడిన కథలు, పాటలు అలుముకొంటాయి. ఇదంతా ఒక ఆటవిడుపు మాదిరిగా బతుకమ్మ పేర్చడ0 అయిపోతుంది. ఒక పెద్ద బతుకమ్మ, దానికి చిన్న బతుకమ్మను తయారుచేస్తారు. దీన్ని తోడు బతుకమ్మ అని పిలుస్తారు. పసుపుతో చేసిన గౌరమ్మను బతుకమ్మ శిఖరం మీద ఉంచి, దేవుడి దగ్గర పెట్టి, కొబ్బరికాయ కొట్టి, బతుకమ్మ పేర్చే త0తు ముగిస్తారు.

బతుకమ్మలో బతుకు సౌందర్యం

బతుకమ్మ పేర్చటం అయిపోయాక, పలారాలు సిద్ధం చేస్తారు. ఎంగిలిపూల రోజు పప్పు బెల్లం/పప్పు చెక్కర /పల్లీలు బెల్లం వంటివి తయారు చేస్తారు. సద్దుల రోజు మాత్రం మలీద ముద్దులనే ప్రత్యేకమైన పలారం చేస్తారు. జొన్న లేదా సజ్జ పిండితో చేసిన రొట్టెలను ముక్కలుగా చేసి, బెల్లం వేసి దంచి, ముద్దలుగా చేస్తారు. వీటితోపాటు పాయసన్న0, పెరుగన్నం, పులిహోర, కొబ్బరి బెల్లం ఏదైనా ప0డ్లు వంటివి తీసుకెళ్తారు.

ఎంగిలిపూల బతుకమ్మ అంటే, బతుకమ్మ పేర్చేవారు ఆరోజు ఏదైనా తిన్నాక బతుకమ్మను పేర్చుతారు. అందుకే అది ఎంగిలిపూల బతుకమ్మ. సద్దుల బతుకమ్మ రోజు మాత్రం పలారాల సిద్ధం చేసి, బతుకమ్మ పేర్చి, దేవుడి దగ్గర పెట్టి, కొబ్బరికాయ కొట్టేంతవరకు ఉపవాసం ఉంటారు.

ఈ విధంగా బతుకమ్మని పేర్చి, పలారాల సిద్ధం చేసుకుని, కొత్త బట్టలు కట్టుకొని, సాయంత్రం బతుకమ్మ ఆటకు సిద్ధంగా ఉంటారు. పొద్దుగూకుతూ కొంత చల్లబడే సమయానికి డప్పుల మోతలతో ఒక్కోవాడ నుండి బతుకమ్మలు బయలుదేరుతాయి. ఊరు మధ్యలో లేదా ఊరిలోని ఏదైనా దేవాలయం వద్దకు చేరుతారు. అక్కడ కాసేపు ఆడి పాడుతారు. తరువాత ఊరంతా ఏకమై చెరువుగట్టుకు చేరుతారు. బతుకమ్మ ఉత్సవంలో అసలు ఘట్టం, ప్రధానమైన అది. చెరువుగట్టుకు చేరగానే పెంపలి చెట్టు తీసుకొచ్చి, బతుకమ్మ ఆడే ప్రదేశం మధ్యలో ఉంచుతారు. దాని చుట్టూ తమతోపాటు తీసుకొచ్చిన బతుకమ్మలను పెట్టి వేడుకని ప్రారంభిస్తారు. సీతారాముల కళ్యాణం నుండి, అన్నాచెల్లెళ్ల అనుబంధం నుండి, పెళ్ళై వెళ్లిన ఆడవాళ్ళ కష్టాలు కన్నీళ్ల నుండి అల్లుకున్న పాటలను పాడుతూ, ఆ పాటకు తగినట్టు చప్పట్లు కొడుతూ, వాటికి లయాత్మకంగా అడుగులు వేస్తూ, గంటల తరబడి ఆడి పాడుతారు. అలసట తెలియని వేడుక అది.

పెద్దవారు ఒకవైపు బతుకమ్మ ఆడుతుంటే, యుక్తవయసువారు, చిన్న పిల్లలు వివిధ రకాల ఆటలు ఆడుతుంటారు. పొద్దుపోయి మసక చీకటి అయ్యేవేళ, వేడుక ముగింపు సూచకంగా పాటలు పాడి, బతుకమ్మ మీద దీపాన్ని వెలిగించి, చెరువు నీటిలో సాగనంపుతారు. తెచ్చుకున్న పలారాలు బతుకమ్మ పేర్చిన పల్లెల్లో వేసి పంచుకుంటారు. ఆడవాళ్ళంతా వాయినాలు ఇచ్చుకుంటారు. పలారాలు పంచుకొంటారు. వాయినాలు ఇచ్చుకుంటారు. వరుసైనవారి మధ్య పరాశకాలు ఆడుకుంటూ, సందడి సందడిగా జరుగుతుంది. చీకట్లో మట్టి బాటల వెంట, తోచిన పాటలు పాడుకుంటూ, ముచ్చట్లు పెట్టుకుంటూ ఇంటికి చేరుకుంటారు. ఇవీ స్థూలంగా బతుకమ్మ నిర్వహణలోని ఘట్టాలు. వ్యాసపరిధి దృష్ట్యా బతుకమ్మ పాటలు, వాటి పరమార్థాలు చేర్చలేదని గమనించాలి.

బతుకమ్మ–సామాజిక జీవిత ప్రతిబింబం

స్త్రీ స్వేచ్ఛ:

బతుకమ్మ ఒక సామాజిక చైతన్యంతో కూడిన పండుగ. పితృస్వామిక వ్యవస్థలో కుటుంబ నియమాల చట్ర0లో తమ గోడు చెప్పుకునే వీలులేని మహిళలకు, తమదైన వ్యక్తిగత ప్రదేశాన్ని కల్పించిన ప్రత్యామ్నాయం బతుకమ్మ పండుగ. బతుకమ్మ ఉత్సవం పూర్తిగా మహిళల పండుగ. కేవలం పూలు తేవడమనే ఒక విషయం తప్ప, ఇది పూర్తిగా ఆడవారి వేడుక. స్వేచ్ఛగా ఆడి పాడి తమ సాంసారిక ప్రపంచాన్ని కాసేపు మరిచిపోయి, తమదైన ప్రపంచంలో స్వేచ్ఛగా గడపగలిగే పండుగ. నవ్వటంలో, పాడడంలో, ఆడటంలో, ఎగరటంలో ఏ ఆంక్షలు లేకుండా జరుపుకునే పండుగ. శరీరాన్ని బిగదీసుకునేలా చేసే మగవారి చూపులేవి లేకుండా, ఒళ్ళు మరిచి ఆడి పాడే ఒక మహత్తర వేడుక. తమ జీవితాన్ని తాము సంపూర్ణంగా జీవించగలిగే పండుగ.

మానవ సంబంధాలు:

బతుకమ్మ పండుగ స్త్రీ కేంద్రంగా జరిగే ఉత్సవ వేడుక. అందుకే పెళ్లి చేసి, పంపించిన ఆడబిడ్డలను తీసుకురావడం

అనేది ఆనవాయితీగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో, ఇంటి పనుల్లో, అత్తింటి ఆరాళ్ళతో అలసిసొలసిన ఆడవాళ్లకు, తల్లిగారి పిలుపులు పెద్ద ఊరట. పుట్టినిల్లు పెద్ద విరామం. పుట్టింటిలో, పెరిగిన ఊరిలో తిరిగిన బాల్య స్నేహితుల జ్ఞాపకాలు, పరామర్శలు, ఆదరాలు గత ఇబ్బందులను మరిపించి మురిపిస్తాయి. ఉత్సాహ పరుస్తాయి. తోటి ఆడవాళ్లంతా వస్తారు గనుక, బతుకమ్మ పండుగ అంటే, ఆడబిడ్డలకు ముచ్చట్లే ముచ్చట్లు. సందడే సందడి. ఏడాది భారమంతా దించుకునే గొప్ప అవకాశం. అందుకనే ఎంత నిరుపేద కుటుంబాలైనా సరే తప్పకుండా అన్నలో, నాయనలో వెళ్లి, తమ ఆడబిడ్డల్ని తోలుకొచ్చుకుంటారు. తల్లిదండ్రుల అన్నదమ్ములతో ఆడపిల్లల ప్రేమ బంధం గట్టిపరిచే సందర్భం. ఈ విధంగా కుటుంబ సంబంధాలు, ఇరుగుపొరుగు సంబంధాలతో ఊరు ఊరంతా ఏకమై చేసే బతుకమ్మ పండుగ, మానవ సంబంధాలను పెంపొందించడంలో బహుముఖ పాత్ర వహిస్తోంది.

బతుకమ్మ-వ్యాపార పోకడలు

చారిత్రకంగా, సాంస్కృతికంగా బలమైన, నిర్దిష్టమైన స్థానం ఏర్పరచుకున్న బతుకమ్మ పండుగ సైతం మార్కెట్ ప్రలోభాలకు లోనవుతోంది. పెరుగుతున్న సాంకేతికత, ప్రజల ఆర్థికస్థోమతల కారణంగా హంగు ఆర్భాటాలు మేళవించి, బతుకమ్మలోని అసలైన ఉనికిని మసకబార్చుతున్న వైనం నేడు గమనించవచ్చు. అంతేకాక, ఏ వ్యక్తిగత ప్రదేశాన్ని గురించిన వెతుకులాటలో బతుకమ్మ పండుగను ఈ రకంగా ఆవిష్కరించుకున్నారో అది నేడు ఆడంబరాలమయంగా, స్థాయిభేదాలు-హెచ్చుతగ్గులు బేరీజు వేసుకునే లాంఛనంగా మారుతుండటం మరొక శోచనీయమైన విషయం. పూలతో, పాటలతో, స్నేహాలతో సమూహ ఆనందాలతో స్త్రీల సృజనాత్మకతతో ప్రసిద్ధి చెందిన బతకమ్మ ఇటీవలి కాలంలో, విపరీత ధోరణుల పోకడల దాడికి గురవుతోంది. పర్యావరణ విధ్వంసం, ఆర్థిక సామర్థ్యం పెరుగుదల, సాంస్కృతిక పరాయికరణ వ్యామోహం వంటివి ఈ విపరీత ధోరణులకు కారణం అవుతున్నాయి.

వ్యవసాయంలో సాగుభూమి పెరుగుదల, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పలు అభివృద్ధి కార్యక్రమాల కారణంగా అడవుల నరికివేత, గుట్టలు సైతం చదును భూములుగా మారడం వంటి పర్యావరణ విధ్వంస చర్యల వలన అడవి జాతి మొక్కలైన తంగేడుపూల మొక్కలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. తంగేడుపూలు నేడు ఒక వ్యాపార వస్తువుగా మారిపోయాయి. వ్యాపారం-డబ్బు అనే అంశాలు చోటుచేసుకున్నాక ఏ అంశంలోనైనా 'గుండె తడి' కనుమరుగడం ఇప్పటికీ చూస్తున్నాం. పెరిగిన ఆర్థికస్తోమతల కారణంగా, మహిళలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకునే పరిస్థితినుండి స్థాయిభేదాలు చర్చించుకునే పరిస్థితి ఏర్పడింది. బతుకమ్మ వేడుకలో ప్రధానమైన పాటపాడడం అనే ఘట్టం చాలా నామూషీ అయిపోయింది. డీజేల పాటలద్వారా, రికార్డెడ్ పాటలద్వారా వేడుకలు నిర్వహిస్తున్నారు. చప్పట్లు కొట్టి అడుగు వేసే నైపుణ్యం సైతం కనుమరుగవుతోంది.

సాంస్కృతిక దాడి కోణంలో చూస్తే, ఏ విధంగానూ బతుకమ్మతో సరిపోని ఉత్తరాది దాండియా మొత్తం బతుకమ్మ వేడుక స్వరూపాన్ని మార్చేసింది. బతుకమ్మ ఉత్సవ విగ్రహం తప్ప మరేది కాకుండా బతుకమ్మ వేడుకపై ఈ దాడి జరుగుతోంది. సోషల్ మీడియా మోజులో, ఫోటోలు, రీల్స్ ఆకర్షణలో ఎవరో ఒకరు ప్రారంభించిన ఈ 'సాంకర్యం' ఇప్పుడు సర్వసాధారణమైపోతోంది. దీనికి తగ్గట్టు ఈవెంట్ల పేరుతో బతుకమ్మని దాండియాని ఏకం చేసి ఉత్సవాలు చేస్తున్నారు. దాండియా బతుకమ్మ అనేవి వేర్వేరు మూలాలు, వేరువేరు భావాలు, వేరువేరు చరిత్రలపై రూపొందించబడ్డ సాంస్కృతిక నిర్మాణాలు. ఇవి కలిస్తే, బతుకమ్మలో జానపద గీతాల సౌందర్యం కనుమరుగవుతుంది. సామూహిక ఆత్మీయత క్రమంగా ప్రదర్శనాత్మకంగా మారుతుంది. భవిష్యత్ తరాలు బతుకమ్మ అసలు రూపాన్ని మరిచిపోతారు. ఇది ఏదో ఒక నృత్యరూపంలో జోడించబడిందని సంబర పడొద్దు. ఇది ఒక సంస్కృతి హైబ్రిడైజేషన్. ఒక సంస్కృతి మౌలికతను చెరిపివేసే ప్రమాదం. ప్రతి ప్రాంతీయ సంస్కృతికి తనదైన సౌందర్యం ఉంటుంది. గుజరాత్ లో దాండియా తన వెలుగుల్లో మెరవాలి. తెలంగాణలో బతుకమ్మ తన పరిమళంలో నిలవాలి. ఒకదానితో మరొకటి కలిపి ఫ్యాషన్ పేరుతో చూపించడం వాస్తవానికి రెండింటికే అన్యాయం చేయడమే అవుతుంది.

ముగింపు

మనుగడ సాధించడం అంటే వికాసం చెందడం, పరిణామం చెందడం. భాషాసంస్కృతుల విషయంలో ఈ పరిణామం అనేది మనదైన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, మరింత పటిష్టంగా రూపొందాలి. బతుకమ్మలో కనుమరుగవుతున్న 'చుట్టగముడు' ఆటని దాండియాకు బదులు పునరుద్ధరించాలి, బతుకమ్మ గేయ సాహిత్యాన్ని అలవోకగా ఆలపించే స్ఫూర్తిని నింపుకోవాలి. ఆడంబరాలు స్థాయిభేదాలు కాకుండా ఆత్మీయతలను పంచుకునే వేదికగా మార్చాలి. నానాటికీ మృగ్యమైపోతున్న మానవ సంబంధాలను మెరుగు పరుచుకునే వేడుకగా నిర్వహించుకునే మార్గాలను అన్వేషించాలి. ఒక సంస్కృతి కనుమరుగవడం అంటే ఒక జాతి కూడా కనుమరుగవడమే అనే సత్యాన్ని గుర్తుతెరిగి బతుకమ్మ సాక్షిగా అసలైన బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలి.

రచయిత: సాహిత్య విమర్శకులు

సామాజికం

15 ఏళ్ల బహుజన బతుకమ్మ

డా.సి.అనిత కుమారి

తెలంగాణలో బతుకమ్మ గొప్ప పండుగ. అచ్చంగా ఇది జానపదుల పండుగ. చాలా ప్రాచీన కాలంనుండి కనిపిస్తున్న పండుగ. దశాబ్ది కాలంగా ప్రజల దృష్టిని ఆకర్షించిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ద్వారా అందరికీ చేరువైన పండుగ. ఈ పండుగ పుట్టుక గురించి కాల నిర్ధారణ చేయడం, దాని ఆవిర్భావం గురించి చెప్పే భిన్న ఐతిహ్యాల విషయాలను కాస్త పక్కకు పెడితే ఈ పండుగకు సంబంధించిన చాలా విషయాలు మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తాయి. బతుకమ్మలో పూదిచ్చిన పూలన్నీ శాస్త్రీయతకు సంబంధించినవి. అందులో అతి ప్రధానమైన తంగేడు పువ్వు దళితుల అస్తిత్వానికి ప్రతీకై వారి జీవితాలనుండి విడదీయలేనిది. అయినా దళితులంతా నేటికీ బతుకమ్మ పండుగకి అంటరానివాళ్లే. అరుదుగా కొన్నిచోట్ల ఈ పండుగను జరుపుకున్న, సామూహిక వేడుకకు దూరం చేయబడినవాళ్లే. అందుకే అలాంటి అంటరాని వాడల్ని కలుపుకుంటు అన్ని కులాలను, మతాలను ఏకం చేసి సవ్వడిగా ఆడిపాడాలనే తపనతో ఆవిర్భవించిందే 'బహుజన బతుకమ్మ'. బతుకమ్మ Not a event. It is a social moment. అంటూ సాగుతున్న ప్రయాణానికి 15 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగ ఆయా సంవత్సరం ప్రజా యోజితమైన ఒక ప్రత్యేక నినాదంతో ముందుకు సాగిన విషయాలెన్నో ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ముందు వరుసలో నిలిచిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ACF) 1995లో తెలంగాణం అనే పాటల పుస్తకం మొదలు అనేక పుస్తకాలను, సీ డీ లను వెలువరిస్తూ వస్తుంది. మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తరుణంలో బతుకమ్మ ఉత్సవాలలో పోరు సందేశాన్ని వినిపిస్తూ వస్తుంది. ఈ విధంగా 2013 నాటికే గత ఐదు సంవత్సరాల నుండి పోరు బతుకమ్మగా ప్రారంభమై, తెలంగాణ ఏర్పాటు కావడానికి పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదింప చేయాలని కోరుతూ 2013లో 'బహుజన బతుకమ్మ'గా పెట్టిన పేరు స్థిరపడిపోయింది. బహుజన బతుకమ్మ లేవనెత్తుతున్న అంశాలు కేవలం తొమ్మిది రోజులకే పరిమితం కాకుండ అవి సంవత్సరం పొడవునా ఉద్యమ రూపం దాల్చాల్సిన అవసరం ఉందని భావించి దోపిడీ, పీడనలను ఎదిరించే ఒక ఉద్యమ కార్యాచరణ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలను చైతన్యపరిచే దిశగా ప్రయాణమైంది. విద్యావంతులను, విద్యార్థులను, యువతను, రైతులను, కూలీలను, శ్రామికులను ఆలోచింపచేస్తూ వారిని చప్పట్లతో మిరుమిట్లు గొలిపే పాటలకు గొంతుకల్పమని ఆహ్వానిస్తుంది.

ఇట్లాంటి బహుజన బతుకమ్మ ఏర్పాటుకు సుదీర్ఘకాల ప్రయత్నమే ఉంది. అది తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమంతో పెనవేసుకొని నూతన ఆవిష్కరణలతో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటిలో తెలంగాణను తల ఎత్తుకొని నిలబెట్టాలనే ప్రయత్నంలో ముందుకొచ్చింది. ఈ ఆలోచనతో ముందుకు సాగుతున్న కార్యక్రమాలను భుజాన వేసుకుని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ యాస – భాష, కట్టు – బొట్టు, ఆట–పాటలు మొదలైన విషయాలను తెలియపరిచే "ఆడుదాం డప్పుల దరువేయ్ రా "అనే పాటను గానం చేస్తూ అందులోని "బతుకమ్మ మన బతుకు ఆటే గదరా" అని పాడుకుంటూ తెలంగాణ ప్రజలకు చేరువయ్యింది. దశాబ్దాల కాలం నుండి తెలంగాణ సంస్కృతిపై కొనసాగుతున్న దాడిని ఎదుర్కో వాలంటూ గానంచేసింది. ఈ విషయాలపై స్పందిస్తూ అరుణోదయ సంస్థ మేధావుల ప్రశంసలను అందుకున్నది. గత ఐదేళ్లుగా తెలంగాణను విమల డప్పుల దరువు వేయిస్తున్నది. ఆమె లయబద్ధమైన గొంతులో, అడుగులో మిత్ర రాసిన "ఆడుదాం డప్పుల్ల దరువేయరా – పల్లె తెలంగాణ పాట పాడరా" అనే పాట ఒక సంస్కృతిని మరో సంస్కృతి ఎట్లా మింగుతుందో చెప్పింది అంటూ ప్రొఫెసర్ కాశీం గారి మాటలు ఇందుకు నిదర్శనాలు. తెలంగాణ పల్లెల్లో గ్రామదేవతలకు, ఆడబిడ్డలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఆ మాటకొస్తే బహుజన సముదాయపు ఇంటి దేవతలు, కులదేవతలంతా స్త్రీ ప్రాధాన్యత గల వాళ్లే. మాతృస్వామిక ఆనవాళ్లను, దేశీయ సంస్కృతిని, మౌఖిక సాంప్రదాయాలను ఏదో మేరకు కాపాడుతూ వస్తున్న తెలంగాణ ప్రాంతం బతుకమ్మను ఒక సాంస్కృతిక అస్తిత్వంగా మార్చుకుంది. ఈ సమయంలో ఇదే విషయాన్ని తెలుపుతు మిత్ర "పాడరా పాందుర మన పాట – జన తెలంగాణ మని ప్రతి నోట" అనే పాటలో పోషమ్మ, మైసమ్మ, గ్రామ పోలేరమ్మ, వాగులో గంగమ్మ, అడవిలోని సమ్మక్క, సారక్క, సిబ్బి పూల నడుమున్న గౌరమ్మ, ఆడబిడ్డల జాడ బతుకమ్మలను గుర్తు చేస్తున్న తీరు కూడా అరుణోదయ కళాకారులుగా స్త్రీల ప్రాధాన్యతను తెలిపే బతుకమ్మ వేడుకల్లో పాడుకున్నాము.

2009 నాటికి తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుంది. ఈ సమయంలో ఇఫ్లూ యూనివర్సిటీలో తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్(TSA) విద్యార్థులుగా కోటేష్, గుర్రం సీతారాములు, సతీష్ నైనాలలతో పాటు ఆయా విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్ నాయక్, మాగి వెంకన్న నాకు పేర్లు తెలియని ఎంతోమంది మహిళా విద్యార్థులంతా ఏకమై పండుగ వేడుకలను ఉద్యమ వేదికలుగా మార్చాలనే తపనతో ఇఫ్లూకు ఆనాడు విమలక్క బృందాన్ని ఆహ్వానించి పోరుపాటలతో హోరెత్తించారు. ఆనాటి నుండి ప్రతి తెలంగాణ ఉద్యమ వేదికల్లో బతుకమ్మను పోరాట రూపంగా మలుచుకున్న అరుణోదయ 2010 నాటికి 'బాటలో బతుకమ్మ'గా నామకరణం చేసుకొని ముందుకు సాగింది. 2011 లో కొత్త కొత్త ఉద్యమ రూపాలతో తెలంగాణ ప్రజలు ముందుకు సాగుతున్నారు. సెప్టెంబర్ మాసం బతుకమ్మ పండుగ ప్రారంభం నాటికి సకల జనుల సమ్మె కొనసాగుతుంది. ఆ సంవత్సరంలో పోరు బతుకమ్మగా నామకరణం చేసుకొన్నాము. అదే సందర్భంలో 'తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్' తమదైన పోరాట రూపాలను ఎంచుకుని ప్రజల వద్దకు వెళుతున్నప్పుడు అందులో భాగస్వామిగ ఉన్న అరుణోదయ సంస్థ పోరు బతుకమ్మ పాటను గానం చేసింది.

2011 సెప్టెంబర్ లో విప్లవకవి మిత్ర చర్లపల్లి జైలులో ఉన్నప్పుడు అక్కడినుండి అరుణోదయ కార్యకర్తలకు ఒక పాటను రాసి పంపారు. ఆ పాటను అనేక ఉద్యమ వేదికల్లో బాణీ నల్లుకొని స్వయంగా నేనే ఆలపించిన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్(TUF) నుండి విమలక్క ఉప న్యాసమిస్తే పాట పాడే అవకాశం నాకు తరచుగా లభించేది.

"పోరు బతుకమ్మ ఉయ్యాలో – పోరాట బతుకమ్మ ఉయ్యాలో
సకలజనుల సమ్మె ఉయ్యాలో – సైదోడు బతుకమ్మ ఉయ్యాలో
లాఠీల నడుమనే ఉయ్యాలో – పోటీగా నువ్వాడు ఉయ్యాలో
బంధనాలెదిరించ ఉయ్యాలో – భరిగీసి ఆడాలి ఉయ్యాలో"

అంటూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సకల జనుల సమ్మె, జన ప్రతిఘటన భేరీలు, అరెస్టులు, జైళ్లో ఉద్యమ కారులు బందీలైన విషయాలను వివరిస్తూ వలస పాలనకు ఎదురు బతుకమ్మ తిరగబడుతుందంటూ ఆడి పాడాము.

2012 నాటి బతుకమ్మ కార్యక్రమాల్లో కూడా అరుణోదయ పాల్పంచుకుంది. ఆనాడు TUF చేసిన మిలటెంట్ పోరాటాల్లో ప్రధాన నిందితురాలిగా ఉందని కోచ్ – చైర్మన్ అయిన విమలక్కను అరెస్టు చేసి పోలీసులు మూడు నెలలు జైల్లో బంధించారు. ఈ సమయంలోనే TV5 వారు ట్యాంక్ బండ్ పైన 22 అక్టోబర్ 2012న 32 అడుగులతో బతుకమ్మను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారిణిగా విమలక్క ఆడి పాడాలనే తపనతో వారే స్వయంగా పెరోల్ పై పిలిపించుకుని పాల్గొనే ఏర్పాటు చేశారు. తిరిగి అదే రోజు

సాయంత్రానికి విమలక్క జైలుకు వెళ్లిపోయింది. ఆ సందర్భంలో మా గొంతులో బతుకమ్మపై కొత్త రాగం మారుమోగింది.

"పోరు బతుకమ్మ ఉయ్యాలో
పోరాట బతుకమ్మ ఉయ్యాలో
పోరాట బతుకమ్మకుయ్యాలో
తెలంగాణ ఆరాటముయ్యాలో"

తెలంగాణ ప్రజల పోరుహోరును జైళ్లో బంధిస్తే గునుగులు గొల్లుమన్నాయని, తంగేళ్లు రంగు వెలిసినయని, ముత్యాల పువ్వులు వేదన పడుతున్నాయని, పూల జాతరంతా చిన్న బోయిందని ఆలపించాము. ఒక్క విమలక్కనే కాదు ఉద్యమ మహిళలందరి అరెస్టులకు నిరసనగా గొంతెత్తే ఆటపాటల చూసి ఢిల్లీలో ఉన్న పాలకుల గుండెలదరాలని, పూల జాతరలోనే పోరాటం ఉండాలని నినదించాము. నిరసించే హక్కులు చెరసాల పాలవుతుంటే ఊరురా సబ్బండ కులాలు సవ్వడిగా ఆడుకుంటూ నవధాన్యాల సద్దులను ఇచ్చిపుచ్చుకునే పచ్చని తెలంగాణ సాధన దాకా పోరుబతుకమ్మ సాగాలని కాంక్షించాము.

2013లో పార్లమెంటులో తెలంగాణ బిల్లుకై బతుకమ్మ కార్యక్రమాలు జరిపాము. ఆటపాటల్లో పోరాట స్ఫూర్తి వీడరాదంటూ పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టి ఆమోదింపజేయాలని కోరుతూ ఊరురా వాడవాడలా బతుకమ్మ కార్యక్రమాలు చేశాము. అంతకుముందే అనేక ప్రజా సంఘాలతో ఐక్య ఉద్యమ కార్యాచరణ రూపం దాల్చాలనే ఆలోచనతో బతుకమ్మలో కలిసి ఉన్న రంగురంగుల పూలవలె అన్ని సంఘాల, శక్తుల, వ్యక్తుల ఐక్యత ఎంతో అవసరమని భావించి ప్రజా సంఘాలను ఒక వేదిక పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేసాము. మా ఆలోచనను ఏకీభవించి ఆనాడు మాతో కలిసి నడిచిన సంఘాలు తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (TUF), అరుణోదయ, తెలంగాణ అమ్మల సంఘం, పి.ఓ.డబ్ల్యూ. (స్త్రీ విముక్తి), TRLD, తెలంగాణ లోక్ సత్త, ఎమ్. క్యూ. ఎం., ఆరెకటిక సంఘం, మా హైద్రాబాద్, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఉమెన్స్ టీచర్స్ ఫెడరేషన్(TWTF), తెలంగాణ ఆజాద్ ఫోర్స్, తెలంగాణ జర్నలిస్టు యూనియన్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ సొసైటీ(TFDS), జానపద, తెలంగాణ ధూంధాం, తెలంగాణ మాదిగ దండోర(TMD), విశ్వకర్మ రచయితల వేదిక (రుంజ), తెలంగాణ ఫైన ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ సొసైటీ(TFACS) మొదలైనవి ఉన్నాయి. ఈ సంఘాల ఉమ్మడి అభిప్రాయంగానే ఆనాడు బతుకమ్మను "బహుజన బతుకమ్మ"గా పేరు పెట్టడం జరిగింది. ఈ విధంగా పేరు పెట్టిన ఉద్దేశాన్ని గురించి విమలక్క స్పష్టతనిస్తూ ఇలా అన్నారు.

"బహుజన సమూహంలోని దళితుల్ని బతుకమ్మలకు అంటరాని వాళ్ళను చేశారు. బతుకుమని దీవించే దీవెనలకు దూరం చేశారు. అందుకే బహుజన బతుకమ్మను దళితవాడకు నడిపించాలి. బతుకు పోరాటంలో నేలరాలిన అమరులను ఆ పూలతోనే కొలిచి తెలంగాణను, సామాజిక న్యాయాన్ని, సమన్యాయాన్ని సాధిస్తామన్న సంకల్పంతోనే నిర్వహించాలి. అందుకోసం రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో ఎలాంటి నమూనాను అమలు పరచాలో తేల్చుకోవటానికి బతుకమ్మ నవ్య తెలంగాణ రచనా వేదిక కావాలి. దానికి 'బహుజన బతుకమ్మ' నే నాంది పలకాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ ఆశయం 2013 నాటికి కొంత విజయం సాధించిందనటానికి 11-అక్టోబర్ - 2013న కొడంగల్ ప్రాంతంలో జరిగిన బతుకమ్మనే ఒక ఉదాహరణ.

పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా ఊరు 'రేగడి మైలారం'లో నా చిన్ననాటి నుండి చూస్తున్న బతుకమ్మను కేవలం అగ్రకులాల స్త్రీలే ఆడేవారు. మాదిగ వాడను ఆనుకుని ఉన్న 'పటేల్ చెరువు'లో నిమజ్జనానికి వచ్చిన సమయంలో పరుపుబండల మీద ఆడిన బతుకమ్మ ఆటలకు పరవశించి ముందుకురికే వాళ్ళం. కానీ మమ్మల్ని అంటరానివాళ్ళంటూ దూరంగా పొమ్మని హెచ్చరికలు చేసినప్పుడు మనసు గాయపడ్డ చిన్నారులమెందరమో! ఆ బతుకమ్మలు అల్లుకున్న పూలల్లో మా దొడ్డిలో పూసిన బంతిపూలు కూడా చేరిన జ్ఞాపకం నాకుంది. పూల నిచ్చిన నా చేతులు చప్పట్లతో ఎందుకు సరితూగ రాదని ఆలోచించి నాకు కొంత ఉద్యమ చైతన్యం వచ్చిన తర్వాత 2013లో కొడంగల్ పట్టణంలో ఒక సభను ఏర్పాటు చేశాము. ఆ మార్గంలోని మా ఊరిలో ప్రజలను ఐక్యంగా ఆడాలని కోరాను. వెంటనే బలిజ, కాపు, గౌడ, గొల్ల తదితర స్త్రీలంతా నాతో పాటు మా కులపు స్త్రీలదందరిని విమలక్క సమక్షంలో సాదరంగా ఆహ్వానించారు. ఆనాటి నుండి నేటికీ ఐక్యంగా పండుగ జరుపుతున్నారు. ఇలాంటి గ్రామాలు చాలానే ఉన్నాయి. మెదక్ జిల్లా సూరారం మొదలుకొని ప్రతి సంవత్సరం ఏదో ఒక గ్రామంలో ఈ సమస్యను ఎత్తి పడుతూనే ఉన్నాం.

ఈ సంవత్సరం నాటి రాజకీయ పరిస్థితులను కూడా పోరాటపాటలుగా పాడుకున్నాం. తెలంగాణ 10 జిల్లాల ప్రత్యేకతలను, వాటి గొప్పతనాన్ని కొనియాడుతూ అన్ని జిల్లాల నడుమున్న చార్మినార్ చుట్టూ జరిగే అల్లర్లను, గోల్కొండ బోనాల పండుగ ప్రాధాన్యత మరిచిన తీరును నిరసిస్తూ తెలంగాణలో ఉన్న మోసగాళ్ళు ఎవరో, వేషగాళ్ళు ఎవరో నీవే గుర్తించి కలుగుల్లోని దొంగలను బయటికి లాగాలని వేడుకొన్నాము. అన్ని జిల్లాల నడుమున్న చార్మినార్ చుట్టూ జరిగే అల్లర్లను,

గోల్కొండ బోనాల పండుగ ప్రాధాన్యత మరిచిన తీరును నిరసిస్తూ తెలంగాణలోని మోసగాళ్లను వేషగాళ్లను కలుగులోని దొంగలను లాగాలని కైకట్టి పాడుకున్నాం. ఈ మోసాలను అంతం చేయటానికి కష్టజీవులను ఏకం చేయాలని అప్పుడే తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టడం సాధ్యమవుతుందని ఆడి పాడాము.

2014లో స్వరాష్ట్రం ఏర్పాటు తర్వాత తిరిగి తొలి తెలంగాణ పండుగగా జరుగుతున్న సందర్భంలో అభివృద్ధి నమూనాను నిర్వచించుకొని స్థానిక కులభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలను విశ్లేషించుకోవడానికి, ప్రపంచీకరణ విధ్వంసకర పరిణామాలను బేరిజు వేసుకోవటానికి, సహజ సంపదతో ముడిబడ్డ బతుకమ్మ పండుగ సందర్భోచితమైంది. గుట్టలు, చెట్లు చెలుకలు, వనాలు, పండ్లు, పువ్వులు, సకల జీవరాసులతో వైవిధ్య పూరిత సహజత్వం తెలంగాణ సొంతం. వీటన్నింటినీ రక్షించాలంటూ "సహజ వనరులు కాపాడే ఉద్యమంగా బహుజన బతుకమ్మ" జరిపాము. 'పూల బతుకమ్మ బతుకునిచ్చేది – ప్రపంచీకరణ ప్రజల్ని బలి తీసుకునేది'.

'ఉన్నోళ్ల ఆర్భాటం ఉత్సవం – పేదోళ్ల ఆరాటం ఉద్యమం' అంటూ నినాదాలతో ముందుకు సాగాము. రాష్ట్ర ఏర్పాటు తర్వాత నవ తెలంగాణ నిర్మాణంలో ప్రజలంతా మమేకమై ముందుకు సాగాలని కోరుకున్నాం.

"జై జై జై జై జైరా బహుజనులకు

జై జై జై జై జైరా బతుకమ్మలకు" అనే పాటతో ప్రపంచీకరణ వేటలో, రియల్టర్ల మాయలో ధ్వంసమైన భూములు, పంటలు కుల వృత్తులన్ని కొత్త రాష్ట్రంలో మళ్లీ వికసించాలని అప్పుడే ఆడా–మగా సమానమననే బహుజనుల సంస్కృతి వెల్లి విరుస్తుందని చాటి చెప్పాము.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయి సంవత్సరం గడిచిన గాని రైతుల ఎతరులు తీరలేదు. కూలీల పరిస్థితి మరింత దీనంగా మారిందే తప్ప వారి బతుకుల్లో మార్పు లేదు. అందుకే 2015 నాటికి "రైతాంగం బతుకుకై – కూలీలకు మెతుకుకై" అనే నినాదంతో పాడుదాం నవతెలంగాణ బతుకు పాట అంటూ ప్రజల్లోకి వెళ్ళాము. వనరులు భూములు కార్పొరేట్లకు దోచిపెడితే ఎవుసం పండుగ ఎట్లయితది? బంగారు తెలంగాణ యాడికెళ్లి వస్తది? అంటూ"ప్రశ్నిస్తూ కదులుదాం – బతికుండి సాధిద్దాం" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం నింపాము. ప్రజల్లో నెలకొన్న అశాంతిని ప్రశ్నిస్తూనే అసమ సమాజాన్ని నిర్మూలించి నూతన రాష్ట్రంలో సమన్యాయం జరగాలని కాంక్షించిన ప్రజలకు, ఉద్యమకారులకు కూడా ఇదే సంవత్సరం ఎదురు దెబ్బ తగిలింది. ఎన్కౌంటర్లు లేని తెలంగాణ కావాలని నినదించిన పాలకులే రాష్ట్రం ఏర్పాటైన సంవత్సరం కాలానికే ఎన్కౌంటర్ జరిగింది. ఈ ఎన్కౌంటర్ పేరా తంగెళ్ళ శృతి, సాగర్‌లు హత్య గావించబడ్డారని వారి త్యాగాలను ఎత్తి పడుతూ 'తల్లి చాకలి ఐలమ్మ బతుకమ్మ – చెల్లి తంగేళ్ల శృతి బతుకమ్మ' అంటూ స్మరిస్తూ ప్రజల్లోకి వెళ్ళింది బహుజన బతుకమ్మ. ఇదే సంవత్సరంలో తెలంగాణ సేవా సమితి – నవీముంబై, తెలంగాణ అసోసియేషన్ అంధేరి వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 21న తలపెట్టిన బతుకమ్మ ఉత్సవ కమిటీ కార్యక్రమంలో కూడా పాల్గొన్నది.

2016 నాటికి ఒక భౌగోళిక తెలంగాణ ఏర్పాటు ఒకటే సరికాదనే అభిప్రాయం తెలంగాణ ప్రజలలో ఏర్పడింది. భూమిలేని పేదల బ్రతుకులు అన్యాక్రాంతమైన తీరును గుర్తించి 'మన భూములు మనవే – మన వనరులు మనవే అంటూ చాటి చెప్పాల్సిన సందర్భం. అందుకే పంచభూతాలుగా ప్రజల భావనలో ఉండే నేల, నీరు, గాలి మొదలైనవి విషమవుతున్న మాట విధితమే. వీటిని సుదీర్ఘకాలం నుండి రకరకాల పద్ధతుల్లో కాపాడుతూ వస్తున్న అధిక సంఖ్యాక ప్రజలు బహుజనులే. అట్లాంటి భూములు నేడు బహుళ జాతి కంపెనీల మాయలో చిద్రమవుతుంటే "పంచభూతాలను నమ్ముకునే వాళ్ళు బహుజనులు – అమ్ముకునే వాళ్ళు బహుళ జాతి కంపెనీల దోపిడిదారులు"అంటూ చాటుదామన్నది. ఒక ఊరు పచ్చగా కళకళలాడుతూ ఉండాలంటే మా ఊరును ఒక ఊరు పచ్చగా కళకళలాడుతూ ఉండాలంటే ఆ ఊరును అనుకుని ఉన్న కొండలు, వాగులు, కుంటలు, చెరువులన్ని ధ్వంసం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది అందుకే "వాగులకు ఆదెరువైన గుట్టలను – ఊరుకు ఆధారమైన చెరువులను – పాతాళ గంగను ఇచ్చే ఇసుకను కాపాడుకుందాం" అంటూ 2017లో బహుజన బతుకమ్మ పొరపాటనందుకుంది. నిర్భయ ఘటనతో దేశవ్యాప్తంగా ఎగిసిపడిన మహిళా ఉద్యమాల ఉధృతిని చూసి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తీసుకొచ్చిన ఇంకా ఏదో ఒక చోట మహిళల మీద దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ దాడులలో పసిపిల్లలు కూడా లేకపోలేదు. దిశా లాంటి సంఘటనలు 2018 నాటికి నిత్య నూతనంగానే కనిపిస్తున్నాయి. అందుకని మహిళల మీద జరిగే అన్ని రకాల దాడులను నిరసిస్తూ బహుజన బతుకమ్మ ముందుకెళ్ళింది. ప్రపంచంలోనే ఒక ఆదిమ జాతిగా ప్రఖ్యాతిగాంచిన చెంచు జాతిని, అడవిని అనుకుని జీవిస్తున్న శ్రమజీవులను, అడవులను, వృక్ష జంతు జాతులన్నింటినీ ముంచేసే విధంగా యురేనియం ఖనిజాల కోసం నల్లమలలో 2019లో పరీక్షలు ప్రారంభమైనాయి. మన్ననూరు నుండి మద్దిమడుగు వరకు

విస్తరించిన అప్పర్ ప్లాటూలో 84 కిలోమీటర్ల పరిధిలోని యురేనియం తవ్వకాలు జరపాలని (యూ.సీ.ఐ.ఎల్) ప్రతిపాదించిన అది నల్లమలను ప్రత్యక్షంగా విధ్వంసం చేస్తుందని భావించి నల్లమల పరిరక్షణ కోసం బహుజన బతుకమ్మ నినదించింది. 2020 ప్రపంచ వ్యాపితంగా ప్రజలను భయాందోళనకు గురి చేసిన కరోనా సమస్యను కూడా ఎత్తి పట్టింది. మనిషికి మనిషి తాకరాదని గాలి సోకరాదని ప్రజల్లో ఆలోచన పరంపరలు ముంచెత్తుతున్న సమయంలో కరోనా నిద్రిస్తూ మనల్ని మనం కాపాడుకునే దిశగా పయణించాలని చాటి చెప్పింది. వ్యవసాయక సంక్షోభం నుండి తమను తాము కాపాడుకోవడానికి పది నెలలుగా ఢిల్లీలో చేస్తున్న ఆందోళన రైతాంగానికి, పోడు భూములకు పట్టాలకై ఉద్యమిస్తున్న ఆదివాసులకు, నిరుపేదలకు సంఘీభావం ప్రకటిస్తున్నామంటూ సార్వభౌమిక వ్యవసాయమే లక్ష్యంగా బావసారుప్యత కలిగిన శక్తులందరితో బహుజన బతుకమ్మ కలిసి నడవాలని గుర్తు చేస్తూ "ప్రకృతి వ్యవసాయం - రక్షిత పలసాయం అంటూ ముందుకు సాగింది. **ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ / ఏమేమి కాయప్పునే గౌరమ్మ / తంగేడు పువ్వప్పునే గౌరమ్మ/ తంగేడు కాయపునె గౌరమ్మ...** అంటూ ప్రకృతి పూల గురించి, ఎర్రోడ్ల బువ్వ, నల్లోడ్ల బువ్వ బువ్వ గురించి, స్త్రీల సమస్యల గురించి ఈ విధంగా అపారమైన జానపద గీతాలు ప్రజల జీవన ప్రయాణంలో కనిపిస్తాయి. కానీ ఇటువంటి పంటలన్నీ ఇవాళ ఏ రైతు పండించడం లేదు. అందుకే సమాజానికి బలవర్ధకమైన ఆహారం కూడా దొరకడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రకృతి వ్యవసాయమే రక్షిత ఫలసాయం అంటూ 2021లో బహుజన బతుకమ్మ ఆడి పాడింది.

కుల నిర్మూలన అనగానే ఎక్కువ కులాల వారిని తక్కువ కులాల వారు తాకరదనే ధోరణిలో ఉండిపోయేవారు ఎంతో మంది ఆధునిక సమాజంలో ఉన్నారు. కానీ అంతర్గత సమస్యలు ఎన్నింటిలోనో కుల నిర్మూలన తక్షణ కర్తవ్యం అనే ఆలోచనలు మనల్ని తట్టి లేపుతాయి. వాటిలోని పరువు హత్యలు, రెండు గ్లాసుల పద్ధతి, ప్రైవేటు విద్యా - ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలు,వృత్తి స్వేచ్ఛ, నివాస స్వేచ్ఛ, వివాహ స్వేచ్ఛ, వీటన్నింటి కోసం ప్రజలను చైతన్యం చేసే దిశగా 2022లో పయనించింది. పొద్దంతా శ్రమచేసి అలసటను మరిచిపోవడానికి సాంప్రదాయకంగా వస్తున్న తాటి చెట్లు, ఈత చెట్ల నుండి తీసిన కల్లును సేవించి నిద్రించే పద్ధతి ప్రజల సంస్కృతిగా ఈ తెలంగాణ సమాజంలో కనిపిస్తుంది. కానీ అట్లాంటి తెలంగాణ పల్లెల్లోకి నేడు రకరకాల మత్తు పానీయాలు రావటం, డ్రగ్స్, గంజాయి లాంటి వాటితో వయసుతో పని లేకుండా యువకులంతా చెడు దారిలో నడుస్తున్నారు. ఆ మత్తులో మహిళలపై దాడులు మరింత పెరిగిన విషయాలను చిన్న పిల్లలను బలి తీసుకున్న విషయాలను ఫోక్సో చట్టాలు రుజువు పరుస్తున్నాయి. అందుకే "మద్యం మొత్తం చిత్తుచేస్తూ – స్త్రీలపై అఘాయిత్యాలను ఎదిరిస్తూ" బతుకమ్మ పండుగను పూల కవాతు – స్త్రీల కవాతుగా నడపాలని 2023లో ప్రయాణం చేసింది. మహిళల ప్రాధాన్యత కలిగిన పండుగలో మహిళల మనుగడకే ప్రమాదం పొంచి ఉండే పరిస్థితులమిటో చాటి చెప్పాలని స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును పొందే దిశగా 2024లో ముందుకు సాగింది.

ప్రకృతికి మానవ సమాజానికి మధ్య గల సంబంధం తరతరాలుగా మనం చర్చించుకుంటూనే ఉన్నాం. ప్రకృతి విధ్వంసంతో ప్రకృతితో పెనవేసుకోవాల్సిన మనిషి వికృతీకరించబడుతున్నాడని అర్థమవుతుంది. రోజురోజుకు ప్రకృతిలోనూ మానవ సమాజంలోనూ వైవిద్యం అంతం చేయబడుతుంది. సహజత్వానికి చిహ్నమైన పల్లెలన్నీ ప్రకృతికి దగ్గరగా ఉండేవి. అవి నేడు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. మానవ విలువలు అంతరిస్తున్నాయి. అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసరూపంగా ఇది ప్రజలకు కనిపిస్తూనే ఉంది. ఈ భయానకమైన ప్రమాదం ఏమిటో తెలియకుండానే మన జీవితంలోకి చొచ్చుకు వచ్చి రోజురోజుకు ఆర్థిక-సామాజిక- సాంస్కృతిక విధానాలన్నీ ప్రశ్నార్థకంగా మిగులుతున్నాయి. ఈ విషయాలను అర్థం చేయించడానికి 2025 నాటికి "ప్రకృతి రక్షణే - ప్రజల రక్షణ" అంటూ బహుజన బతుకమ్మ ప్రజల్లోకి వచ్చిన మనకు తెలువకుండానే ఆ నినాదంలోకి పయనిస్తూనే ఉన్నాం. ఇక బహుజన బతుకమ్మ ఎప్పటిలాగే తొలి వాద (దళిత వాద)ల నుండి బయలుదేరి ప్రకృతి విధ్వంసం అంటే నాగరికత ధ్వంసం అని చాటుతూ సహజమైన కొండలను, అడవులను, పంటలను, భూములను కాపాడుకోవాలని అన్ని రకాల దాడుల నుండి ప్రజలను దూరం చేయాలని కదిలినప్పుడు ఇది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ పతాక చిహ్నంగా లక్షలాది ప్రజల జీవితాల్లోకి చొచ్చుకొని పోతుంది అనటంలో సందేహం లేదు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రకృతికి దగ్గరగా ఉండి ప్లాస్టిక్ పువ్వులను కృత్రిమ రంగులను తెగించాలన్న స్పృహతోనైనా బహుజన బతుకమ్మను స్వాగతిద్దాం చివరకు పాటలతో కలిసి ఆడుదాం పాడుదాం.

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్ (పి.టి)
ఎం.జి.యు., నల్గొండ.

ఈ రిజర్వేషన్స్ మాకు ఇంకెన్నాళ్లు?

ఇస్రం సంతోష్

ఇస్రం సంతోష్, ఏజన్సీ ప్రాంతంలో పుట్టి, పెరిగినవాడు. దాన్ని దాటుకొని యూనివర్సిటీ చదువుకు వచ్చినోడు. మేధావులుగా చలామణి అవుతోన్నవారు, ఏమాత్రం క్షేత్ర అనుభవం లేకుండా, ఎవరో ఇచ్చిన సమాచారంతో సమాజంపై తీర్మానాలు చేస్తుండడం ఆయన్ని ఊర్కోనివ్వలేదు. అసలైన సమాజాన్ని చూస్తోన్న ఇస్రం సంతోష్‌కు తన మూలవాసులు కొత్తకోణంలో కనిపించడం మొదలెట్టారు. నిరంతరం క్షేత్ర పర్యటనలు చేస్తూ, తన అనుభవాలను చిత్రాల్లోనే కాకుండా అక్షరాల్లోనూ ప్రపంచానికి చాటుతున్నవాడు. ఆ విషయాల్ని నడుస్తున్న తెలంగాణ మాస పత్రికకు 'దారి చెప్పే కథలు' కాలమ్ రాయమని అడగగానే ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు. ఇకనుంచి ప్రతినెలా ఇస్రం సంతోష్, సమాజంలోని వాస్తవ పరిస్థితులను నడుస్తున్న తెలంగాణ పాఠకులతో పంచుకుంటారు. ఆ స్వచ్ఛమైన జీవిత ఆవరణలోకి వెళ్దాం రండి...

చిన్నప్పుడు మేం ప్రైమరీ స్కూల్‌లో ఉన్నప్పుడు అడవిల జిట్టీత పండ్లు, పాల పండ్లు, తునికి పండ్లు, పరికి పండ్లు ఏరుకొచ్చి మేడారం జాతరకు వచ్చేవాళ్లకు అమ్మేది. తర్వాత నాకు పదమూడు, పద్నాలుగు ఏండ్ల వయసు ఉన్నపుడు హైస్కూల్‌లో చదువుకునే మా ఇండ్లల్లో ఉండే ఫ్రెండ్స్ అందరం ఒక ముఠాలా ఏర్పడి, ఇసుక పనులకు, పడుగు పెట్టి గడ్డి గుంజడానికి, మేస్త్రి పనులకు, మేడారం జాతర పనులకు, కాంట పెట్టడానికి పోయేటోల్లం. భూములున్న మా క్లాస్మేట్స్ పొలాలకే పనికి పోయేవాళ్లం. పెద్దోళ్లు చేసేంత బరాబరి పని మేము చేసినా, మాకు వాళ్లకు ఇచ్చినంత పైసలు ఇయ్యకపోయేది. అయినా మేము ఏం అనకుండా ఆ పైసలు తీసుకునేవాళ్లం. ఆ వచ్చిన పైసలతో పస్ర అంగట్ల బట్టలు కొనుక్కునేది. ఎక్కువ భాగం మాత్రం గైడ్‌లు కొనుక్కోడానికి, ఎగ్జామ్ ఫీజులు కట్టడానికి వాడేవాళ్లం. ఇంకా నా ఫ్రెండ్స్ కొందరు అయితే 15 సంవత్సరాల వయసులోనే వారి కుటుంబ బాధ్యతలు తీసుకొని కూలి చేసి ఇంటిని నడిపే పరిస్థితి వచ్చింది. దాదాపు నాతోపాటు చదువుకున్న 70% మంది నా ఫ్రెండ్స్ చదువు హైస్కూల్‌లోపే బంజేసి ఫ్యామిలీ బాధ్యతలు తీసుకున్నారు. 80% నాస్నేహితులు 18 ఏండ్ల లోపే అమ్మాయిలు, అబ్బాయిలు కూడా పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇప్పుడు వారికి 13 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లలు ఉన్నారు. నేను ఊరు వదిలి బయటకు వచ్చి చదువు బంజేసి మళ్లీ స్టార్ట్ చేసి ఆ పని ఈ పని చేసుకుంటూ, పడుకుంటూ, లేచుకుంటూ అష్టకష్టాలుపడి చదువుకోగలిగిన. ఏజెన్సీ ఏరియా నుండి లేటుగా అయినా, యూనివర్సిటీ వరకు వచ్చి చదువుకున్న అతి కొద్దిమందిలో నేను ఒకడిని. కనీసం సానుభూతి చూపకుండా కులం, మతం, ప్రాంతం, రంగు, భాషల ప్రాతిపదికన ఇక్కడి సమాజం చేసే వివక్షలు అదనం.

మొన్న పని మీద దేవరకొండ పోయినపుడు, రోడ్ మీద ఈతపండ్లు అమ్ముకుంటున్న రమావత్ కృష్ణ కనపడ్డాడు. వాళ్లది రేగల తండా అట. అడవికి పోయి ఈత పండ్లు ఏరుకొని ఆరో తరగతి చదివే కృష్ణ, ఎనిమిదో తరగతి చదివే అతని అక్క ఇద్దరూ చెరో ప్లేట్‌లో చెరికొన్ని ఈతపండ్లు పెట్టుకుని అమ్ముకుంటున్నారు. నేను 20 రూపాయలు ఇచ్చి కొనుక్కునేటపుడు– "పొద్దుందాకా అమ్మితే ఎంత వస్తాయి కృష్ణా?" అంటే, "పొద్దున దాకా కూసుంటే రెండు వందల వరకు వస్తాయి అన్నా" అన్నాడు. ఆ వచ్చిన పైసలతో వాళ్ల పేరెంట్స్‌ని ఇబ్బంది పెట్టకుండా వాళ్లకు కావలసినవి ఏమన్నా కొనుక్కుంటారట. బుక్స్‌కి గిట్ల కూడా వాడుకుంటారట. ఒకొకసారి ఈ డబ్బులు వాళ్ల పేరెంట్స్‌కి కూడా ఇస్తారట. వాళ్ల పేరెంట్స్ ఇద్దరూ నిరక్షరాస్యులే అట. అవన్నీ వినగానే ఒక్కసారి నా బాల్యం గుర్తొచ్చింది. ఒక్క నా బాల్యం మాత్రమే కాదు, 99% మార్జినలైజ్డ్ సెక్షన్స్ నుండి వచ్చిన మొదటి తరం విద్యార్థులు అందరూ ఇట్లా పని చేసుకుంటూ చదువుకున్నవాళ్లే. ఆడుతూ పాడుతూ వేరే ఏ ఆలోచన లేకుండా చదువుకోవాల్సిన

టైంలో కుటుంబ బాధ్యతలో భాగం అవడం, సొంతంగా పైసలు సంపాదించుకొని చదువుకోవడం. ఇప్పటికి కూడా అది ఏమాత్రం మారలేదు.

నేను మాట్లాడే గాప్‌లోనే ఒక పెద్దమనిషి వచ్చి, ఒక్క పైసా ఇయ్యకుండా "అరే నేనూ మీ అయ్యా దోస్తులంరా" అనుకుంటా, పిరికెడు ఈతపండ్లు పట్టుకుపోయిండు. ఇంకొకామె వచ్చి, మాట్లాడుకుంటా మాట్లాడుకుంటా దోషెడు తిన్నది. చదువుకోవాల్సిన ఏజ్‌లో ఆ పనులు చేసుకుంటూ చదువుకునే పిల్లలపట్ల కనీసం జాలిలేకుండా ప్రవర్తిస్తున్నది ఈ సమాజం. PLFS సర్వే ప్రకారం 2025లో, తెలంగాణ 76.9% అక్షరాస్యత రేటుతో భారతదేశంలో అత్యల్ప అక్షరాస్యత రేటు కలిగిన 6వ రాష్ట్రంగా నిలిచింది. NCRB రిపోర్ట్ ప్రకారం, బాల్యవివాహాలు ఎక్కువగా ఉన్న ఎనిమిది రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. ప్రభుత్వాలు ఎన్ని స్కీమ్స్ తీసుకొచ్చినా, ఆ సమాజంతో ఉండి అక్కడి వారి కుటుంబ పరిస్థితులు అర్థంచేసుకోకుండా ఏం మార్పు తీసుకురాలేవు అని గుర్తుంచుకోవాలి. కానీ మార్జినలైజ్డ్ సెక్షన్స్ కోసం పనిచేస్తున్నాం అని చెప్పే ఎన్‌జీఓలు, ఇతర సంస్థలు మాత్రం ఈ నిజాన్ని దాచేస్తున్నాయి.

ఫైవ్ స్టార్ హోటల్స్‌లో పెద్ద పెద్ద గవర్నమెంట్ ఆఫీసర్లతో పెట్టుకునే మీటింగ్స్‌లో ఆకర్షణీయమైన గ్రాఫ్స్, ప్రజెంటేషన్‌లతో ఫ్లూయెంట్ ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతూ "మేము పని చేసే మార్జినలైజ్డ్ సెక్షన్‌ని మొత్తం ట్రాన్స్‌ఫార్మ్ చేసేసినం" అని చెబుతూ ప్రభుత్వాన్ని మిస్ లీడ్ చేస్తున్నాయి. ప్రభుత్వాల నుండి హక్కుగా దక్కాల్సినవి కూడా దక్కకుండా చేస్తున్నాయి. చదువు స్టార్ట్ అయిన దగ్గర నుండి ప్రతి ఒక్క వ్యవస్థ మార్జినలైజ్డ్ కమ్యూనిటీస్‌ని వాడుకొని వదిలేస్తున్నాయి. ఇప్పుడు చెప్పండి ఈ రిజర్వేషన్ మాకు ఇంకెన్నాళ్లు?

రచయిత: ట్రావెల్ ఫోటోగ్రాఫర్

భాషా ప్రయోజనాన్ని నిరూపిస్తే యువత నేర్చుకుంటుంది

- ఆచార్య వై.రెడ్డి శ్యామల

ఇంటర్వ్యూయర్స్: నూకాలమ్మ, దుష్యంత్,
సుచిత్రారావు, తరుణ్, కావ్య, పవంతిక

ఈ ఇంటర్వ్యూ రెండు విషయాల్లో ప్రత్యేకమైంది. ఒకటి, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషాదినోత్సవాలు జరుగుతోన్న ఈ నెలలో తెలుగు భాషపై విశేషమైన కృషిచేస్తోన్న ప్రముఖ భాషాశాస్త్రవేత్త ఆచార్య వై. రెడ్డి శ్యామల గారిని ఇంటర్వ్యూ చేయడం. రెండు, ఎక్కడో మలేసియాలో ఉంటూ, తెలుగుమీద ప్రేమతో 'తెలుగు డిప్లొమా కోర్స్" చేస్తున్న మలేసియన్ తెలుగు విద్యార్థులు చేసిన ఇంటర్వ్యూ కావడం. వారి ప్రశ్నలు, తెలుగు భాషపై వారికున్న ఆలోచనలు ఈ ఇంటర్వ్యూలో ప్రతిఫలిస్తాయి. విదేశీయులకు తెలుగు నేర్పించడంలో విస్తృతమైన అనుభవమున్న ఆచార్య వై. రెడ్డి శ్యామల గారి భాషాకృషి, వారి ఆలోచనలు తెలుస్తాయి. అటువంటి విలువైన ఇంటర్వ్యూను నడుస్తున్న తెలంగాణ మాస పత్రికలో మీకోసం.

1. నూకాలమ్మ: మీ ఊరూ, కుటుంబ విషయాలు చెప్తారా?

మా నాన్నగారి పేరు శ్రీ వెంకట రమణరావు. అమ్మగారి పేరు శ్రీమతి రాజేశ్వరి. నాకు ఒక అన్న, చెల్లి ఉన్నారు. నా భర్త పేరు శేషగిరి రావు. నాకు ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయి. ఒక అమ్మాయి. మా ఊరి పేరు కమ్మపల్లె. తిరుపతికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నేను పదవ తరగతి వరకు తిరుపతిలో చదువుకున్నాను. 1979లో హైదరాబాద్ వచ్చాను. తర్వాత డిగ్రీ బీ.కాం. చేశాను. తెలుగులో భాషాశాస్త్రంలో ఎం.ఏ. చేశాను. పుస్తకాలు రాసాను.

2. నూకాలమ్మ: విస్తృతమైన మీ బోధనానుభావంలో మీరు రాసిన పుస్తకాల గురించి చెప్తారా?

భాషాశాస్త్రం మీద, భాషాబోధన మీద పుస్తకాలు రాసాను. నిఘంటువులు కూర్చాను. జానపద విజ్ఞానం మీద కూడా పుస్తకాలు రాసాను. ద్వితీయ భాషగా తెలుగు బోధన, అన్నమాచార్య పద కవితలు–మధురభక్తి, నిఘంటు నిర్మాణం–భాషాబోధన, ప్రసిద్ధ తెలుగు నిఘంటువులు–లక్షిత ప్రయోజనాలు, తెలుగులో సాంకేతిక పరిభాష–నిర్మాణం, Oxford compact English-English-Telugu Dictionary, ఆక్స్ ఫర్డ్ కాంపాక్ట్ ఇంగ్లీష్–ఇంగ్లీష్–తెలుగు డిక్షనరీ, పారిభాషిక నిఘంటువు(అంతర్జాల ముద్రణ), అనేక స్థాయిలవారికి పాఠ్య పుస్తకాల తయారీ మొదలైన చేసే అవకాశం వచ్చింది. ఇవన్నీ విద్యాత్మక అవసరాల్లోంచి పుట్టుకొచ్చాయే కానీ, పనిగట్టుకొని ఇది రాయాలి అని రాసింది ఏదీ ఈ పుస్తకాల్లో లేవు. ఆయా కాలాల్లో ఆయా అవసరాలను తీర్చే క్రమంలో నా కృషి మూలంగా రావడం నాకు సంతృప్తినిచ్చే అంశంగా నేను భావిస్తున్నాను.

3. దుష్యంత్: మీకు తెలుగు భాషను అధ్యయనం చేయాలనే ఆసక్తి ఎలా వచ్చింది?

మా చిన్నపుడు చదువులలో శ్రద్ధ చూపించేవాళ్ళంతా డాక్టర్ లేదా ఇంజినీర్ అవుతారని తలిదండ్రులు అనుకునేవారు. ఆడపిల్లలు అయితే, కచ్చితంగా ఎం.బి.బి.ఎస్. చేసేవారు. కాని నేను డాక్టర్ అవనని ఎనిమిదో తరగతిలోనే తెలిసిపోయింది. ఎందుకంటే, నేను చిన్న జంతువునే డిసెక్ట్ చెయ్యలేకపోయాను. నాకు లెక్కలు అంటే చాలా ఇష్టం. కాని. ఇంటర్మీడియట్ లో లెక్కలు తీసుకునే అవకాశం పోయింది. దాని తరువాత నేను కామర్స్ చేసాను. మనం చదువులో ఎప్పుడూ శ్రద్ధగా ఉండాలి. ఎందుకంటే ఆ చదువు ఎప్పుడు, ఎక్కడ మనకు ఉపయోగ పడుతుందో మనకు తెలియదు. నేను డిగ్రీ చేస్తున్నప్పుడు, నాకు ఒక తెలుగు మాస్టర్ ఉండేవారు. ఆయన పేరు ఓగేటి అచ్యుతరామశాస్త్రి గారు. ఆయన, నేను M.A తెలుగు చేయాలని పట్టుపట్టారు. నేను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లో చేరాను. అక్కడ గొప్ప పండితులు ఉండడం వలన నేను సాహిత్యం ఇష్టంతో నేర్చుకున్నాను. సాహిత్యంలో పద్యాన్ని రాగయుక్తంగా పాడితే, మీకు ఎంత ఆనందం కలుగుతుందో, ఒక కొత్త పదం నేర్చుకున్నపుడు నాకు అంతే ఆనందం కలుగుతుంది. నేను తెలుగు రెండవ భాషగా ఎందుకు చెప్తున్నానంటే, మా నాన్నగారు, మా ఆచార్యులు పరిమి రామ నరసింహం గారు తెలుగు రానివారికి తెలుగు నేర్పించేవారు. అలాంటివారు మా ఇంటికి వచ్చేవారు. నేను వాళ్ళను చూసి, తెలుగు రాకపోతె ఎలా

మాట్లడుతారు అని అనుకునేదానిని. ఆ తరువాత భాషలు, వాటి నిర్మాణం ఎలా ఉంటాయో నాకు అర్థమయింది. నాకు ఇలా భాషాబోధనపైన శ్రద్ధ కలిగింది. దానిలో నేను ఎమ్.ఫిల్ చేసాను. నేను అన్నమయ్యని కొంతైనా అర్థం చేసుకోవచ్చు అని అన్నమాచార్య మీద తెలుగులో Ph.d చేసాను. ఆయన ప్రతిపాదించిన మధురభక్తిపై Ph.d. చేసాను. అన్నమయ్య దేవుడిని స్నేహితునిలా భావించి కీర్తనలు రాసారు. అంటే, ఆయన భగవంతుడికి ఎంత దగ్గరగా అనుభూతి చెందారో!

4. పవంతిక: మీరు తెలుగు భాష ఎంతో ఇష్టంతో నేర్చుకున్నారు, కానీ అప్పటికాలంలో, ఒక మహిళగా డాక్టరేట్ వరకు చదువుకున్నారు. ఇంత పెద్ద ప్రయాణంలో ఒక మహిళగా మీరు ఎటువంటి అడ్డంకులు ఎదుర్కొన్నారు?

ఇది నేను ఎప్పుడూ చెప్పాలనుకుంటాను. నాకు ఒక పెద్ద అనుకూలత (advantage) ఏంటంటే మా నాన్న గారు మరియు అమ్మ గారు చదువుకున్నవాళ్ళు. ఆ కాలంలోనే మా అమ్మ B.A. చదువుకున్నారు. ఆలా విద్యావంతులు కుటుంబంలో పుట్టడం వల్ల నేను చదువుకుంటే అడ్డం చెప్పే వాళ్ళు ఎవరు లేరు. కానీ నేను కచ్చితంగా చదివి తీరాలి అనే వాతావరణం కూడా నాకు లేదు . నాకు నచ్చింది చదువుకునే స్వేచ్ఛ కూడా ఉంది. అయితే నాకు చదువుకోవాలని చాలా ఆశ. డిగ్రీ అయిపోయాక, మా నాన్న గారు, అమ్మ గారు నన్ను అడిగారు "నువ్వు చదువుకుంటావా? లేకపోతే పెళ్లి చేసుకుంటావా?" అని, "నేను చదువుకుంటాను" అన్నాను. M.A అయిపోయాక మళ్ళీ కూర్చో పెట్టి అడిగారు, అప్పుడు పరిశోధన (research) చెయ్యడం కుదరదు అని నేను M.Phil చేసాను. M.Phil అయ్యాక ఇంకా వారు అడగలేదు, పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పుడు ఒక సంబంధం కుదిరగా, నేను మా వారిని అడిగిన ఒకే ప్రశ్న, "నేను చదువుకుంటాను, ఉద్యోగం చేసుకుంటాను." దీనికి ఒప్పుకుంటే మనం పెళ్ళి చేసుకోవచ్చు అని చెప్పను. ఆడవాళ్ళకి ఉద్యోగాలలో చేరినాక చాలా అడ్డంకులు వస్తాయి. స్త్రీలు ఎదగాలంటే సమయాన్ని ఎంతో తెలివిగా ఉపయోగించుకోవాలి. ఎలా అంటే ఒక పని చేసే సమయంలోనే రెండు పనులు చేయగలగాలి. అంతేకాకుండా మిగిలిన వారు 5 గంటలు పని చేస్తే, మనం 7 గంటలు పని చెయ్యాలి. ఇలాంటి వాటిని మనం అధిగమిస్తే, మనం అనుకున్నది సాధించవచ్చు. కొంచం ఆదనపు శ్రమ పడాల్సి వస్తుంది, ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవాలి. ముఖ్యంగా సమయం, ఆరోగ్యం, ఇంకొకటి చాలా సున్నితమైన అంశం (sensitive) పిల్లల్ని పెంచడం. ఉదాహరణ: వాళ్ళకి జ్వరం వస్తుంది మీరు ఆఫీస్ కి వెళ్ళాలి. వీరికన్నా ఉద్యోగమే మించినదని అనిపిస్తుంటుంది. నేను ప్రతిరోజు ఒకటే లక్ష్యానికి ప్రాధాన్యత ఇస్తాను. బోధన, పరిశోధన(Research) చెయ్యాలా? లేక సంసారం చూసుకోవాలా? అప్పుడు ఈ రోజు దేనికి ప్రాధాన్యత ఇవ్వాలో అని చూస్తే, ఏమైనా మనం నెగ్గుకు వచ్చేయ్యొచ్చు. అయితే నేను ఏ రోజు కూడా నా పరిశోధనని ఆపలేదు, ఉద్యోగం మానలేదు, పిల్లల సంరక్షణ వంటి కుటుంబం బాధ్యతలను వదలలేదు.

5. సుచిత్రా రావు: నేటి యువతకు తెలుగు భాష పట్ల ఆసక్తిని ఎలా పెంచాలి?

చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు అందరూ భాష ఎందుకు? ఎంత అవసరం? అన్న విషయం తెలుసుకోవాలి. వాళ్లకి తెలిస్తే, భాష నేర్చుకోవడానికి వస్తారు. భాష అనేది మనిషి, సమాజంలో కలవడానికి ఏర్పడిన గొప్ప సాధనం. ఒక మనిషి సమాజంలో కలిసి మెలగాలి అంటే ఏదో ఒక భాష తెలియాలి. భాష నేర్చుకుంటే ప్రయోజనం ఉంటుందని నిరూపిస్తే, యువత భాషని నేర్చుకోవడానికి ముందుకు వస్తారు.

6. కావ్య: మీ కష్టసమయాల్లో మీకు లభించిన అత్యుత్తమమైన సలహా ఏమిటి?

నా జీవితంలో అత్యుత్తమమైన సలహా ఇచ్చిన వ్యక్తి మా నాన్నగారు. మా నాన్నగారు నా రోల్ మోడల్ కూడా. పిల్లలను పెంచే సమయంలో ఉద్యోగం, కుటుంబాన్ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టంగా ఉంటుందని చెప్పేవారు. ఒక తల్లిగా మనం ఎక్కడి నుంచి అయినా సేవలు (సర్వీసెస్) పొందగలిగితే వాటిని పొంది, వచ్చిన సంపాదననంతా పిల్లల కోసమే ఖర్చు చేయమని సలహా ఇచ్చేవారు. చీరలు, నగలు కొనడం లాంటివాటిపై ఆశ పడకుండా, పిల్లల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనేది ఆయన అభిప్రాయం. "రెండేళ్ళు ఉద్యోగం చేయకపోతే ఉద్యోగం పోదు, అది అక్కడే ఉంటుంది. కానీ, పిల్లలను పెంచే సమయం మళ్ళీ రాదు," అని ఆయన చెప్పిన సలహా నాకు చాలా నచ్చింది. ఎందుకంటే, ఉద్యోగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు, కానీ కుటుంబం, ఉద్యోగం రెండింటిలో ఏది ముఖ్యమనే సవాలుకు తెలివిగా పరిష్కారం కనుక్కోవాలని ఆయన చెప్పారు. ఈ సలహా నాకు చాలా ఉపయోగపడింది.

7. సుచిత్రా రావు: మలేసియాలో తెలుగు భాషని నేర్చుకోండి అని ప్రోత్సహిస్తే, "ఎందుకు నేర్చుకోవాలి?" అని ప్రశ్నిస్తున్నారు. మీకు తెలుగు భాష ఏవిధంగా సహాయపడిందో చెప్తే, ప్రశ్నించే వాళ్లకి చెప్పడానికి ఇదొక మంచి సందేశంగా మాకు సహాయపడుతుంది?

నా 60 ఏళ్ల జీవితంలో, నేను తెలుగు తప్ప వేరే భాష రానివారి నుంచి, తెలుగు అక్కర్లేదు అనేవారి వరకు అన్ని తరాలను చూసాను. తెలుగు తప్ప వేరే భాష రానివాళ్లు అన్ని సామాజిక కార్యక్రమాలను తెలుగులోనే చేసుకుంటారు. వాళ్లు నేర్చుకున్నది తెలుగు భాషలోనే, నేర్పించేది కూడా తెలుగు భాషలోనే. నేను ఆ వాతావరణం నుండే వచ్చాను. తెలుగు అంటే వేమన పద్యం లాంటిదే కాదు. తెలుగులో కొన్ని వేల సంవత్సరాలుగా సాంస్కృతిక సంపదను నిక్షిప్తం చేశారు. తెలుగు భాష వద్దు అనుకుంటే ఆ జ్ఞానం నేర్చుకోలేం. మన సంస్కృతిలో కొన్ని ఆచారాలు, వ్యవహారాలు ఉంటాయి. ఎందుకు చేస్తున్నామన్నది చెబుతుంది. ఇలాంటి విషయాలను వేరే ఏ భాషలోనైనా అనువదించడం కష్టం. ఎందుకంటే, లక్ష్య భాషలో మూల భాషా సంస్కృతికి సంబంధించిన తత్త్వం ఉండదు. కొన్ని జంతువులు, పువ్వులు (flora & fauna) ఉండవు. ఒక భాషలో ఇలాంటివి చాలా ఉంటాయి. వెయ్యి సంవత్సరాల సాహిత్య చరిత్ర ఉంది. ఇలాంటి విషయాలు వాళ్ళకి అర్థం అయితే, వాళ్ళు తెలుగు భాషని నేర్చుకుంటారు. భాషను నమ్ముకుంటారు.

8. తరుణ్: మీ అభిప్రాయం ప్రకారం తెలుగు భాషను అభ్యసించడంలో మా (మలేసియా తెలుగు పిల్లల) అభివృద్ధి ఎలా ఉంది?

ముందుగా మీ మలేసియా వారికి నా అభినందనలు తెలపాలి. ఎందుకంటే, వేరే దేశంలో ఒకటవ తరం నుండి రెండవ తరానికి మాతృభాష అందలేని పరిస్థితిలో, ఇక్కడ నాల్గవ తరం వరకు మీరు తెలుగు భాషలో సంభాషించగలుగుతున్నారు. ముఖ్యంగా, మీ ఇంట్లో మాట్లాడుతున్నారు. మీకు తెలుగు భాషలో చదవడం, రాయడం మాత్రమే రాదు. అయితే, దీని వలన మీరు భారతదేశంతో మీ అభివృద్ధిని పోల్చుకునే అవసరం లేదు. ఎందుకంటే, ఇక్కడ పరిస్థితులు వేరు. కాని మీ తల్లిదండ్రులు ఎన్నో సహాయ, సహకారాలు మలేసియా తెలుగు సంఘానికి అందిస్తూ, వాళ్ల పిల్లలని తెలుగు తరగతులకు పంపుతున్నారు. తెలుగులో రాయడం, చదవడం నేర్పిస్తున్నారు. డిప్లొమా ప్రోగ్రాంలో పాల్గొన్న మీలాంటి పిల్లలు కూడా చక్కగా నేర్చుకుంటున్నారు. ఈ పిల్లలే వచ్చే తరానికి తెలుగు బోధిస్తారు అనే నమ్మకం నాకు ఉంది.

9. తరుణ్: మలేసియాలాంటి భిన్న సంస్కృతుల నేపథ్యం కల విద్యార్థులకు తెలుగు నేర్పడంలో మీకు ఎదురమైన సవాళ్ళు ఏమిటి?

వివిధ దేశాలలో వివిధ సంస్కృతులు ఉంటాయి. కానీ, వీటిలో మన భాషని మనం నిలుపుకోవాలి. నాకు తెలిసిన ఒక ఉదాహరణ చెప్తాను. అమెరికాకి వెళ్ళిన ఒకటవ తరం కుటుంబం తెలుగు బాగా మాట్లడతారు. కానీ, వాళ్ళ రెండవ తరానికి తెలుగు రాదు. అలాగే మూడవ తరానికి చెందిన అమ్మాయికి తెలుగు భాష రాదు. కానీ, తను మళ్ళీ తన మాతృభాష తెలుసుకోవాలనే పట్టుదలతో, తెలుగు భాష నేర్చుకుంది. అంతేకాకుండా కూచిపూడి కూడా నేర్చుకొంది. కాబట్టి, ప్రత్యేక శ్రద్ధ ఉంటే ఎన్ని భాషలైనా వారికి నేర్పించవచ్చు. సంస్కృతులు అడ్డురావు.

10. నూకాలమ్మ: మలేసియాలో మా ఆహార పద్ధతులు మీకు ఎలా అనిపించాయి?

అంటే... మన ఇంట్లో చేసిన వంట మనకు నచ్చుతుంది. బయట మన నాలుకకు తగినట్టుగా అన్ని ఉండవు. కానీ, కొంచెం అటు ఇటు ఉంటాయి. అందువల్ల ఇది బాగుంది, అది బాగాలేదు అని చెప్పడం సరికాదు. ఎందుకంటే ఇక్కడ పద్ధతి ప్రకారం చేసుకుంటారు. ఒక్కొక్క రకంగా చేసుకుంటారు. వాళ్ళ ఆచారంలో వాళ్ళు ఎలా చేసుకుంటారు అని గమనించాలి. అంతేకానీ మనం తీర్మానం చేయకూడదు.

ఒకరు ధరించే దుస్తులను గానీ, తినే ఆహారాన్ని గానీ, పాటించే విధానాలను గానీ మనం ఎప్పుడూ విమర్శించకూడదు. ప్రతి సంస్కృతికి ఒక పద్ధతి ఉంటుంది, వాటిని మనం గమనించాలి తప్ప, విమర్శించకూడదు. నేను పూర్తిగా శాకాహారిని కాబట్టి, మలేషియా ఆహారంపై నాకు పూర్తి అవగాహన లేదు. అయితే, 2013లో మొదటిసారి వచ్చినప్పటికీ ఇప్పటికీ (2025) చూస్తుంటే, ఆహారంలో నూనె, రంగులు ఎక్కువగా వాడుతున్నట్లు అనిపిస్తోంది. ప్రపంచం మొత్తం ఇప్పుడు మంచి ఆహారం వైపు అడుగులు వేస్తోంది. ఆరోగ్యం పట్ల ప్రజలు మరింత శ్రద్ధ వహిస్తున్నారు. కాబట్టి, ఆ మార్పును మలేసియా కూడా తప్పకుండా స్వీకరించాల్సి వస్తుందని నేను భావిస్తున్నాను.

11. నూకాలమ్మ: తెలుగు భాష కంటే తమిళ భాష అభివృద్ధి బాగా ఉంది. దీనికి కారణం ఏంటి?

అన్ని భాషల విషయాలను నేను నా భాషలో చదువగలను. తమిళంవారు అనువాదంకోసం ఒక వ్యవస్థ పెట్టుకున్నారు. ఏ పదమైనా సులభంగా కూర్చగలరు. తమిళ ప్రజలు వారి భాష కావాలని కోరుకుంటున్నారు. కాబట్టి, ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు దానికి అనుగుణంగా నడుచుకుంటున్నారు. ప్రజలలో ఆ కోరిక బలంగా ఉండాలి. కోరిక బలంగా ఉంటే నాయకులు చక్కగా దానిని నెరవేరుస్తారు.

12. దుష్యంత్: మలేసియాలో తెలుగు భాష అభివృద్ధిని మీరు పరిశీలించారు కదా! మలేసియాలో ఉన్న తెలుగు భాష ఇంకాస్త అభివృద్ధి చెందడానికి తోడ్పడే అతి ముఖ్యమైన అంశం మీ పరిశీలనలో ఏమిటని భావిస్తున్నారు?

తల్లిదండ్రులకు తెలుగు భాష ప్రాధాన్యత అర్థమయితే చాలు. ఎందుకంటే, తల్లిదండ్రులు పిల్లల భవిష్యతుకు ఉపయోగపడే విద్యనే నేర్పిస్తారు. తెలుగు, విద్యావ్యవస్థలో ఎప్పుడు ఉంటుందో అప్పుడే తెలుగు భాషను నేర్చుకోవడానికి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను తెలుగు తరగతులకు పంపుతారు. మలేసియాలో తెలుగు పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే, తెలుగు సంఘం నిర్వహిస్తున్న పరీక్షలను గుర్తిస్తే చాలు. ఇలా చేసినట్లయితే, తెలుగు తరగతులకు వెళితే, సమయం వృథా అవుతుందనే భావన పోతుంది. తద్వారా తెలుగు భాష అభివృద్ధి చెందుతుంది.

13. దుష్యంత్: తెలుగు భాష నేర్చుకోవడంలో మాలాంటి పిల్లలకు ఎలాంటి సవాళ్ళు ఉంటాయని మీరు అనుకుటున్నారు?

పిల్లలు మనతో సంభాషించడానికి ఒక భాషను నేర్చుకుంటారు. ఆ భాషను నేర్చుకున్న తరువాత, మరో భాషను నేర్చుకోవడానికి వాళ్ళకు మరో కొత్త ప్రేరణ (motivation) కావాలి. వారికి తమదైన విద్యావ్యవస్థ లేకపోతే వారి సంస్కృతి ద్వార మరో కొత్త భాష నేర్చుకోవడానికీ ప్రేరణ (motivation) వస్తుంది. ఇప్పుడున్న కాలంలో, అందరూ బహుభాషలను అభ్యసిస్తున్నారు. అలా తెలుగు భాష కూడా నేర్చుకొని జీవితంలో అభివృద్ధి పొందుతారు. ఎందుకంటే, ఇప్పుడున్న కాలంలో ఒకే భాషతో జీవించలేము. ఇటువంటి గొప్ప ప్రయోజనం భాషకు ఉందని తెలియక తల్లిదండ్రులు అడ్డుకుంటున్నారు. అదే కనుక వాళ్ళకి తెలిస్తే, తల్లిదండ్రులు మరో నాలుగు లేక ఐదు భాషలు నేర్పిస్తారు.

14. కావ్య: మీకు ఇష్టమైన కవి లేదా భాషాశాస్త్రవేత్త ఎవరు?

ఒక కవి లేదా భాషాశాస్త్రవేత్త అంటే మనకు ఇష్టం అని ఒక స్థాయిలో మనం అనుకుంటాం. కానీ, ఆ తర్వాత మన వయసు పెరిగేకొద్దీ లేదా మన ఆలోచన పరిధి పెరిగేకొద్దీ, మనకు ఇష్టమైన అంశాలు మారుతాయి. మొదట్లో ఒక కావ్యంలోని ప్రేమకథలు మనల్ని ఆకర్షించవచ్చు. కానీ, ఆ తర్వాత అందులో ఉన్న కవిత్వం గొప్పదనాన్ని మనం ఆస్వాదిస్తాం. కొన్నిసార్లు ఒక వయసులో ప్రబంధ కావ్యాలు చాలా బాగా అనిపిస్తాయి. కానీ, ఆ తరువాత వాటికి మించి వేరే శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలు మనకు చాలా ముఖ్యమైనవిగా అనిపించవచ్చు. ఒక స్థాయిలో సాహిత్యంలోంచి మనం మెల్లమెల్లగా వేరే ఆలోచనలకు వెళ్ళాల్సి వస్తుంది. కాబట్టి, నాకు ఫలానా కవి లేదా ఫలానా భాషాశాస్త్రవేత్త అంటే ఇష్టం అని చెప్పడం కష్టం.

15. పవంతిక: మీరు ఇంకా వేరే ఏఏ దేశాలలో తెలుగు భాషా బోధనను అందించారు?

నేను చాలా దేశాలు వెళ్ళలేదు. కేవలం రెండు రాష్ట్రాల్లోనే కాకుండా, ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో కూడా తెలుగు పరిస్థితిని చూశాను. నేను ఢిల్లీలో తెలుగువారికోసం పుస్తకాలు రాసాను. మారిషస్ వాళ్ళతో కలిసి పనిచేసాను. కొన్ని

బోధనాంశాలను రూపొందించాను. పర్యవేక్షకురాలిగా ఉన్నాను. రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించడం. వాళ్ళు భారతదేశానికి వచ్చినప్పుడు తరగతులు పెట్టడం వంటివి చేశాను. నేను రకరకాల సందర్భాలలో తెలుగును పరిశీలించాను. మలేసియా, సింగపూర్ వంటి దేశాల్లో తెలుగువారికి మార్గదర్శకత్వం చేశాను. అమెరికాలోని సిలికానాంధ్ర వంటి సంస్థలకు కూడా పరీక్షలు నిర్వహించడంలో సహాయపడ్డాను.

16. కావ్య: మన భాష ఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితులకు కారణం ఏమిటని మీరు అనుకుంటున్నారు?

మన భాష ఇలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవడానికి కారణం, కేవలం తెలుగు భాషలో ఉన్న సమస్య కాదు. ప్రపంచంలో చాలా భాషలు ఇటువంటి సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు తెలుగుపై సంస్కృతం, ఉర్దూ భాషల ప్రభావం ఎలా ఉండేదో, ఇప్పుడు ఆంగ్ల భాష ప్రభావం కూడా అలాగే ఉంది. ఇది ఎప్పటినుంచో ఉన్న ఒక చారిత్రక ప్రక్రియ. అయినప్పటికీ, తెలుగు వేల సంవత్సరాలుగా నిలబడింది. కాబట్టి, మనం నిలబెట్టుకోవాలని అనుకుంటే అదే స్థాయిలో నిలబెట్టుకోవచ్చు.

17. కావ్య: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత తెలుగు భాషలో ఎటువంటి మార్పులు వచ్చాయని మీరు భావిస్తున్నారు?

భాషాపరంగా చూస్తే, రెండు రాష్ట్రాలుగా లేదా మూడు రాష్ట్రాలుగా విడిపోవడం పెద్ద విషయం కాదు. ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్నవారు భాషపట్ల ఏ దృక్పథంతో ఉన్నారనేది ముఖ్యం. ప్రస్తుతం, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు మాధ్యమాన్ని తగ్గించి, తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వని పరిస్థితులు ఉన్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం. దీనికి భిన్నంగా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో తెలుగు మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి. అక్కడ విద్యార్థులు ఇంటర్మీడియట్ వరకు తెలుగులో చదువుకునే అవకాశం ఉంది. అయినాసరే పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. ఒకవేళ ఇదే కొనసాగితే, ప్రజలు తమ మాతృభాషను సరిగా నేర్చుకోలేక "భాషాపరంగా వికలాంగులయ్యే" (linguistically handicapped) పరిస్థితి వస్తుంది. రాజకీయ నాయకులు ప్రజల కోరికలను బట్టే నిర్ణయాలు తీసుకుంటారు. కాబట్టి, ముందు తల్లిదండ్రులు తెలుగు భాష ఆవశ్యకతను అర్థంచేసుకోవాలి. ప్రజలు తెలుగు కావాలని కోరితే, ప్రభుత్వం తప్పకుండా దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుందని మనం ముందే అనుకున్నాం.

18. పవంతిక: మీ పరిశోధన పత్రాల్లో అత్యంత ప్రధానమైనది ఏది?

పరిశోధన అంశం దృఢంగా అన్ని పరీక్షలకి తట్టుకుని నిలబడాలని అనుకునేదాన్ని. నేను ఆక్స్ఫర్డ్ వాళ్ళకి ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువు తయారు చేసాను. ఈ రోజు అది భారత దేశంలో ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి దగ్గర ఆ పుస్తకం ఉంది. 45 లక్షల కాపీలు అమ్ముడుపోయాయి. ఆక్స్ఫర్డ్ పుస్తకాల అమ్మకాల చరిత్రలో ఒక రికార్డు అది. అంతర్జాలంలో, వివిధ శాస్త్రాలలో సాంకేతిక పాదాలను తెలుగులో తయారు చేసాను. దాదాపు 56,000 పదాలు, 22 శాస్త్రాలలో తయారుచేసాను.

19. పవంతిక: మనకు తెలుగు కథలు, పుస్తకాలు, వ్యాసాలు విరివిగా లభ్యమవుతున్నాయి. అయితే కొత్త విద్యార్థులు అవి నేర్చుకోవడానికి కొంచెం కష్టపడుతుంటారు. అటువంటప్పుడు తెలుగు సినిమా పాటలు, సంగీగతం వినడంవల్ల తెలుగు భాష నేర్చుకొనేవారికి సులభం అవుతుందా?

తప్పకుండా అవుతుంది. ఏదైనా భాష నేర్చుకోవడానికి మన చెవి చాలా ముఖ్యం. పాటలు గాని, వార్తలు (news) వినడం గాని వింటూ ఉంటే, తెలుగు భాషలో ఉన్న ధ్వని, చెవికి బాగా అలవాటవుతుంది. తెలుగు పదాలను పలకడం కూడా సులభతరం అవుతుంది.

20. కావ్య: చివరి ప్రశ్న మేడం, ప్రతి విద్యార్థి తప్పక చదవాల్సిన లేదా తెలుసుకోవల్సిన సాహిత్య గ్రంథాలు ఏంటి?

ప్రతి విద్యార్థి తప్పకుండా భారత, భాగవత, రామాయణాలు వంటి గ్రంథాలను చదవాలి. ఈ గ్రంథాలు జీవితం అంటే ఏంటి, మంచి–చెడు లాంటి విషయాలను నేర్పి, వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి సహాయపడతాయి. అదేవిధంగా, ఆధునిక సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేయాలి. ప్రస్తుతం సమాజంలో ఉన్న సవాళ్లకు పరిష్కారాలు కనుగొనడానికి, ఎదుటి మనిషిని అర్థం చేసుకోవడానికి ఈ సాహిత్యం అవసరం. ఒక వ్యక్తి ఎందుకు అలా ఉన్నాడో తెలుసుకోకుండా, 'అది వారి ఖర్మ' అని వదిలేయడం సరికాదు. వారిని ఎలా అభివృద్ధి చేయాలనేది తెలుసుకోవడానికి ఈ సాహిత్యం ఉపయోగపడుతుంది. ఒక టీచర్‌గా లేదా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు, ఈ రకమైన పుస్తకాలు మనకు సమాధానాలు అందిస్తాయి, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మార్గం చూపుతాయి.

ఇంటర్వ్యూయర్స్: మలేసియన్ తెలుగు డిప్లొమా కోర్స్ విద్యార్థులు:

ఇంటర్వ్యూ సమన్వయం: డా. చంద్రయ్య శివన్న

తెలుగు శాఖ, నిజాం కళాశాల

రచనా సహకారం: రమేశ్ లాలం

తెలంగాణ భాషా
దినోత్సవ ప్రత్యేక
వ్యాసాలు

తెలంగాణకు 'రచనాశైలి' సాధ్యమయ్యేనా?

డా. చంద్రయ్య శివన్న

తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలంగాణ భాషపై ఎన్నో చర్చోపచర్చలు జరిగాయి. తెలంగాణలోని తెలుగే అసలైన తెలుగు అనీ, విస్తృతమైన ప్రాచీన పదసంపద ఈ భాషలో ఇప్పటికీ నిలిచి ఉందనీ, మూలద్రావిడ భాషకు చాలా సమీపంగా ఉంటుందనీ వాదనలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ తెలుగులో తత్సమాలు, ఆంగ్ల పదాలు ఎక్కువనీ, అది మిశ్రమ భాష అనీ ఇలా ఎన్నో ప్రతిపాదనలు, అభిప్రాయాలూ ముందుకు వచ్చాయి. కానీ, ఆశ్చర్యకరంగా, ఏ ప్రాంతేతరుల పాలనలో తెలంగాణ భాష వివక్షకు గురైందని చెబుతూ వచ్చారో, తెలంగాణ ఏర్పడ్డాక దాన్ని సరిదిద్దుకునే అవకాశం ఉన్నా, అటువైపు ప్రయత్నాలు జరగలేదు. జరగకపోగా, మళ్లీ అలవాటైన పత్రికా భాషలోనే రాయడం మొదలైంది. ఉద్యమ సమయంలో పనిగట్టుకొని తెలంగాణ భాషవాడిన రచయితలందరూ ఇప్పుడా భాషను దాదాపుగా అటకెక్కించారు. తెలంగాణ వచ్చాక జరగాల్సిన అనేక దిద్దుబాట్లలో ఇదొక అంశమనే విషయాన్ని మరిచిపోయారు. కాబట్టి, కవిత్వం, కథ, నవల వంటి సృజనాత్మక ప్రక్రియల్లోనో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో ప్రసారమయ్యే కార్యక్రమాల్లోనో తప్ప తెలంగాణ రచనాశైలి ఎక్కడా కనిపించదు. సామాజిక, రాజకీయార్థిక విషయాలపై వ్యాసాలు రాయడానికి కూడా తెలంగాణ రచనాశైలి రూపొందలేదు. ఇక తెలంగాణ భాషలో శాస్త్ర, సాంకేతిక అంశాల రచన ప్రస్తుతానికి ఊహకందని మాట. కాబట్టి, ఈ అంశంపై ప్రధాన దృష్టిని కేంద్రీకరిస్తూ, ఈ వ్యాసం సాగుతుంది.

'రచనాశైలి' అంటే ఏంటి?

'శైలి' అంటే ఏమిటి? తెలంగాణకు 'ప్రత్యేక రచనాశైలి' సాధ్యమేనా? వంటి ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. శైలి అనే మాటను ఆంగ్లంలో Style అంటారు. ప్రతి మీడియా సంస్థకు, అకాడమీలకు వారికే ప్రత్యేకమైన శైలీపత్రాలుంటాయి. వాటిని ఆంగ్లంలో, Style sheets అంటారు. శైలి అంటే భాష వాడకంలోని ప్రతేకత/విశిష్టత/నిర్దిష్టత. సాహిత్యంలో అయితే, నన్నయ శైలి, శ్రీనాథుని శైలి, పోతన శైలి, శ్రీశ్రీ శైలి, రావిశాస్త్రి శైలీ, అల్లం రాజయ్య శైలి అనీ వ్యక్తిగత స్థాయిల్లో ఈ శైలిని గుర్తిస్తుంటాం. అలాగే, భాషా విషయకంగా మణిప్రవాళ శైలి, గ్రాంథిక శైలి, వ్యావహారిక శైలి, మాండలిక శైలి అనీ ప్రధానంగా నాలుగు రకాల శైలుల గురించి వినే ఉంటాం. ప్రక్రియా పరంగా పద్య శైలి, గేయ శైలి, వచన శైలి ఇలా ఎన్నో రకాలుగా తేడాల్ని గుర్తించవచ్చు. కాబట్టి ఇక్కడ శైలి అంటే కేవలం పదాల వాడకంలోని వైవిధ్యం (Diction) మాత్రమే కాదు. ఆ భాషావ్యవహర్తలకే సొంతమైన కాకువు (tone), నుడికార సొంపులుంటాయనే విస్తృతమైన కోణంలోంచి చూడాల్సి ఉంటుంది. వాటిని పట్టుకోవడం ఆ భాషావ్యవహర్తలకే, ఆ ప్రాంత వ్యవహర్తలకే సాధ్యమయ్యే పని. అప్పుడే శైలిలో సంపూర్ణత సాధ్యమతుంది. ఈ దృష్టికోణంలోంచి ఒకసారి 'తెలంగాణ రచనాశైలి' సాధ్యాసాధ్యాల్ని పరిశీలిద్దాం.

'తెలంగాణ భాష'లో ఆలోచించాలి

ఈ వ్యాసంలో ముందే చెప్పినట్టు, సర్వసాధారణ తెలుగు వాక్య నిర్మాణరీతిలో తెలంగాణ పదజాలాన్ని 'రీప్లేస్' చేసి, తెలంగాణ శైలిలో రాసాం అని అనుకోవడమంత అమాయకత్వం మరోటి లేదు. అంతేకాకుండా, తెలంగాణ భాషలో మహాప్రాణాక్షరాలు పలుకబడవు (చాలా సందర్భాల్లో) కాబట్టి, అవి లేకుండా రాసేవాళ్లు కూడా ఉంటారు. దానివల్ల శైలి మరింత కృతకంగా తయారవుతుంది. అటువంటి వాక్యాల్లో జీవం ఉండదు. ఎక్కువ 'కృతకంగా' ఉండి, పాఠకున్ని ఇబ్బందుల పాలుజేస్తుంది. ఉదా: ఇదే వ్యాసంలోని ప్రారంభ వాక్యాల్ని 'తెలంగాణ భాష'తో 'రిప్లేస్' చేస్తే ఎలా ఉంటుందో కింద చూద్దాం.

పేరా-1-"తెలంగాణ ఉద్యమ సమయంల తెలంగాణ బాషమీన ఎన్నో చర్చోపచర్చలు జరిగినయ్. తెలంగాణల తెలుగే అసలైన తెలుగని, షాన ప్రాచీనత గీ బాషలో గిప్పటికీ ఉందని, మూలద్రావిడ బాషకి షాన దగ్గెరగ ఉంటదని, ఆంధ్రప్రదేశ్ తెలుగుల తత్సమాలు, ఆంగ్ల పదాలు యెక్వని

గది మిశ్రమ బాష అని గిట్ల ఎన్నో ప్రతిపాదనలు, అబిప్రాయాలూ ముందుకొచ్చినయ్."

పై వాక్యాలు గమనిస్తే,

i) కొన్ని నామ, క్రియా పదాలను 'రీప్లేస్' చేసినట్టు తెలుస్తుంది.

ii) ప్రత్యయాలను రీప్లేస్ చేసాం.

iii) మరికొన్ని సర్వనామాల్ని రీప్లేస్ చేసాం.

iv) మహాప్రాణాల్ని తీసేసి అల్పప్రాణాలతో రీప్లేస్ చేసాం.

v) మరికొన్నింటిని ధ్వనులను రీప్లేస్ చేసాం.

vi) మాట్లాడే అలవాట్లలో సహజంగా వచ్చే దీర్ఘాంతాలను హ్రస్వాలుగా మార్చాం.

మరి ఇది 'తెలంగాణ రచనాశైలి' అనిపించు కొంటుందా?. అవకాశమే లేదు. కానీ, 'తెలంగాణ రచనాశైలి' అనే భ్రమలను మాత్రం కలిగిస్తుంది. బుకాయించటానికి పనికొస్తుంది. పాఠకుని సౌలభ్యాన్ని దృష్టిలోపెట్టుకొని రాసిన వాక్యమే పదికాలాలపాటు నిలుస్తుంది. పై వాక్యాల్లో తెలంగాణ భాషలో సహజంగా ఉండే 'జీవం' లేదు. అంతా కృతకంగా ఉంది. భాషకు ప్రధానమైన కాకువు, నుడికారం తప్పిపోయింది. ఎందుకంటే, రచయిత పత్రికా భాషలో ఆలోచించి రాసారు. తనదికాని జీవనశైలి/విధానంనుంచి 'విషయా'న్ని (content) చూసారు. మధ్యమధ్యలో తెలంగాణ భాషను రీప్లేస్ చేసారు. అంతే. సారాంశం ఏంటంటే, జీవనశైలి కూడా తెలంగాణ భాషవైనప్పుడే, సహజత్వం సిద్ధిస్తుంది. తెలంగాణ రచనాశైలిలో రాయాలనుకున్న రచయిత తెలంగాణ భాషలో ఆలోచించాలి. తెలంగాణకున్న విస్తృతమైన జీవితాన్ని, అందులోని వైవిధ్యాన్ని ఆవాహనచేసుకోవాల్సి ఉంటుంది.

ఇదే వ్యాసంలో మొదటి ఉప శీర్షిక చూడండి– 'రచనాశైలి అంటే ఏంటి?'. దీన్ని 'రచనాశైలి అంటే ఏంది?' అని రాయొచ్చా? అని ఆలోచిస్తున్నప్పుడు కాళోజి వాక్యాలు గుర్తుకొస్తాయి. "ఎవని వాడుక భాషల వాడు రాయాలె. ఇట్ల రాస్తె అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. అసలు రాసేటోడు తెలుగోడయి చదివేటోడు కూడ తెలుగోడయితే సహృదయత ఉంటే తెలుగు అర్థమయితది. నాకు అర్థం కాలేదంటే నువ్వు తెలుగోనివి కాదన్నమాట. లేకపోతే సహృదయత లేదన్న మాట" కాళోజి, ఇక్కడ ప్రధానంగా రెండు విషయాలను ప్రస్తావించాడు. ఒకటి: స్వంత భాష పట్ల బానిస భావన. రెండు: రాసే రచన సహృదయుల కోసమే. కాబట్టి, మొదటిది పోగొట్టుకుని ఆత్మగౌరవంతో రాస్తేనే, 'తెలంగాణ రచనాశైలి' రూపొందుతుంది. స్థిరపడుతుంది. ఇక రెండోది మొదటిదాన్ని ఎంత ప్రతిభావంతంగా నిర్వహిస్తావు అనేదాని మీద ఆధారపడి ఉంటుంది.

'తెలంగాణ రచనాశైలి'లో రాసిన 'పేరా–1' వాక్యాలు మళ్లీ ఒకసారి కింద గమనించండి.

'పేరా–1'–"ఊరువాడంత ఏకమై తెలంగాణకోసం కొట్లాడంగ, అన్నితీర్ల కష్టనష్టాల లెక్కనే మన మాటతీరు మీదగుడ మనకు గౌరవం, సతంత్రం కావాల్నని కొట్లాడినం. మనదే పాత తెలుగని, పావురంగల్ల తెలుగని, ఎన్కటి తల్లిభాషయిన ద్రావిడభాషకు దగ్గరగుంటదని చెప్పుకొచ్చినం. మనభాషను 'వాళ్లు' ఉరుదుకు దగ్గరంటె, మీదాంట్ల సంస్కృతం, ఇంగిలీషు పోవడి ఎక్కువని, మా దాంట్ల అచ్చం పదాలు అల్కటి పదాలు ఎక్కువని లెక్కలు దీసినం".

తెలంగాణ 'రచనాశైలి' వైపు అడుగులు పడ్డాయా?

తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ 'రచనాశైలి'కి ప్రాధాన్యం పెరగలేదా? పెరిగింది. పాఠశాల స్థాయిలో తెలంగాణ భాషకు కొంత స్థలాన్ని ఇచ్చినట్టు కింద వాక్యాలు తెలుపుతున్నాయి. వాటిని చూద్దాం:

ఉదా–1 "ప్రాంతీయ, భాషాపరమైన దృక్పథంలో తెలంగాణ అస్తిత్వ చైతన్యానికి నిదర్శనంగా నిలబడి కొత్తబాటలో నడిచిన కథను పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం" (పదో తరగతి: 'కొత్తబాట' కథానిక. పుట. 36).

ఉదా–2 "తెలుగు భాష గొప్పతనాన్ని, ప్రాంతీయ భాషలోని సొగసును తెలియజేయడమే ఈ పాఠం ప్రధానోద్దేశం" (పదో తరగతి: "ఎవరి భాష వాళ్లకు వినసొంపు' పుట. 13)

ఉదా–3 "ప్రసంగాంతంలో చాలా స్పష్టంగా, ఉత్సాహంగా, సంక్షిప్తంగా తన నిశ్చితాభిప్రాయాలను ప్రకటించాలె." ఆ వ్యాసంలో ఇంకా "స్నేహం చెయ్యాలె. యత్నం చేస్తూ ఉండాలె. ఉచ్చారణ అలవరుచుకోవాలె:. (ఇరువెంటి కృష్ణమూర్తి) (తొమ్మిదో తరగతి: పుట. 107)

ఉదా–4 "మాట ఎత్తితే మీద మీద పడుతుందని బుగులు పడింది" (దాశరథి రంగాచార్య) (తొమ్మిదో తరగతి: పుట. 36)

ఉదా–5 "90 ఏండ్ల ముసలి మొదలు 8 ఏండ్ల

బాలుని వరకూ వెంకట్రావంటే ధన, మాన, ప్రాణ రక్షకునిగా భావిస్తారు: (వట్టికోటా ఆళ్వారుస్వామి). (ఎనిమిదో తరగతి: చిన్నప్పుడే. పుట.80)

తెలంగాణవారు రాసిన మరికొన్ని వాక్యాలను చూద్దాం:

ఉదా-6 ''ము0దుగా కి0ది వరుసలో త0గేడుపూలని పేర్చి ఆ పై వరుసలలో రకరకాల పూలని పేర్చుతు0టరు".

ఉదా-7 "తెచ్చిన తంగేడు పూలకొమ్మల నుండి ఆకులని గిల్లి, పూలతో కాండ ఒక మూడు నాలుగు 'ఇంచు'లు కి0దికి ఉండే విధంగా చూసుకుని, గుత్తులు గుత్తులుగా అమర్చుకొని, పీట అంచు కింద అణగబెడతరు".

ఉదా-8 ''మాటను మనిశే పుట్టిచ్చిండుగని, మాటలమర్మం చెప్పుడు మనిశితోటి కానిపని. ఎంత చెప్పుకున్నసరే మాట ఒగ ఒడువని మూట. ఎన్ని మాటలు ఏరుకచ్చినా పారేగంగను పిడికిట్ల వట్టినట్టే ఉంటది. ఇప్పుటిదాక మనం చెప్పుకున్నది ఈకెగాదు-తోకగాదు. మనం తండ్లాడింది అంతకంతా తోక ఎల్లి-ఏనుగు మిగిలినంత".

పైన పేర్కొన్న ఉదా-1 & 2 ల వల్ల తెలంగాణ భాషాస్పృహను విద్యార్థుల్లో కలిగించే క్రమంలో ఉద్దేశించిన పాఠ్యాంశాలని తెలుస్తోంది. ఇది క్రమంగా తెలంగాణ విద్యార్థుల 'రచనాశైలి' రూపకల్పనకు ఉపకరించే చిరు ప్రయత్నం.

ఉదా-3, 4 & 5ల్లో తెలంగాణ భాష రచనాశైలిగా ప్రయోగాల్లో కనిపిస్తోంది. 'ప్రకటించాలె', 'స్నేహం చెయ్యాలె', 'ఉండాలె', 'అలవరుచుకోవాలె' లాంటి 'ఆలి > ఆలె' ప్రయోగాలు, 'మాట ఎత్తితే మీద మీద పడటం', 'బుగులు పడడం' వంటి ప్రయోగాలు వాటిల్లో భాగమే. అదేవిధంగా, 'ఏండ్లు' లాంటి పదప్రయోగాలు తెలంగాణ 'రచనాశైలి'కి దారులు వేసే ప్రయత్నాలేనని భావించాలి. ఇరువెంటి కృష్ణమూర్తి, దాశరథి రంగాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి ప్రసిద్ధ రచయితలు తెలంగాణ 'రచనాశైలి'లో రాసారంటే తరువాతతరంవారికి ఒక భరోసా దొరికినట్లవుతుంది. అది కాళోజీ చెప్పినట్టు భాషా బానిసత్వాన్ని రూపుమాపి సరికొత్త చైతన్యాన్ని ఇస్తుంది.

ఉదా-6 & 7లో కూడా ఆధునిక తరంలో ఈ ప్రయత్నం కొందరిలో కనిపిస్తుందని చెప్పటానికి ఉదాహరణలు.

ఉదా-8 మాత్రం, తెలంగాణ రచనాశైలి'కి పరిణతరూపం అని భావించవచ్చు. ఒక నమునా. భాషలోనూ, సజీవమైన నుడికారంలోనూ, ప్రకటనలోని 'స్వరం' (tone)లోనూ అది తొణికిసలాడుతుంది.

తెలంగాణ 'రచనాశైలి'కి కొన్ని సూచనలు:

ఈ చర్చంతా తెలంగాణ సృజన రచనాశైలికి సంబంధించింది మాత్రమే కాదు. ఇప్పటికే 'తెలంగాణ కవిత్వం, కథ, నవల, నాటకం మొదలైన సాహిత్యావసరాల్ని తీర్చే ఒక రకమైన 'తెలంగాణ రచనాశైలి' నిర్మాణమై ఉన్నది. కాబట్టి ఇప్పుడీ చర్చంతా సాహిత్యేతర విషయ భాషావసరాలకు 'తెలంగాణ రచనాశైలి'ని ఎదిగించుకోవడానికి చేయాల్సిన కృషి గురించే. తెలంగాణ భాష అంటున్నామంటే మౌఖిక రూపలో ఉన్న భాష అని అర్థంచేసుకోవాల్సి ఉంటుంది. మనకింకా సాహిత్యేతర విషయాల ప్రకటనకు 'లిఖిత భాషాశైలి' రూపొందలేదు.

1. తెలంగాణ భాషలో సాహిత్యేతర విషయాల్ని రాయడమంటే మనం ఎలా మాట్లాడుతున్నామో అట్లా రాయడంగా పొరపడకూడదు. 'హ్రస్వాచ్చుల లోపంవల్ల దేశ్యశబ్దాల్లో సంయుక్తవర్ణాలు తెలంగాణా వ్యవహారంలో ఎక్కువగా వినిపిస్తాయి' అంటాడు భద్రిరాజు కృష్ణమూర్తి. అలా ఏర్పడిన 'జేస్టందుకు'(చేయడానికి), 'మీర్ జద్వకున్రి' (చదవకండి), 'వట్కచ్చి'' (వట్టుకొని వచ్చి)'లాగా మాట్లాడినట్టుగా రాయమని ఉద్దేశం కాదు. అలా రాయడంవల్ల, అది చదవటానికి మరింత ప్రతిబంధకమవుతుందనే వాస్తవాన్ని గమనంలో ఉంచుకోవాలి. కాబట్టి సాధ్యమైనంతవరకు 'స్థానిక వ్యక్తీకరణల'ను సాహిత్యేతర విషయాల రచనలో నిలుపుకుంటూనే 'జేస్టందుకు'లాంటి రూపాలను 'జేసేటందుకు/ జేసేతందుకు' మొదలైన స్వరలోప రహితంగా రాసేట్టు జాగ్రత్తపడొచ్చు. ఇలా కొన్ని సంవత్సరాలు పనిగట్టుకొని చేస్తేనే తెలంగాణ భాషకు ఒక 'రచనాశైలి/ఒరవడి' (Style sheet) రూపొందుతుందేమో. చరిత్రలో ప్రతిభాషలో జరిగిందిదే. ఈ రచనలకు విశాల హృదయంతో పత్రికల్లో స్థానం కల్పించాలి. పాఠకులు ఆహ్వానించాలి. ప్రోత్సహించాలి.

2. సాహిత్యేతర సామాజిక, రాజకీయ, ఆర్థికాది విషయాలను వ్యాసంలో ప్రకటించడానికి తెలంగాణ వ్యాస రచయిత ఎంతో శ్రమించాల్సి ఉంటుందనే విషయాన్ని మరిచిపోకూడదు. పనిగట్టుకొని మనకు అలవాటైన 'పదాల'కు తెలంగాణ సమానార్థకాలతో 'రీప్లేస్' చేయడం ఎంతమాత్రమూ అనుసరణీయమైన పద్ధతికాదని "పేరా-1" ఉదాహరణ

సందర్భంలో పైన చూసాం. ఇలా చేస్తే, 'అచ్చతెనుగు కావ్యభాషా సంప్రదాయంలా విఫల ప్రయోగంగా మిగిలిపోడానికి ఎంతకాలమో పట్టదు. అది రచనలో సహజాతిసహజంగా అప్రయత్నంగా జరగాల్సిన చర్యగా మారిపోవాలి. దీనికోసం రచయితలు నిత్యం ప్రజాసంబంధాల్లో ఉండాల్సి వస్తుంది. వారిభాషలోని 'నుడికారాన్ని', కాకుస్వర వ్యక్తీకరణను పనిగట్టుకొని నేర్చుకోవాల్సి ఉంటుంది.

3. కొన్ని ప్రత్యేక ధ్వనులమార్పుల్ని యథాతథంగా వాడుకోవాలి. ఉదాః చూడాలె, చెప్పాలె, మాట్లాడాలె లాంటి విధ్యర్థక క్రియలు. ఈ 'ఆలె' ప్రయోగం తెలంగాణ భాషను పట్టిచూపించే ప్రత్యేక లక్షణం. విషయావగాహనకు ఆటంకం కానంతవరకు నామవిభక్తులను విరివిగా వాడుకోవచ్చు. ఉదా: 'కి' ప్రత్యయ ప్రయోగం తెలంగాణలో ఇకారాంత నామాలమీద రావడంతోపాటూ, అకారాంత, ఉకారాంత నామాలమీద కూడా ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఉదా: నాకి, పుస్తకాలకి, మీకి, హైదరాబాదుకి...లాంటిచోట్ల మనం దీన్ని గమనించవచ్చు.

4. 'సంది, కాంచి, కెల్లి, లోపట, లోన, ల, లె, అల్ల, కోసరం లాంటి నామప్రత్యయాలు, పరప్రత్యయాలు (post positions) అనేకం తెలంగాణ భాషా అస్తిత్వాన్ని పట్టిచూపుతాయి.

5. పరుషాలు, సరళాలుగా మార్పుచెందిన రూపాల్ని విరివిగా వాడుకోవచ్చు. ఉదా: తీస్కబోయేసరికి, ఏంజెయ్యాలె, రాజు బిలిచిండు' వంటి రూపాల వినియోగం అర్థావగాహనకు ఎటువంటి అడ్డంకిని కలిగించవు కదా.

6. 'అలా, ఇలా, ఎలా' లాంటి రీత్యర్థ, ప్రశ్నార్థక పదాల్ని అట్లా/గట్లా, ఇట్లా/గిట్లా, ఎట్లా రూపాలుగా వాడితే మరింత ప్రయోజనవంతంగా ఉంటుంది. 'గది/గవి, గిది/గివి' లాంటి సార్వనామిక రూపాలు తెలంగాణ రచనాశైలిని మరింత పట్టిచూపే లక్షణాలు. వ్యాస విషయాన్ని పలుచపరచనంతవరకు వీటి వాడకం ఆమోదయోగ్యమే. అట్లా వ్యాసమంతా వాడాలనే నిబంధనలేమి లేవు. తెలంగాణ 'రచనాశైలి' ముద్ర మాత్రమే లక్ష్యం.

7. తెలంగాణకే ప్రత్యేకమైన పదజాలాన్ని సందర్భశుద్ధితో ప్రయోగిస్తే, అది తెలంగాణ ముద్రను నిలుపుతుంది. ఇది ఉదాహరణలు ఇయ్యనవసరంలేని సూచన. (గమనించారా!-'ఇయ్యనవసరంలేని' అనే పదబంధం సహజంగా ఈ వాక్యంలో ఒదిగింది. ('ఇవ్వనవసరంలేదు' అనేది ఎక్కువగా పత్రికా భాషలో కనిపించడాన్ని మీరు గమనించే ఉంటారు)

8. 'చెప్పినరు, చేసినరు, చెప్పిండు, చెప్పిన్రు, వస్తాన్న, వస్తలేదు' లాంటి క్రియాంతాలను అవసరమైనచోట తప్పకుండా వాడాలి. వీటి ప్రత్యేకత కేవలం పురుషప్రత్యయాల్లో మాత్రమే లేదు కాలబోధకప్రయోగాల్లోనూ కనిపిస్తుంది. ఈ వైవిధ్యం తెలంగాణ క్రియను ప్రత్యేకంగా నిలిపి ఉంచే లక్షణం. 'తెత్తురు, ఇద్దురు, వత్తురు" లాంటివి తద్ధర్మార్థక క్రియలుగా చాలా ప్రాచీనతను కలిగిన రూపాలు. 'తింటిని, చేస్తిని, వస్తిని' లాంటి ప్రాచీన రూపాలూ తెలంగాణ భాషకు చిరునామాలు. అయితే, ఇవి 'గ్రాంథికశైలి' లక్షణాలు కలిగిన రూపాలు. వీటిని వాడటంలో రచయితకు కొంత జాగరూకత అవసరం.

9. కొన్ని భావనల్ని (consepts), ఉత్కృష్ట విషయాల్ని చెప్పటానికి సరిపడే తెలంగాణ రచనాశైలి రూపొందాలంటే మరిన్ని నిఘంటు నిర్మాణాల అవసరం ఉంది.

10. తెలంగాణ రచనాశైలిని పట్టిచూపే ప్రయోగాలు ఒక వ్యాసంలో ఎంతశాతంలో ఉండాలనేది ప్రస్తుత తెలంగాణ భాషాసందర్భంలో ప్రాతిపతిక కాకూడదు. వ్యాసాన్ని చదివినవారికి ఇది కచ్చితంగా 'తెలంగాణవారే రాసారు' అని అనిపించుకునేంతవరకు ప్రయత్నిస్తే, తెలంగాణ రచయితగా ప్రాథమిక విజయం సాధించినట్టే. పైన చెప్పినట్టు ప్రయోగిస్తే, 'తెలంగాణ వ్యాస రచనాశైలి' నిర్మాణమైనట్టేనా! అంటే కాదనే చెప్పాలి. ఎందుకంటే, ఈ ప్రయత్నం నిరంతరం సోయితో జరగాల్సి ఉంటుంది. చాలా విషయాల్ని చెప్పటానికి సరిపడా నుడికారాలు, జాతీయలు, సామెతలు తెలంగాణలో పుష్కలంగా ఉన్నాయి. వాటిని సందర్భశుద్ధితో ప్రయోగిస్తే, తెలంగాణ రచనాశైలి మరింత పటిష్టరూపాన్ని సంతరించుకొంటుంది.

ఇట్లా భిన్నరంగాలవట్ల సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా, సామూహికంగా కలిసి పనిచేయకపోతే, భాష విషయంలో చేసిన పోరాటం, మన ఆకాంక్షలు కలలుగానే మిగిలిపోతాయి. చివరగా ఒకమాట, ప్రభుత్వాలకంటే పౌరసమాజం బాధ్యతే దీంట్లో ఎక్కువ అనే విషయం గమనంలో ఉంచుకోవాలె.

(ఈ విషయాల్ని మీతో తెలంగాణ 'రచనాశైలి'లో పంచుకోలేని భాషావైకల్యంతో ఉన్నందుకు క్షంతవ్యుణ్ణి)

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల

తెలంగాణ మాండలికాల్లో జానపదుల, విద్యావంతుల ఉచ్చారణ

డా. వి.ఎం.సుబ్రహ్మణ్యశర్మ

పత్ర సంక్షిప్తి:

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (1979) తెలుగులో వర్గ మాండలికాల గురించి విశ్లేషించారు. ఆయన విద్యావంతుల, జానపదుల భాషలో కొన్ని తేడాలను నిరూపించారు. ఆచార్య కృష్ణమూర్తి చెప్పిన నియమాలను తెలంగాణలోని నల్లగొండ, వరంగల్ మాండలికాలకు ఇప్పుడు (45 సంవత్సరాల తరువాత) అనువర్తింపచేస్తే, జానపదుల భాషలో మార్పులు లేవుకానీ, విద్యావంతుల భాషలో కొన్ని మార్పులు కన్పించటాన్ని ఈ పత్రం చర్చిస్తుంది.

ముఖ్య పదాలు: తెలంగాణ మాండలికాలు, వర్గమాండలికం, నియమాలు, మార్పులు.

ఉపోద్ఘాతం:

తెలుగుభాషను వృత్తి పరిశోధన ఆధారంగా ఆచార్య కృష్ణమూర్తి (1979) నాలుగు భాషామండలాలుగా విభజించారు. అవి: 1. పూర్వమండలం (కళింగ) 2. దక్షిణ మండలం (రాయలసీమ) 3. ఉత్తర మండలం (తెలంగాణ) 4. మధ్య మండలం (ఇతర కోస్తా మండలాలు). వెన్నెలకంటి ప్రకాశం (1983) భాషా వైవిధ్యాల దృష్ట్యా అప్పటి ఆంధ్రప్రదేశ్ ను స్థూలంగా ఏడు ప్రాంతాలుగా విభజించారు. ఇంతకంటే ఎక్కువ ప్రాంతాలుగా విభజించే అవకాశం కూడా ఉందని భావించారు. అవి, 1. నెల్లూరు, ఒంగోలు జిల్లాలు, 2. కృష్ణా, గుంటూరు జిల్లాలు 3. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు. 4. విశాఖ పట్టణం, శ్రీకాకుళం జిల్లాలు 5. ఉత్తర తెలంగాణా జిల్లాలు 6. జంటనగరాలు 7. దక్షిణ తెలంగాణా జిల్లాలు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరువాత అంతకు ముందున్న10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్విభజన చేశారు. చాలా దశాబ్దాలుగా వాడబడుతున్న ప్రామాణిక భాష (కోస్తాంధ్ర మాండలికం) ప్రభావం తెలంగాణ మాండలికాలపై ఉండడం సహజమైన ప్రక్రియ. అయితే, విద్యావంతుల వ్యవహారంలోనే ఎక్కువగా ఈ ప్రభావం చూపిస్తుంది. వారి ద్వారా కొంతవరకు జానపదుల పలుకుబడిలో కూడా ప్రభావం కనిపిస్తుంది. ఈ రకమైన ప్రభావం తెలంగాణలోని అన్ని జిల్లాల వ్యవహారంలో ముఖ్యంగా, విద్యావంతుల భాషలో ఇప్పటికీ నిలిచి ఉంది.

పూర్వ పరిశోధన:

తెలుగు భాషాచరిత్ర (1979, 2014)లో ఆచార్య కృష్ణమూర్తి 'తెలుగు మాండలికాలు: ప్రమాణ భాష' అనే అధ్యాయంలో వర్గమాండలికాలను వివరించారు. ఆ సందర్భంలో జానపదుల (విద్యావంతులు కానివారు) భాషకు, విద్యావంతుల భాషకు మధ్య తేడాలు ఉచ్చారణలోనూ, వ్యాకరణంలోనూ, పదజాలంలోనూ ఉంటాయని వివరించారు. ఒక వ్యక్తి ఉచ్చారణను బట్టి అతను విద్యావంతుడా? కాదా? అనే విషయాన్ని చెప్పవచ్చుకాని తాను ఏకులానికి చెందినవాడు అనే విషయాన్ని చెప్పలేమని, ఏ కులస్థుడైనా చదువుకున్నవాడైతే, చదువు కున్నవారి ఉచ్చారణ పూర్తిగా పట్టుబడుతుందని వివరించారు. అంటే తెలుగులో వర్గమాండలికం ఏదైనా ఉందంటే, అది శిష్టుల(చదువుకున్నవారి) వ్యవహారం, శిష్టేతర (జానపదుల) వ్యవహారంగా ఉంటుందని కొన్ని నియమాల ద్వారా వివరించారు. వేంకటేశ్వర శాస్త్రి, తన 'ఏ స్టడీ ఆఫ్ తెలుగు రీజినల్ అండ్ సోషల్ దయలేక్ట్సు : ఏ ప్రోసోడిక్ అనాలిసిస్' (1987) సిద్ధాంత గ్రంథంలో వీటి గురించి చక్కని విశ్లేషణ చేసారు. ఆ క్రమంలో అంతకు మునుపు గమనించని, విశేషాలను కూడా సహేతుకంగా వివరించారు.

ప్రస్తుత తెలంగాణ మాండలికాల్లో కృష్ణమూర్తి విద్యావంతుల, జానపదుల వ్యవహారంలో చెప్పిన తేడాలను వివరించారు. ప్రస్తుతం నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఉన్న జానపదుల, విద్యావంతుల మధ్య తేడాలు వారు చెప్పిన నియమాలే అనుసరిస్తున్నాయా? లేదా ఎటువంటి మార్పులు చోటు చేసుకున్నాయి అని వివరించడమే ఈ పత్ర ఉద్దేశం.

సమాచార సేకరణ:

ఈ ఉద్దేశాన్ని సాధించడానికి పూర్వపు నల్లగొండ, వరంగల్ జిల్లా మాండలికాలతో చిన్నప్పటినుండి పరిచయం ఉంది. దీనివల్ల తరచుగా ఆ భాషావ్యవహర్తలతో సంభాషించే అవకాశం ఉండేది. ప్రస్తుత పత్రానికి సహజ పద్ధతిలో విద్యావంతులు, జానపదులనుండి సేకరించిన సమాచార ఆధారంగా కొన్ని ఉదాహరణలను ఇచ్చాను. దీనితోపాటు తెలుగు అకాడమీ, జిల్లాలవారిగా ప్రచురించిన వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల బులెటన్లను కూడా పరిశీలించాను.

తెలంగాణ మాండలికాల్లో విద్యావంతులు, జానపద వ్యవహర్తల ఉచ్చారగా వైవిధ్యం:

ఆచార్య కృష్ణమూర్తి విద్యావంతుల, జానపదుల మధ్య ఆనాడు ఖచ్చింతంగా కనబడిన ఉచ్చారణా వైవిధ్యాలను ఎనిమిదింటిని మనం వరంగల్, నల్లగొండ జిల్లా మాండలికాలలో ఏ విధంగా ఉన్నాయో పరిశీలిద్దాం:

గమనిక: ఈ పత్రంలో వి.ఉ. అని అంటే, విద్యావంతుల ఉచ్చారణ అనీ, జా.ఉ. అంటే జానపదుల ఉచ్చారణ అని గ్రహించగలరు.

1 (a) విద్యావంతుల ఉచ్చారణ (వి.ఉ)లో ఒత్తులు నిలుస్తాయి,

జానపద ఉచ్చారణ (జా.ఉ)లో ఒత్తులు పోతాయి.

వరంగల్ జిల్లా మాండలికం (వ.జి.మా), నల్లగొండ జిల్లా మాండలికం (న.జి.మా) వ్యవహర్తల్లో జానపద ఉచ్చారణలో ఒత్తులు పోతాయి. కానీ, విద్యావంతుల ఉచ్చారణలో కచ్చితత్వం లేదు.

ఉదా. భగవద్గీత , భయం, భక్తి, భేదం లాంటి పదాల ఉచ్చారణలో ఒత్తులు లేకుండా పలకడం సర్వసాధారణంగా కనబడుతుంది. విద్యావంతుల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారి వ్యవహారంలో కూడా ఒత్తులు పలకకపోవడం కనిపిస్తుంది.

(ఎ). విద్యావంతుల ఉచ్చారణ(వి.ఉ)లో హకారం ఉంటుంది. జానపద ఉచ్చారణ (జా.ఉ)లో 'హ' కారం పోతుంది. వి.ఉ లో కూడా హ కారం పోవడం సర్వసాధారణ విషయంగా మారింది. హైదరాబాదు ను ఐదరాబాద్ లేదా ఐద్రాద్ అని, హరి, హంస, హారిక, హంసావత్ లాంటి పేర్లలో కూడా 'హ' కారలోపంతో పలకడం కనబడుతుంది.

2. వి.ఉ. లో అద్విరుక్త చకారం అంతటా నిలుస్తుంది.

జా.ఉ. లో చ కారం స కారం అవుతుంది (చ>స). పైన చెప్పిన రెండు తెలంగాణ మాండలికాల్లో చ కారం మార్పు స కరంగా, శ కారంగా కనబడుతుంది. (చ> స, శ)

(అ) వానికి చిన్న తెలివి లేదు. (వి.ఉ)

వానికి శిన్న తెల్వి లేదు. (వి.ఉ.న.జి.మా, వ.జి.మా)

(ఆ) చెప్పిన పని చేయకపోతే చెవులు పగులుతయ్.

చెప్పిన పని చెయ్యకపోతే శెవులు పగులుతయ్ (వి.ఉ. న.జి.మా, వ.జి.మా)

చక్కర, చంద్రయ్య లాంటి పదాల్లో 'చ'కారంలో 'అకారం కంటే 'ఎ' కారం పలకడం, శ కారంగా పలకడం కూడా సాధారణం. ఈ మాండలికాల్లో ఇ, ఎ అచ్చుల ముందు 'చ 'కారం 'శ' కారంగా మిగిలిన చోట 'స' కారంగా ఉంటుందని చెప్పవచ్చు.

3. వి.ఉ.లో పదాది వకారం నిలుస్తుంది. జా.ఉ. లో వకారం పోతుంది.

జమ్మికుంట ప్రాంతంలో జా.ఉ.లో వకారం నిలచి ఉండటం గమనించదగిన విషయం. అదేవిధంగా, వి.ఉ.లో వ.జి.మా., న.జి. మా. విద్యావంతుల వ్యవహారంలో వకారం లోపిస్తుంది.

వి.ఉ: కుక్క వాని వెంబడి పడింది. కానీ, వ.జి.మా., న.జ.మా.లో కుక్క ఆని ఎంబడి వడింది. అంతేకాకుండా, ప, బ, కారాలు వ కారంగా మారడం కూడా జరుగుతుంది. (ప, బ>వ)

కండ్లు కనబడట్లేదా?

కండ్లు కనవడట్లేదా?

వంటివి చాలా సామాన్యంగా కనిపించే ఉచ్చారణలు.

4. వి.ఉ.లో సంయుక్త హల్లులు నిలుస్తాయి. జా.ఉ.లో హల్లులు సమీకరణ పొందుతాయి.

వి. ఉ: నేను మృత్యుంజయుని భార్యను, ఎల్లుండి మా గృహప్రవేశం.

వ.జి.మా., న.జ.మా. వి.ఉ: నేను మృత్తుంజయ్ బార్యను ఎల్లుండి మా గురప్రవేశం.

ఇక్కడ గృహప్రవేశం గురప్రవేశం. సంయుక్త హల్లుల లోపం కనబడుతుంది.

వి.ఉ.: చిన్న దెబ్బను గోకి గోకి వ్రణం చేశిండు. అనే వాక్యం వి.ఉ(వ.జి.మా., న.జి. మా). చిన్న దెబ్బను గోకి గోకి రణం చేశిండు. గా మారింది.

ఇక్కడ వ్రణం-రణంగా మారింది.

5. శ, ష, స ల భేదం విద్యావంతుల వ్యవహారంలో ఉంటుంది. జా.ఉ.లో శ, ష లు స కారంగా మారుతుంది.

కానీ,

అ) వి.ఉ.: శేషు నిన్న అమెరికా నుంచి వచ్చిండు.

వి.ఉ (వ.జి.మా., న.జి.మా.): నిన్న సేషు అమెరికా నుంచి వచ్చిండు.

వి.ఉ: కార్తీక మాసంలో కాశీ ప్రయాణం..

ఆ)వి.ఉ: కార్తీక మాసంలో కాసీ ప్రయాణం. (వ.జి.మా., న.జి.మా.) స్పష్టంగా చెప్పు అనే బదులు స్పస్టంగా గా చెప్పు. పిల్లలకు తరగతి గదిలో పాఠం చెప్పేటప్పుడు కూడా. 'శ'ని'శే' గా పలికి. అదే విధంగా 'ష'ని'శ' గా పలకడం కూడా కన్పిస్తుంది.

6. వి.ఉ: మూర్ధన్య దంతమూలీయ భేదం నిలుస్తుంది. జా.ఉ మూర్ధన్యాలు దంతమూలీయాలుగా మారుతాయి.

వ.జి.మా, న.జి.మా.లో మూర్ధన్య దంతమూలీయ భేదం నిలువదు.

ఉదా. వాణి భర్త ఏం చేస్తదు

వాని భర్త యేమ్ చేస్తదు గా మారుతుంది.

7. వి. ఉ: ఌ, ప కారాలు భిన్న స్వరాలుగా ఉంటాయి.

జా. ఉ. f, 'ప' గా మారుతుంది.

వి.ఉ. (వ.జి.మా. , న.జి.మా)లో కొన్ని సందర్భాలలో అన్ని ఒకే స్వరంగా ఉండటం కనబడుతుంది.

ఉదా. పల్సర్ అనే పదాన్ని (f)ఫల్సర్ అని పలకడం.

8. వి.ఉ.: పదాది గకారం దేశ్యశబ్దాల్లో నిలుస్తుంది.

జ. ఉ.: గ, గె గా మారుతుంది.

వి. ఉ.(వ.జి.మా, న.జి.మా) గ కారమే కాదు చ కారం చె కారంగా మారుతుంది (పైన చెప్పినట్టుగా).

హైదరాబాద్ ప్రాంతంలో ర కారం రె కారంగా ఉచ్చరించడం కూడా జరుగుతుంది.

ఉదా: రవి ని రెవిగా పలుకడం.

ముగింపు:

పైన చర్చించిన నియమాలు విద్యావంతుల్లో కనబడే లక్షణాలు అయినా కొంతమంది విద్యాగంధం ఉన్నవారి ఉచ్చారణలో కొన్ని భేదాలు ఉన్నట్టుగా కనబడుతుంది. 45 సంవత్సరాల క్రితం చెప్పిన నియమాలు భాషావిషయంలో

(తరువాయి 30వ పేజీలో...)

తెలంగాణ భాషా దినోత్సవ ప్రత్యేక వ్యాసాలు

జీవరాశి మాట-జీవంగల్ల మాట

డా. ముట్టా సంపత్కుమార్ రెడ్డి

'అంసలా బాయికీ ఉయ్యాలో
నీళ్లకాని వోతె ఉయ్యాలా
అంసలన్ని గూడి ఉయ్యాలో
అంచంతా చింపే ఉయ్యాలా
కొంగలాబాయికీ ఉయ్యాలో
నీళ్లకాని వోతె ఉయ్యాలా
కొంగలన్నిగూడి ఉయ్యాలో
కొంగంతా చింపె ఉయ్యాలా" అని పాడుకునుడు ముద్దుగనే ఉన్నదిగని, పేర్లు అట్లగుడంగ ఉంటయా? సలేంద్రాల బాయి, సర్కారు బాయి, మూడుగిర్కల బాయి, నడిమింటోళ్ల బాయి, మంచినీళ్లబాయి ఈ తీరునగద పిల్సుకునేది. గీ అంసల బాయిలు కొంగల బాయిలు, కప్పల బాయిలు ఉంటయా అని లోలోపట ఎవలకోవొగలకు అనుమానం రావచ్చు. అనుమానం పాతరోగమంటరు గద. అనుమానం తేలగొట్టుకుంటె పొయ్యేదేంది, తెలివిడి తేటతెల్లమైద్ది. బూమ్మీద ఈ మనుశులకంటె ముందుయెనుకలు ఎన్నికోట్ల జీవరాసులున్నయో ఎవలకెరుక, లెక్కాపత్రమా? పత్రంబట్టుకోని తిరిగితే ఇదేమన్న తేలే కతనా? సాతాని యెంకటేశం జీవులు ఎనుబయి నాలుగులచ్చలని పాడుతడు, జంగంకతలు చేప్పే నాగమల్లయ్య దేవానదేవతలే సురా ముప్పయిమూడుకోట్లు అంటడు. జీవరాసులు కోటానుకోట్లని ఈల్ల ముచ్చటనువట్టి అర్తం చేసుకోవాలె. కోటానుకోట్ల పురుగుబూచి లేంది మనం బతుకుడు కల్ల అని మా మ్యానమామ ముదిగంటి మల్రెడ్డి ఎప్పటికి చెప్తుండె. మన నడిగడ్డ మీద గుట్టలుబోర్లకు వాగులువంకలకు చెట్లుపుట్టలకు తీరమున్నదా. యాడాదికి పదినెల్లు శికారికివొయ్యే మా తెనుగు దేవయ్య ఈడలేని జీవరాశి ఇంకేడ లేదంటడు. నిజమేనని తెల్సుటానికి నాకు నలుపయేండ్లు పట్టింది. ఈడ ఇంకోమాట చెప్పాలె ఈల్లందరూ కైత్కాలోల్లు. దేశం తిరిగినోళ్లు. మాటలు నేర్సినోళ్లు. ఈల్లు మాటమాట్లాడితే, ఊపుకు ఉల్లాసం ఉరుకులాడుద్ది, కట్టానికి కండ్లల్ల నీళ్లు తిరుగుతై. బాదకు కడుపుల దేవినట్టయితది, గమ్మతుకు నవ్వినవ్వి పొట్ట ఊదువడుతది. ఈల్ల మాటలకు ఇంత జీవం ఇంత రుశి ఎట్లబ్బింది? ఎప్పుడన్న ఆలోచన చేసింండ్రా? మీరు చెయ్యకపోతే గన్క, ఇగ నేనే ముందల ఏస్కుంట తియ్యిండ్రి.

మనిశి తెలివిగల్లోడు, ఇప్పన్నాలోడు, ఇచ్చంత్రాలోడు, ఇచారంగల్లోడు, ఈ బూ పపంచాన్ని వేలయేండ్లసంది ఎంతగ చూస్తుండు. ఎన్నివేల జీవాలతోటి సావాసం చేస్తుండు. వాటి రూపం, గునం, కట్టం, సుకం, ఇసం, మోసం అన్నీటిని ఎన్నీటినో బుర్రలకు ఎక్కిచ్చుకున్నడు, మాటలల్ల నిలుపుకున్నడు. మనిషి మాటమాట్లాడితెజాలు మాటమాటకు జీవరాశి సాటువను తీసుకత్తడు. నవ్వితె, ఏడిత్తె, పనిజేస్తె, కట్టంజేస్తె, మొండికేస్తె, మోసంజేస్తె దేంట్లనైనసరె జంతువునో పురుగుబూచినో ముందటేసి మరుగునవెట్టి మాటమాట్లాడ్తడు. ఈ మరుగు మాటల తెలివిడి ఎవలకువాడితె వాల్లకు అర్థంగాదు. పుట్టువడితోనే ఈ పల్కువడి అబ్బుతది మరి. కొత్తొల్లకు రమ్మంటెరాదు–మనకు పొమ్మంటెవోదు.

ఒక్కసారి మనం ఇంట్లకెల్లే మొదలువెట్టి మన మాట ముచ్చటల దాగున్న జీవరాసి సంగతేందో చూద్దం. బల్లి పారని గోడవుంటదా పిల్లి దూరని ఇల్లువుంటదా! చీమె ఈగె బల్లి పిల్లి నల్లి పేను పురుగుబూచి ఇవన్నీటి మీద ఎన్నెన్ని మరుగు మాటలుంటయనుకున్నరూ. బల్లి అంటే పీనాచి. పాడిండ్ల బల్లి అంటే అబ్బో పరమపీనాచి, చీమెబతుకు అంటే నలుగుట్ల అల్పమైన బతుకు. గంజిల ఈగలెక్క తీసిపారేసినట్టు అంటే ఎదురుంగున్న మనిషిని లెక్కేచెయ్యకపోవుడు. ఈగెపుట్టువడి అంటే లెక్కకుదొరుకననంత. చెవుల దోమతీరు అంటే ఎడతెగని పోరువెట్టుడు, చెవుమీద పేనువారకపోవుడంటే ఏమనుకుంటండ్రు చెప్పింది అస్సలుకె లెక్కజెయ్యక పోవుడు. జిర్రుమనది అంటే జిర్రపురుగు మన మొకంమీద ఎగిరినసరే పట్టిచ్చుకోకపోవుడు. నల్లికుట్లోడు అంటే నల్లిలెక్క కనవడకుంట మెండ్రిచ్చుడు. నల్లికుట్లోన్ని నమ్మరాదు – ఇంట్లున్న సోదు అమ్మరాదు అనిగద మన సవగతి ముచ్చట. పిల్లికండ్లు, పిల్లిలెక్క నాచువెట్టుడు, పిల్లికి రొయ్యల మొలుతాడు గట్టినట్టు, పిల్లి పియ్యిని గప్పినట్టు, ఏడిండ్ల పిల్లికూన ఇట్ల ఎన్నెన్ని మాటలు. బూమ్మీద కాలువెట్టకుంట పెంచిందాయె, తల్లివొయినంక పోరిబతుకెట్లయిపాయెపో ఏడిండ్ల పిల్లికూనయింది అంటరు. పిల్లి కండ్లుదెరువని పిల్లికూనలాని ఏడిండ్లు తిప్పుతది.

పట్టవగటీలి ఏ దొమ్మరియాటకాడో వచ్చి తల్లిపిల్లిని ఏస్కపోతే ఆ పిల్లికూనలు మావ్వ మావ్వ అని ఏడిండ్లు తిరుగుతై. అందరు గెదిమెటోల్లే వాటికి ఇల్లేడిది-ఇరువాటేడిది. గోస పాడుగాను పచ్చిగోస. పాపం పులుకుపులుకున చూసుకంట గోలుగోలున అగోలిస్తయి. ఒక్క చిన్నమాట లోలోతున గుండెను కరిగిచ్చే ఎంత పెద్ద అర్ధమున్నదో కుదురుగ చూడుండ్రి.

ఇగ గట్ల ఆకిట్లమొకాన వొయి అరుగుమీద కూసుందం రాండ్రి. కుక్క, బర్రె, దున్నపోతు, ఆవు, ఎద్దు, గుర్రం, గాడిది, కోడి, మ్యాక, గొర్రె, తేలు, పాము ఇట్ల కంటికి ఎన్ని కనవడుతయో మాటలగుడ అవన్ని ఇనవడుతయి. ఒక్క కుక్కమీదనే కోటొక్క మాటలుంటయి. ముక్కుమీద కోపముండి కయ్యిమనే మనిశిది కుక్కమొకం. అయినదానికి కానిదానికి ఇంట్లొల్లంత వదురుకునుడు కుక్కలకొట్లాట. అతిగతిలేని బతుకు కుక్కబతుకు. దిక్కులేని సావు కుక్కసావు. ఆత్మగల్ల మనిశి తండ్లాటకు మనం పెట్టుకున్న పేరు కుక్కపేగులతనం. ఇయ్యంగ సంబురపడుకుంట ఇచ్చి ఎనుకకు తీస్కోంగ ఏడుపులవడితే అది కుక్కపీకులాట. ఎక్కవడితె అక్కడ పరువతక్వ దొరుకుడు దొరికితే దాన్నే కుక్కనుగొడుతె రాల్తయి అంటం. ఇంకో గమ్మతి ముచ్చట, గొప్పముచ్చట చెప్పుకుందాం! బర్రెను మన పెద్దలు బర్రెకుక్క అంటరు. కొత్తగ విన్నోల్లు ఒగ బర్రె ఒగ కుక్క రెండున్నయి అనుకుంటరు. కాదుకాదు కుక్కలెక్క బర్రెసుత నియ్యతి గల్లది. మనంజేసే సేవకు మిత్తితోటి బాకి తీరుసుకుంటది. గందుకని అది బర్రెకుక్క. అందకనేగాదుల్ల బర్రెకు బానిస గావాలె అనే సామిత పుట్టింది. బర్రెకు అర్లువుట్టినట్టు, ఎద్దుకెద్దు, ఎద్దంతమనిశి, దున్నపోతుమీద వాన, గుర్రపుతిండి, పిల్లివట్టిన కోడి, గాడిదిసాకిరి, మ్యాక నమిలినట్టు, మ్యాకసండ్ల కుతి, గొర్రెసూపులు, గొర్రెముద్దె గొద్దె, కొండిరిచిన తేలు, మండ్రగబ్బమొకం, పాముపగ, పెంజరగున్నతీరు, జెర్రిగొడ్డు పిరికి, నాగులమాస సూపు, తొండబిర్రు, ఉడుతసాయం ఇగో ఇట్లుంటది మన మాట. ఎన్నన్ని చెప్పుకుంటం, ఇగ లెవ్వుండ్రి, కాల్లన్న సాగుతయి, అట్ల చెల్కమీదికి పొయ్యద్దాం.

ఇగో, గా పొంబండమీద కూసుందం పాండ్రి. ఇటు సూడుండ్రి మన ఎదురుంగది గువ్వగుండు. కుడిపక్కకున్నయి పిల్లిగుండ్లు. గా కర్రెబండలున్నది కాకులబోరు, దాని కిందిబాజుకు కనవడేది కొండ్రిగాని బొగుడ. దానికి జెరంత కుడికి కముజుల బాయి, ఆ దట్టంగున్న చెట్లగుంపు గుడ్డెలుగుల దాగు, మనకు కుడిపక్కది పందిగుట్ట, ఎడుమ పక్కది నందిగుట్ట, గట్ల దూరంగ అగుపడుతందా, గా అడ్డగుట్టపేరు మొసలిముక్కు గుట్ట. గుట్ట నడిమిట్లున్న వంపు మ్యాకల గండి. ఆడనే కిందిసరిసెకు కనవడేది జింకల లొద్ది. దానికింది పట్టికి ఉన్నకుంటే జెనిగలకుంట. జెనిగెల కుంటలకెల్లి సాగేది నక్కవాగు. ఆ కిందికున్నయి గొర్లబందం, బర్లకుంట. ఆ కిందికి పొలుమారు బందుకు కండ్లవడేది కొడిపెల జాలు. ఇప్పుడుమీరే చెప్పుండ్రి జీవరాసిలేక మనిశున్నడా, మనిశికి మాటున్నదా !

మొగులు దిక్కు జూత్తె ఎన్నిమాటలు మదిల మెదుల్తయో. అబ్బో దానిసూపు పాడుగాను పైడికంటె చూపు. వాడు గద్దలెక్కనే మీదమీద ఆడుతుండుగద. ఓ పోడా పీతిరిగద్దలెక్క ఎగవడుతున్నవేందిరా. లొట్టిమీదికాకి లెక్క ఏమొర్తున్నవ్. వాడు గద్దసూపు గాడిది, గద్దదన్నుక పొయినట్టే పొల్ల గడియల మాయమైపాయెపో. ఏం బతుకు పిట్టబతుకు. గోసపాడుగాను ఏం పచ్చిగోస. వాడారా! వాడు ఊరవిశ్కెలకు కడుపులు జేస్తడు ఇట్ల లెక్కలేనన్ని మరుగుమాటలు ఎన్నో బుద్దులుసుద్దులు నేర్పుతుంటయి.

చెరువు దిక్కు చూత్తే మాటలు అలుగులు పారుతై. రాజిగాన్ని నమ్మినవారా వాడు పెద్ద బుడుముంగ ఈడ మున్గతడు ఆడ తేల్తడు. బెలుక్కుబెలుగు చేతికందిన కొడుకు వొయినంక ముసలోల్లు గుండికొంగలోలె బతుకు ఎల్లదీత్తండ్రు. అది ఇంగిలీకం చేతికి దొరుకది. మా బావది మాలపంకిడిగుణం. నీ సద్దకుని కొడుకు జెల్లపిల్ల లెక్కనే ఆడుతుండేమోయి. ఏమిర బామ్మర్ది బుడ్డపరుక లెక్క చింగిడిబింగిడి తిరుగుతున్నవ్. బింకం ఎక్క-బిగి తక్క వాడు ఉత్త నీరుగట్టె. అందట్ల గా బక్కపిల్ల సందమామ కొడిపెలెక్కున్నది. ఇట్ల చెప్పుకుంటవోతే చెరువుకట్ట దాటుతంగని మాటలకు తీరం ఉండదిగద.

ఇగ చెర్వుశికం మీదంగా కొండెంగల బోటిమీదికి ఓపారి చూడుండ్రి. చెట్టుకొక్క మాట, ఆకుకొక్క కైత్కం కండ్లవడుద్ది. నక్కెత్తులు, నక్కజిత్తులు మనకు తెల్వనియా. ఒంటరిగ తిని బలిసిన వాల్లను ఓనలనక్క అంటరు. కావల్సుకోని చెడగొట్టు పనులు చేసెటోల్లను మర్నాగి అంట పిలుస్తరు. పెయ్యినిండ ఎంటికెలున్నోల్లను గుడ్డెలుగు అంటరు. లేచిలేచి ఉరికెటోల్లను లేడిపిల్ల అంటరు. వాని మెకం గనితీ, నాగుంబామంబ కోపం-జెర్రిగొడ్డంత పిరికి. నీకేంది వెయ్యిగాల్ల జెర్రివి. కోతికి ఆతులు పుట్టిస్తడు వానితోటి నీకేం సోపతిరా. వాంది ఉడుం పట్టు. దీంది మకురం పట్టు. సర్పంజిది పెద్దపులిసూపు ఊరు ఏమైతదో ఏమో పో. మా చిన్నబాపు కొక్కువట్టినకోడి ఇంట్లకెల్లి ఎల్లడు. పోరడు బల్లివట్టినట్టు పట్టుకున్నడు. బడిపిల్లలు పోచమ్మపౌజు (చీమలదార) లెక్కనే బైలెల్లిండ్రు. అబ్బో వాల్ల జోలికివోతె కంటితీగెలెక్క ఎంటవడుతరు. ఉడుత ఊపులకు కాయలు రాల్తయా. పిట్టలతోటి బియ్యం చేపిచ్చినట్టు, మకురం పట్టు, లొట్టిమీది కాకి, రద్ది రామచిలుక, బుడుగుల దున్న, బూడిదిల

కుక్క, వనమిడిచిన కోతి, జేముకుజేము, మందమీద తోడేలు, పిరంగి పిట్ట, నాలెముచ్చు, ఎర్రదేలు, ఇసపు నాగన్న, గూట్లెగువ్వ, ఒంటిరెక్క పానం, మన్నుదిన్న మంజేరు, రెండుదల్కాయల పాము, దుక్కిల దున్నపోతు, మిడిగుడ్ల మిడుత, పెద్దపిట్ట, గుడ్లగూప గిసొంటియి ఇంక మాలేసుగ ఉన్నయి.

ఇగ పోదాంపాండ్రి, పోకుంట పోకుంట మాట్లాడు కుందాం. చెల్కమీద ఒక్క పురుగులేరు, ఏమెండగొడుతందిర అయ్య, చిత్తెండకు చీమెలు మాడిపోతయని వట్టిగనే పుట్టిందా. గింతేనా, చిత్రగతాల ముచ్చట్లు ఇంక ఎన్ని లెవ్వని? మన నెత్తెంటిల కాడికెల్లి అరికాలు దనుక పురుగుబూచినొ గొడ్డుగోజకు కలిపిజెప్పుకున్న ముచ్చట్లు శాన చిత్రచిత్రంగ కనవదుతై. గొర్రెబూరు, కొంగమెడ, గద్దముక్కు, ఏనుగుచెవులు, ఏనుగుకండ్లు, పిల్లికండ్లు,గొర్రెకండ్లు, బర్రెపండ్లు, ఎలుకపండ్లు, ఎద్దునాలికె, బాతుమూతి, రొయ్యమీసాలు, కోతిమొకం, కుక్కగోర్లు, తోడేలుపొట్ట, కొంగకాళ్లు, ఏనుగుపాదాలు, గుడ్డెలుగు పాదాలు ఇవన్ని రూపునువట్టి పెట్టుకున్నయి. కోడిమెదడు, చీమెకండ్లు, పాముచెవులు, కోయిలకంట్లం, చిలుకపలుకులు, కోతిచేట్టలు, కొంగజెపం, పులిమోర, ఎద్దుచూపు, బల్లిదారం, నక్కగురత్తం, కుక్కబుద్ధి ఇవ్వేమో గునాన్నివట్టి పెద్దలు పేరువెట్టి పిలుసుకున్న లచ్చనాలు.

మాటను మనిశే పుట్టిచ్చిండుగని, మాటలమర్మం చెప్పుడు మనిశితోటి కానిపని. ఎంత చెప్పుకున్నసరే మాట ఒగ ఒడువని మూట. ఎన్ని మాటలు ఏరుకచ్చినా పారేగంగను పిడికిట్ల వట్టినట్టే ఉంటది. ఇప్పటిదాక మనం చెప్పుకున్నది ఈకెగాదు–తోకగాదు. మనం తండ్లాడింది అంతకంతా తోక ఎల్లి–ఏనుగు మిగిలినంత. మన మాటలల్ల దాగున్న జీవరాసి గురించి రాస్తె రామాండమైతది–పాడితె బారతమైతది. మతిల ఎంతదాగుంటె ఏంది, మాటతోటి బయటవడ్డదే ఆకటికి ఆదుకున్న సద్దిమూట తీరు. మన జీవంగల్ల మాటముచ్చట్లను, తోచింది తోచినంతల ఇమానం కొద్ది చెప్పిన. మన మాటను కాపాడుకుంటానికి ఏ తొవ్వదొక్కాల్నో, మీకు మీరు పమానం చేస్కోని ఆలోచనచెయ్యిమని పదేల్ల పబ్బతి పదుతున్న.

ఆధారాలు:

1. తెలంగాణ జాతీయాలు–వేముల పెరుమాళ్లు. విరాట్ పబ్లికేషన్స్. సికింద్రాబాద్: 1998
2. తెలంగాణ పదకోశం–నలిమెల భాస్కర్. అలుగు ప్రచురణలు: 2003
3. పామర సంస్కృతం–డా. కపిలవాయి లింగమూర్తి. వాణీ ప్రచురణలు. నాగర్ కర్నూలు: 2016
4. పుట్టువడితోటి పల్లెపట్టున నేను నేర్చుకున్న పలుకుబడి
5. మా ఊరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కతలు–పాకాల యశోదారెడ్డి. సుధర్మ పబ్లికేషన్స్. హైదరాబాదు: 2000.

రచయిత: సహ ఆచార్యులు
తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ.ప్ర.),
సిద్ధిపేట, తెలంగాణ

(27వ పేజీ తరువాయి)

జానపదుల ఉచ్చారణలో భేదాలు లేనప్పటికీ విద్యావంతుల ఉచ్చారణలో ముఖ్యంగా వరంగల్, నల్లగొండ జిల్లాలో కొన్ని భేదాలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటై దశాబ్దం దాటినా, తెలంగాణ మాండలిక స్వరూప, స్వభావాలను ప్రత్యేక శ్రద్ధతో పరిశోధన చేయాల్సిన అవశ్యకత కనబడుతుంది. తెలంగాణ సాహిత్యం, అదేవిధంగా వివిధ రకాల ప్రక్రియలపైన, నిఘంటువుల పైన కృషి జరుగుతున్నప్పటికీ, తెలంగాణ మాండలికాలపైన సమగ్రమైన పరిశోధన జరగాలని, అంతరించిపోతున్న వృత్తిపదాలను, మాండలిక పదాల్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలూ ముఖ్యంగా, సాహిత్య, భాషాశాస్త్ర శాఖలు పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది. తదనుగుణంగా అడుగులు వేయాలి, సమగ్రమైన తెలంగాణ భాషాస్వరూపాన్ని దర్శించాలి.

ఉపయుక్త గ్రంథసూచి:

1. కృష్ణమూర్తి, భద్రిరాజు (సం). 1979. తెలుగు భాషా చరిత్ర. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ.
2. ప్రకాశం, వెన్నెలకంటి. 1983. భాషా వ్యాసాలు. ఓంకార్ ప్రచురణలు. నెల్లూరు. ఆంధ్ర ప్రదేశ్.
3. ప్రకాశం, వెన్నెలకంటి. 2018. ఆధునిక తెలుగు : వెన్నెలకంటి వ్యాకరణం. నిర్విత పబ్లిషింగ్. హైదరాబాద్.
4. రాధాకృష్ణ, బుధరాజు (సం). 2012. తెలుగు మాండలికాలు: వరంగల్ జిల్లా. తెలుగు అకాడమీ. హైదరాబాద్.
5. రాధాకృష్ణ, బుధరాజు (సం). 2004.తెలుగు మాండలికాలు: కరీంనగర్ జిల్లా . తెలుగు అకాడమీ హైదరాబాద్.
6. వేంకటేశ్వర శాస్త్రి, జె. 1987. ఏ స్టడీ ఆఫ్ తెలుగు రీజినల్ అండ్ సోషల్ డియలేకట్స్ : ఏ ప్రోసోడిక్ అనాలిసిస్ (పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం). యూనివర్సిటీ ఆఫ్ లండన్.

రచయిత: సహాయాచార్యులు
భాషాశాస్త్ర విభాగం, డిల్లీ విశ్వవిద్యాలయం.

తెలంగాణ భాషా దినోత్సవ ప్రత్యేక వ్యాసాలు

తెలంగాణ భాషా అస్తిత్వం

జె.డి.ప్రభాకర్

పరిచయం:

భాష వ్యక్తి ఉనికినీ సమాజపు అస్తిత్వాన్నీ చాటుతుంది. భాష అనేది మానవ సమాజపు నాడీ వ్యవస్థ. ఒక భాషలోని పలుకుబడులు, వాడుకలు, పద సంపదలు ఆ సమాజపు చరిత్ర, సంస్కృతి, ఆర్థిక వ్యవహారాల ప్రతిబింబాలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత "తెలంగాణ భాష" అనే అంశం సామాజిక-సాంస్కృతిక చర్చలలో, అకాడెమిక్ వేదికలలో, ప్రజా ఉద్యమాలలో ప్రధానంగా నిలిచింది. భాష కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు, అది ఒక సమాజపు జీవన విధానం, భావోద్వేగాల ప్రతిబింబం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత "తెలంగాణ భాష అస్తిత్వం" అనే భావన కొత్త చైతన్యం పొందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో తెలంగాణ పలుకును హేళన చేసే ధోరణి ఉండగా, రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఈ పలుకే గర్వకారణంగా మారింది. భాషను కేవలం ఒక ఉపభాషగా లేదా మాండలికంగా కాకుండా, తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకతను తెలిపే సాంస్కృతిక బలంగా గుర్తించే దిశగా ఆలోచన పెరిగింది. తెలంగాణ ప్రజల పోరాటం నీళ్లు, నిధులు, నియామకాలు కోసం అయినా, తెలంగాణ ప్రజలందరినీ ఏకం చేసింది 'జై బోలో తెలంగాణ' 'అలైబలై' 'ధూంధాం తెలంగాణ' మొదలగు నినాదాలతో తెలంగాణ భాష చైతన్యంతో, ఉద్వేగంతో ఉద్యమమే చెలరేగి విద్యార్థుల ఆత్మ బలిదానాలతో పోరాటాలతో తెలంగాణ రాష్ట్రమే ఏర్పడింది. అందువల్ల తెలంగాణ భాష అస్తిత్వం గురించి చర్చించుకోవాల్సిన అవసరత ఎంతైనా ఉంది.

చారిత్రక నేపథ్యం

''తెలంగాణ'' అనే పదం లితెలుగు ం ఆనలి (తెలుగువారి నివాస స్థలం) అనే అర్థంతో పూర్వం నుంచే వాడుకలో ఉందని శాసనాధారాలు సూచిస్తున్నాయి. కాకతీయుల శాసనాల్లో (12-13వ శతాబ్దాలు) తెలంగాణ అనే పదం తరచూ కనిపించింది. బహ్మనీ, కుతుబ్ షాహీ, నిజాం పాలనలో కూడా తెలంగాణ అనే పేరే వాడుకలో ఉండేది. భాషాపరంగా ఈ ప్రాంతం ఎల్లప్పుడూ భిన్నమైన ప్రయాణం చేసింది. ఉర్దూ, ఫార్సీ, మరాఠీ, కన్నడ ప్రభావాలు తెలంగాణ తెలుగులో సహజంగా మిళితమయ్యాయి. ఉదాహరణకు, 'చావడి', 'దఫ్తర్', 'కబురు' వంటి పదాలు ఉర్దూ నుంచి, 'జోలె', 'గల్లీ' మరాఠీ నుంచి, 'పందీ' కన్నడ నుంచి వచ్చాయి. ఈ ప్రభావాలు తెలంగాణ భాషా అస్తిత్వానికి ప్రత్యేకతనిచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1953 అక్టోబర్ 1న మద్రాస్ రాష్ట్రం నుండి వేరు చేయబడి కర్నూలును రాజధానిగా ఏర్పడింది. తరువాత 1956 నవంబర్ 1న హైదరాబాదు రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది, హైదరాబాదు రాజధానిగా మారింది. ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో భాషా ఆధారంగా ఏర్పడిన తొలి రాష్ట్రంగా ప్రత్యేకత కలిగింది. కానీ తెలంగాణ ప్రజలు తమ ప్రాంతీయ ప్రత్యేకత, అభివృద్ధి లోపం కారణంగా వేరు రాష్ట్రం కోసం దీర్ఘకాలం 1969 నుండి ఉద్యమించారు. ఆ ప్రయత్నాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ భారతదేశం 29వ రాష్ట్రంగా పునరావిర్భవించింది, హైదరాబాదు రాజధానిగా కొనసాగింది. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ భాషా ఆధారంగా ఏర్పడగా, తెలంగాణ ప్రజా ఉద్యమాల ద్వారా తిరిగి ఏర్పడిన రాష్ట్రంగా చరిత్రలో నిలిచింది.

తెలంగాణ పలుకు లక్షణాలు:

తెలంగాణ పలుకుకు ప్రత్యేకమైన ధ్వని, పద వినియోగం, వాక్య నిర్మాణం వంటి భాషా లక్షణాలు ఉన్నాయి. తెలుగు భాషలోని ప్రామాణిక రూపానికి భిన్నంగా, తెలంగాణ పలుకులో పదాలు స్థానిక భాషా పరిణామం ప్రకారం మార్పులు పొందాయి. ఉదాహరణకు, "మన" అనే పదం "మణ"గా, ''పని'' అనే పదం ''పణి''గా పలకడం ధ్వని భేదాలకు ముఖ్యమైన ఉదాహరణలు. ఈ ధ్వని భేదాలు తెలంగాణ భాషలోని ప్రత్యేకతను మాత్రమే కాదు, ప్రజల జీవనశైలిని ప్రతిబింబించే లక్షణాలను కూడా సూచిస్తాయి. అదేవిధంగా, ''మటుకు'', ''గత్తె'', ''జెప్పు'', ''డొక్క'' వంటి పదాలు తెలంగాణలో మాత్రమే వినిపించే స్థానిక పదజాలం. ఈ పదాలు కేవలం శబ్దరూపాలు కాదు, వాటి వెనుక ఆ ప్రాంతంలోని సంస్కృతి, జీవన విధానం, సామాజిక సంబంధాల ప్రతిబింబం దాగి ఉంటుంది. వాక్య నిర్మాణంలో కూడా తెలంగాణ పలుకు తన ప్రత్యేకతను చాటుతుంది. "ఎక్కడికీ వెళ్తావురా?", "ఇదంతా నువ్వే చేసావోయ్!", "ఏంటి బయ్యా, బాగున్నావా?" వంటి వాక్యరూపాలు సంభాషణలో ఆత్మీయతను, బంధుత్వాన్ని వ్యక్తపరుస్తాయి. ఈ వాడుకలు కేవలం భాషా నిర్మాణాలు కాదు, తెలంగాణ భాషలోని ఉత్సాహం, సరదా, జీవనానందాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక లక్షణాలు. భాషా శాస్త్ర పరంగా చూస్తే, ఈ వాక్య నిర్మాణాలు మరియు పద వినియోగం, తెలంగాణ భాషకు ఒక ప్రత్యేకమైన "సాంఘిక భాషా గుర్తింపు" (socio-linguistic identity)ని కల్పించాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో భాష స్థితి

1956లో ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ రాష్ట్రంలోని

తెలంగాణ ప్రాంతం కలిసిపోవడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఈ కలయిక తరువాత భాషా వ్యత్యాసం ఒక సున్నితమైన సమస్యగా మారింది. తెలంగాణ పలుకును తరచుగా వెనుకబడినదిగా, అసభ్యమైనదిగా చిత్రీకరించారు. ముఖ్యంగా సినిమాల్లో తెలంగాణ భాషను హాస్యరూపంలో చూపించడం వల్ల అది ఒక తక్కువ స్థాయి పలుకుగా మారిపోయింది. "ఒరేయ్, రా, పళ్ళెక్కి మాట్లాడుతున్నాడు" అనే తరహా హాస్యరంగాలు ఈ దురభిప్రాయాన్ని మరింత బలపరిచాయి. విద్యా రంగంలో మాత్రం ఆంధ్ర ప్రాంతపు ప్రామాణిక తెలుగును మాత్రమే "సరైన తెలుగు"గా బోధించారు. ఫలితంగా తెలంగాణ పిల్లలు తమ పలుకులో మాట్లాడితే "సరైన తెలుగు రాదన్న" ముద్ర వేసి, వారిని వెనుకబెట్టే పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి ఉద్యోగాల్లోనూ, సామాజిక వేదికలలోనూ కనిపించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో తెలంగాణ పలుకుతో మాట్లాడేవారిని గౌరవం లేని వారిగా చూసేవారు. ఈ విధమైన తక్కువచూపు కారణంగా తెలంగాణ భాష అస్తిత్వం ప్రశ్నార్థకమై, గౌరవం కోసం పోరాటం తప్పనిసరైంది. క్రమంగా ఈ భాషా అన్యాయం ఉద్యమరూపం దాల్చి, తెలంగాణ రాష్ట్ర స్థాపనకు సాంస్కృతిక ఆధారంగా నిలిచింది.

తెలంగాణ ఉద్యమం మరియు భాషా అస్తిత్వం

తెలంగాణ ఉద్యమ చరిత్రలో కవుల పాత్ర అసాధారణం. ఈ ఉద్యమం కేవలం రాజకీయ పరిమితుల్లోనే కాకుండా భాషా, సాంస్కృతిక, సాహిత్య పరంగా కూడా ఒక పునరుజ్జీవనాన్ని తెచ్చింది. కలోజి నారాయణరావు వంటి ప్రజాకవి తన "నా గోడవ" వంటి కవిత్వం ద్వారా తెలంగాణ ప్రజల దుఃఖం, ఆకాంక్ష, స్వీయగౌరవాన్ని వెలికి తీయగా, అందే శ్రీ రచించిన "జయ జయ హే తెలంగాణ" గీతం ప్రజల గుండెల్లో గర్జనగా మారింది. దేశపతి శ్రీనివాస్ తన జానపద స్వరాల ద్వారా విశ్వవిద్యాలయాల నుండి ఊర్ల వరకూ ప్రజల్లో ఆత్మగౌరవం నింపగా, నందిని సిద్దారెడ్డి ఆధునిక భావాలతో తెలంగాణ భాషా-సంస్కృతిని గౌరవించే కొత్త తరాన్ని తీర్చిదిద్దాడు.

గద్దర్ తన బల్లాడ్లతో ఉద్యమ సాంస్కృతిక ప్రతీకగా నిలిచాడు. ఆయన పాటలు కేవలం వినోదం కాదుబీ ఆవేదన, ఆగ్రహం, ఆశలను కలిపిన సామూహిక స్వరాలుగా వినిపించాయి. విమలక్క బతుకమ్మ పాటల ద్వారా మహిళా గాత్రాన్ని ఉద్యమంలో ముందుకు తెచ్చి, తెలంగాణ ఆత్మను స్త్రీ దృష్టిలోనూ ప్రతిబింబించింది. జ్వాలాముఖి వంటి విప్లవ కవులు వర్గపోరాటం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువలను కవిత్వంలో మిళితం చేసి ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశ చూపారు. వీరితో పాటు పెర్వారం జగ్గన్నాథం, రమేష్ కార్తీక్ నాయక్, సుద్దల అశోక్ తేజ వంటి కవులు కూడా తెలంగాణ గీతాలను ప్రజలలో వ్యాప్తి చేశారు.

ఇలా తెలంగాణ ఉద్యమం కవుల రక్తకన్నీళ్లు, భాషా పట్ల మమకారం, సాంస్కృతిక గర్వం మీద నిలిచింది. రాజకీయ నాయకులు పోరాటానికి దిశ చూపినప్పటికీ, కవులు ప్రజల మనసులో అగ్ని రాజేసి ఉద్యమానికి ఆత్మను అందించారు. భాషను జెండాగా, గీతాన్ని ఆయుధంగా, కవిత్వాన్ని స్ఫూర్తిగా మలచిన కవుల వల్లే తెలంగాణ ఉద్యమం ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయింది.

1969లో జరిగిన తెలంగాణ ఉద్యమం సమయంలో విద్యార్థులు, యువత తమ ప్రాంతీయ గుర్తింపును కాపాడుకోవడానికి వీధుల మీదికి వచ్చారు. ఆ సమయంలో రాసిన కవిత్వం, గేయాలు తెలంగాణ పలుకుతో నిండిపోయాయి. 2001-2014 మధ్య తెలంగాణ రాష్ట్ర సమితి నాయకత్వంలో ఉద్యమం మళ్ళీ ఊపందుకుంది. కె. చంద్రశేఖరరావు ప్రసంగాలు పూర్తిగా తెలంగాణ పలుకులోనే ఉండటం భాషా గర్వాన్ని పెంచింది. భాషను గౌరవించుకోవడం అనేది రాజకీయ స్వరూపాన్ని సైతం నిర్ణయించింది. భాష అస్తిత్వమే ఉద్యమానికి కేంద్రీయ బిందువుగా మారింది. తెలంగాణ జానపద గీతాలు, బతుకమ్మ గేయాలు, గొల్లసుద్దులు, జంగం కథలు అన్నీ తెలంగాణ పలుకుతోనే కొనసాగాయి. ఓదెలు రామిరెడ్డి, కోలకులూరి ఎర్రన్న, కీ. శి. పట్నాయక్, జయశంకర్ వంటి కవులు తెలంగాణ భాషా అస్తిత్వాన్ని కవిత్వంగా మలిచారు. కథలు, నవలలు, జానపద సంప్రదాయాలు అన్నీ ఈ ప్రాంతపు ప్రత్యేక పలుకును ప్రతిబింబించాయి.

మీడియా మరియు సినిమాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో సినిమాలలో తెలంగాణ పలుకు ఒక వ్యంగ్యానికి, హాస్యానికి మాత్రమే పరిమితం చేయబడింది. హీరోలు, ప్రధాన పాత్రధారులు ఎల్లప్పుడూ ప్రామాణిక ఆంధ్ర తెలుగు మాట్లాడగా, తెలంగాణ పలుకును ఎక్కువగా హాస్యనటులు లేదా ప్రతినాయకుల నోట పెట్టేవారు. దీని వలన ఈ పలుకుకు సామాజిక గౌరవం దక్కక, ఒక వెనుకబడిన భాషా రూపంగా ముద్ర వేసారు. కానీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఈ పరిస్థితి మారింది. "ఫిదా", "పెళ్లిచూపులు" వంటి సినిమాలు తెలంగాణ పలుకును గౌరవప్రదంగా చూపించి, ప్రధాన పాత్రలలోనే వినిపించాయి. వీటివల్ల తెలంగాణ పలుకు ఒక సాంస్కృతిక గర్వంగా నిలిచింది. టెలివిజన్ సీరియల్స్, రియాలిటీ షోలలో కూడా తెలంగాణ పలుకు విస్తృత స్థాయిలో వినిపిస్తూ, కుటుంబాలు, యువత, వృద్ధులందరికీ సులభంగా చేరువవుతోంది. అదేవిధంగా సోషల్ మీడియా వేదికలలో చిన్న చిన్న వీడియోలు, పాటలు, హాస్యరచనలు తెలంగాణ పలుకుతోనే వస్తూ, లక్షలాది మంది వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ విధంగా మీడియా మరియు సినిమాలు తెలంగాణ పలుకును ఒక అణగారిన భాషా రూపం నుండి, గౌరవనీయమైన సాంస్కృతిక గుర్తింపుగా ఎదగడానికి ముఖ్యపాత్ర పోషించాయి.

విద్యా వ్యవస్థలో భాష

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యా రంగంలో భాషకు కొంచెం ప్రాధాన్యం వచ్చింది. పాఠశాల పుస్తకాలలో

పూర్తిగా కాకపోయినా కొన్ని కథలు, జానపద గేయాలు, స్థానిక పదజాలం ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులు తమ స్వస్థల పలుకును పాఠ్యాంశంలో చూడగలిగే అవకాశాన్ని పొందుతున్నారు. ఉదాహరణకు, ప్రభుత్వ పాఠశాలల 5వ, 6వ తరగతి పుస్తకాలలో బతుకమ్మ, కోలిపోతు, గోల్లసుద్దులు వంటి స్థానిక ఉత్సవాలను, పాటలను తెలంగాణ పలుకుతో అందించడం జరిగింది. ఇది పిల్లలలో ఆత్మగౌరవాన్ని పెంచడం మాత్రమే కాక, భాషా వైవిధ్యాన్ని గౌరవించే దిశగా ఒక పెద్ద ముందడుగు.

తెలంగాణ భాషా అభివృద్ధి అకాడమీ స్థాపించబడింది. ఇది స్థానిక పదజాలాన్ని సేకరించడం, భాషా నిఘంటువులు తయారు చేయడం, పరిశోధనలు చేయడం, పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉదాహరణకు, "తెలంగాణ పదజాల కోశం" అనే కార్యక్రమంలో 10,000కి పైగా స్థానిక పదాలను సేకరించి, వాటి అర్థాలను, వాడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సులభంగా ఉపయోగించగలలా రూపొందించారు.

భవిష్యత్తులో విద్యా రంగంలో తెలంగాణ పలుకును మరింత స్థిరపరచడానికి కొన్ని సూచనలు ఉన్నాయి. ప్రాథమిక మరియు మాధ్యమిక పాఠశాలల్లో స్థానిక కథలు, పాటలు, పాఠ్యాంశాలు తెలంగాణ పలుకుతో ఉండేలా చేస్తే, పిల్లలు తమ స్వస్థల పలుకును గర్వంగా ఉపయోగించగలరు. ఇంకా, ఉపాధ్యాయుల శిక్షణలో స్థానిక పలుకును ఉపయోగించి భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించే పాఠ్యాంశాలను రూపొందించడం ద్వారా భాషా సమానత్వం మరియు సాంస్కృతిక గౌరవం స్థిరపడుతుంది.

ఆర్థిక, డిజిటల్ కోణం

"సమాజపు ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం భాష, భాషలకు వాణిజ్య పరమైన సామర్థ్యం ఉంటుంది. అంటే సమాజంలో స్థానిక వాణిజ్య శక్తులు బలపడడానికి స్థానిక భాషల ఆర్థిక స్థాయి పెరగాలి. స్థానిక భాషల ఆర్థిక స్థాయిలో పెరుగుదల సమాజపు ఆర్థిక శక్తికి నిదర్శనం" అని భాషావేత్త ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' పుస్తకంలో స్థానిక భాషలకు ఆర్థిక వ్యవస్థకు గల సంబంధాన్ని చర్చించారు. తెలంగాణలోని కొన్ని పని స్థలాలలో పారిశ్రామిక రంగంలో నేను చేసిన పరిశోధన ఫలితాలు పరిశీలిస్తే నూటికి 86% శ్రామికులు తెలంగాణ భాషలోనే మాట్లాడుతున్నారు. ఇంగ్లీషు భాష కేవలం నాలుగు శాతం మాత్రమే పై స్థాయి అధికారుల చేత వాడబడుతుంది. తెలంగాణ భాష మన ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం అని 'ఆర్థిక వ్యవస్థ – భాష' అనే పుస్తకంలో అనుభవ ఆధారాలతో నేను చర్చించడం జరిగింది.

ఈరోజు డిజిటల్ వేదికలు తెలంగాణ పలుకుకు కొత్త జీవం పోశాయి. యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ వంటి వేదికలలో తెలంగాణ పలుకుతో తయారైన పాటలు, చిన్న చిన్న కామెడీ వీడియోలు, జానపద గీతాలు విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. వీటిలో కొన్ని లక్షల వ్యూస్ సాధించి, కంటెంట్ క్రియేటర్లకు ఆర్థిక లాభాలను కూడా తెస్తున్నాయి. అంటే భాష ఇప్పుడు కేవలం సాంస్కృతిక గుర్తింపు మాత్రమే కాకుండా, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఒక మూలధనంగా మారింది. తెలంగాణ పలుకుతో రూపొందిన కంటెంట్ ప్రేక్షకులను ఆకర్షించే శక్తి కలిగి ఉండటంతో, ఇది ఒక ప్రత్యేక "మార్కెట్ వాల్యూ"ను సృష్టిస్తోంది. భాషా ఉత్పత్తులు, పాటలు, సినిమాలు, ఆన్లైన్ ఈవెంట్లు ఇవన్నీ ఇప్పుడు తెలంగాణ పలుకు ఆధారంగా ఆర్థిక అవకాశాలను కల్పిస్తున్నాయి. ఇలాంటివి భాష కేవలం సంస్కృతికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజ ఆర్థిక నిర్మాణంలోనూ ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని సూచిస్తున్నాయి.

ముగింపు

తెలంగాణ భాష అస్తిత్వం కేవలం భాషా రూపం మాత్రమే కాక, ఒక ప్రాంతీయ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ గుర్తింపును ప్రతిబింబిస్తుంది. ఇది శతాబ్దాల చరిత్ర, సాహిత్యపరంపర, ప్రజా పోరాటాల ఫలితంగా ఏర్పడినది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఎదురైన అసమానతలు, హాస్యాస్పద భాషా చిత్రణలు, సామాజిక వెనుకబడిన భావాలు, ఈ పరిణామాలు భాషా గౌరవానికి ఎదురైన సవాళ్లుగా నిలిచాయి. వాటి ప్రతిఘటనగా తెలంగాణ ఉద్యమం బలంగా మారింది, కవులు, గేయకారులు, జానపద కళాకారులు భాషను ప్రజల గుండెల్లోకి చేర్చారు, సాంస్కృతిక గుర్తింపును బలపరిచారు.

రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ పలుకు సాంఘికంగా, విద్యా రంగంలో, మీడియా వేదికల్లో గౌరవనీయంగా నిలిచింది. సినిమాలు, సీరియల్స్, సోషల్ మీడియా కంటెంట్ ద్వారా భాష యువతలో కొత్త ఉత్సాహాన్ని సృష్టిస్తూ, సాంస్కృతిక గుర్తింపుతో పాటు ఆర్థిక అవకాశాలను కూడా అందిస్తోంది. పాఠశాలల్లో స్థానిక పదజాలం ప్రవేశించడం, భాషా పరిశోధన మరియు అకాడమిక్ ప్రోత్సాహం వంటి చర్యలు భాషను మరింత స్థిరపరుస్తున్నాయి.

భవిష్యత్తులో తెలంగాణ పలుకును మరింత బలపరిచి, సమాజంలోని అన్ని రంగాల్లో స్థిరపరచడం మనందరి బాధ్యత. స్థానిక పదజాలాన్ని సంరక్షించడం, భాషా సాహిత్యాన్ని అభివృద్ధి చేయడం, మీడియా, డిజిటల్ వేదికల ద్వారా విస్తరించడం భాషకు శాశ్వత అస్తిత్వం, సాంస్కృతిక గౌరవం, భవిష్యత్తుకు పునరుజ్జీవనాన్ని ఇవ్వగలవు. తెలంగాణ భాష కేవలం సంస్కృతి గుర్తింపు మాత్రమే కాకుండా, ప్రజల ఆత్మగౌరవానికి, సామాజిక ఐక్యతకు, ఆర్థిక సృజనాత్మకతకు కూడా కీలక పాత్ర పోషిస్తున్నది.

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్
గీతం యూనివర్సిటీ, హైదరాబాద్

తెలంగాణ భాషా దినోత్సవ ప్రత్యేక వ్యాసాలు

తెలంగాణ తెలుగు మాటల నిధి(స్పీచ్ కార్పస్) ఆవశ్యకత

డా. జి.ప్రవీణ్

భూమిక:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం కావస్తోంది. పెద్దమనుషుల ఒప్పందం, వాటి ఉల్లంఘనలు చూసాం. అలాగే నీళ్ళు, నిధులు, నియామకాల బట్వాడ ప్రాంతాలవారిగా 100 శాతం జరగలేదు. వీటిని భూమికగా చేసుకొని, తెలంగాణ ప్రజల ఆకలికేకలు, ఆర్తనాదాలు, ఉద్యమాలతో ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నాం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే క్రమంలో తెలంగాణ 'యాస' కీలకపాత్ర పోషించిందన్న విషయం మనందరికీ తెలిసిందే. తెలంగాణ తెలుగుపై చూపిన వివక్షను ప్రశ్నించిన మనం, తెలంగాణ తెచ్చుకున్నాక భాష అభివృద్ధికోసం ఏం చేసాం? అన్నదే ఇప్పటి ప్రశ్న.

భాషని ఆధునిక అవసరాలకు అనుగుణంగా వాడాలంటే అభివృద్ధి చెందుతున్న కృత్రిమమేధతో (సాంకేతిక) ఆధునీకరించడం అత్యవసరం. భాషాభివృద్ధిలో కృత్రిమమేధ సహాయం తీసుకోకపోతే, భాష వెనుకపడిపోతుందని యునెస్కో అభిప్రాయం. ఈ ఆధునికకాలంలో కృత్రిమమేధ ముఖ్యంగా, బృహత్ భాషానిధుల నమూనాల సహాయంతో చాలా కొత్త కొత్త ఆవిష్కరణలు, శరవేగంగా జరుగుతున్నాయి. అదే వేగంతో, తెలంగాణ తెలుగు భాషాభివృద్ధి కూడా జరగాలి. తెలంగాణ ప్రజలు వారి నిత్యజీవితంలో రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికి చరవాణి(ఫోన్), సంగణక యంత్రం (కంప్యూటర్), అంతర్జాలం (ఇంటర్నెట్) తప్పకుండా వాడుతూనే ఉంటారు. కానీ, మన అవసరాలను తీర్చుకోవడానికి ఎంతమంది ఉపకరణాల(ఆప్స్/టూల్స్)ను మన తెలుగు భాషలో వాడుతున్నారన్నదే పెద్ద ప్రశ్న. ఎక్కువ శాతం ఉపకరణాలు ఆంగ్లంలో ఉండడం వలన తెలిసీతెలియక ఆంగ్లీకరించి (రోమన్ లిపిలో తెలుగు రాయడం) బండ గుర్తులు పెట్టుకొని అక్షరాస్యులు, నిరక్షరాస్యులు చరవాణి, అంతర్జాలం, వివిధ అనువర్తనాలు (ఆప్స్/టూల్స్) (వాట్సాప్, ఫేకబుక్కు, ఇన్స్టాగ్రాం, ట్విట్టర్ మొదలైన) వాడుతున్నారు. తెలుగు ప్రధాన భాషగా తెలంగాణ రాష్ట్రంలో మాట్లాడుతున్నారు. ఇది ద్రావిడ భాష కుటుంబానికి చెందినది.

భాషా సాంకేతికత

ఈ ఆధునికకాలంలో భాషాసాంకేతిక క్షేత్రం అత్యంత ప్రాచుర్యం పొందుతుంది. ఈ క్షేత్రంలో భాషాశాస్త్రం, సంగణక శాస్త్రం, కృత్రిమ మేధస్సు, ఇతర క్షేత్రాల కలయికతో ఏర్పడింది. ఈ రంగంలో భాషానిపుణులు, సంగణక శాస్త్రజ్ఞులు, ఇతరులు కూడా పరిశోధనలు చేస్తున్నారు. భాషాసాంకేతికరంగంలో భారతీయ భాషలకు స్వయంచాలక ఉపకరణాలు తయారుచేయడం ముఖ్య లక్ష్యం. యంత్రంద్వారా భాషాశాస్త్ర విశ్లేషణ, తెలుగు సంగణక వ్యాకరణం, తెలుగు దిద్దరి (స్పెల్ చెకర్), తెలుగు పాఠాలను, మాటలను గుర్తించడం (టెక్స్ట్, స్పీచ్) మొదలైన ఉపకరణాలు తయారు చేశారు. ఇది గత మూడు దశాబ్దాలనుండి జరుగుతున్న పరిశోధన. ప్రస్తుతం స్పీచ్ టెక్నాలజీ రంగంలో భారతీయ భాషలకు మాటల నిధిని తయారు చేస్తున్నారు. ఈ నిధిని ఉపయోగించి స్పీచ్ టు స్పీచ్ యంత్రానువాదం భారతీయ భాషలనుండి భారతీయ భాషలకు అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హైదరాబాదు, ఐ.ఐ.టి. మద్రాసు కలిసి అభివృద్ధి చేస్తున్నాయి.

ప్రస్తుతం ఈ ఆధునికకాలంలో స్పీచ్ టెక్నాలజీపై పరిశోధనలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. ఉదాహరణకు సిరి, అలెక్సా, గూగుల్ అసిస్టెంటు, బిక్స్ బి, అర్టానా, మైక్రోఫ్ లాంటి ఉపకరణాలద్వారా, మనం మనకు కావాల్సిన పాటను నోటితో మాటలరూపంలో చెబితే, ఆ పాటని అంతర్జాలం లేక అనువర్తనంలో నుండి వెతికి పట్టుకొచ్చి, మనకు పాడి వినిపిస్తుంది. అలాగే కారులో రహదారిపైన దూరప్రయాణం చేసేటప్పుడు, అతివేగంతో కారును నడిపిస్తున్నప్పుడు, మనకు మన భాషలో "మీరు అతివేగంగా కారుని నడిపిస్తున్నార"ని హెచ్చరిస్తుంది. మనం అంతర్జాలంలో ఏది వెతకాలనుకున్నా శోధకం(సెర్చ్ ఇంజన్)లో మీటను నొక్కిపట్టుకొని గట్టిగా 'కొత్తగా వచ్చిన తెలుగు సినిమా పేర్లు ఏమిటి?' అని అడిగితే, వెంటనే సమాధానం ఇస్తుంది. ఇవన్నీ స్పీచ్ టెక్నాలజీ ద్వారా స్పీచ్ (మౌఖిక భాషోపకరణాలను) తయారు చేయడంవల్ల అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు ఇలాంటి ఉపకరణాలను వారి వారి అవసరాలకు నిత్యజీవితంలో వాడుతుంటారు. కానీ, ఈ అనువర్తనాలు కేవలం ప్రామాణిక తెలుగు భాషలో మాట్లాడితే తప్ప అర్థం చేసుకోవు. ఎందుకంటే, ఈ అనువర్తనాలు కేవలం ప్రామాణిక తెలుగులో చెబితేనే వెతికి పెడుతుంది. మనం తెలంగాణ మాండలికంలో చెబితే, శోధకం గుర్తంచదు లేక వెతికి పెట్టదు. ఎందుకంటే అనువర్తనానికి తెలంగాణ మాండలికాన్ని గుర్తించే సామర్థ్యం లేదు. దానికి కారణం తెలంగాణ తెలుగు మాటల నిధి లేకపోవడం. ఈ మౌఖిక తెలుగు అనువర్తనాలన్నీ మన తెలంగాణ తెలుగుని కూడా గుర్తించాలంటే మనకు తెలంగాణ తెలుగు మాటల నిధి

(స్పీచ్ కార్పస్) కావాలి. అప్పుడు స్వయంచాలకంగా తెలంగాణ తెలుగులో వ్యవహర్త వారి ప్రశ్నలను అడిగితే, సమాధానం చెప్పే పరిస్థితి ఉంటుంది.

పూర్వ పరిశోధన

ప్రస్తుతం ప్రధాన భారతీయ భాషలకు స్పీచ్ కార్పస్ లింగ్విస్టిక్స్ డేటా కన్సార్షియం ఫర్ ఇండియన్ లాంగ్వేజస్, భారతీయ భాషాసంస్థ, కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, మైసూరు, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగుళూరు, ఎఐఫర్ భారత్, ఐ.ఐ.టి., మద్రాసు, ఇంటర్నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హైదరాబాదు, వివిధ పరిశోధన సంస్థలు స్పీచ్ టెక్నాలజీపై పరిశోధనలు చేస్తున్నాయి. అలాగే చాలా పెద్ద ఎన్.ఎల్.పి కంపెనీలు కూడా స్పీచ్ టెక్నాలజీ రంగంలో కృషిచేస్తున్నాయి. వివిధ పరికరాలలో అమర్చడంకోసం స్వయంచాలక స్పీచ్ అప్లికేషన్లు తయారుచేస్తున్నారు. ఇవన్నీ ప్రామాణిక భాషలకు తయారుచేస్తున్నారు. ప్రామాణిక భాషలో కాకుండా ఎవరైనా తెలంగాణ, రాయలసీమ మాండలికాల్లో ప్రశ్నలు అడిగితే, సమాధానాలు చెప్పే పరిస్థితిలో ఉపకరణాలు లేవు. ఇది ఈ స్పీచ్ టెక్నాలజీ రంగంలో నేను గమనించిన అంశం. ఒకవేళ తెలంగాణ తెలుగులో మాటల నిధిని నిర్మించాలంటే ఎలాంటి మెలుకువలు తెలిసి ఉండాలి? మొదలైన అంశాలు ఈ పరిశోధన పత్రంలో వివరించాను.

తెలంగాణ తెలుగు మాటల నిధిని ఎలా నిర్మించాలి?

తెలంగాణ ప్రజలు, వారు మాట్లాడుతున్న మాటలను ఆడియో ఫైల్స్ రూపంలో రికార్డు చేయాలి. ఇలా ప్రతీ తెలంగాణ తెలుగు మాండలికాన్ని సేకరించాలి. ఇలా ఒక వ్యక్తి 500 గంటల తెలంగాణ తెలుగు మాటల నిధిని గనుక తయారుచేయగలిగితే, అప్పుడు మనం సంగణక భాషాశాస్త్రరంగంలో తెలంగాణ తెలుగు మాటల నిధిని ఉపయోగించి మెషీన్ లర్నింగ్ టెక్నిక్స్, డీప్ లర్నింగ్ మోడల్స్, జనరేటివ్ ఆర్టిఫీయల్ ఇంటలిజెన్స్ ని ఉపయోగించి, తెలంగాణ తెలుగు ఉపకరణాలను కూడా మనం తయారుచేయవచ్చు. దీని ద్వారా స్వయంచాలక మాటల గుర్తింపు (ఆటోమెటిక్ స్పీచ్ రికగ్నీషన్) ఉపకరణాలను, స్పీచ్ టు టెక్స్టు, టెక్స్టు టు స్పీచ్ అనువర్తనాలు, మూల భాష నుండి లక్ష్య భాషలోకి మాటల ద్వారా (స్పీచ్ టు స్పీచ్) యంత్రానువాద వ్యవస్థలు తెలుగు ప్రామాణిక భాషలోనే కాక, తెలంగాణ తెలుగు పాఠాలను కూడా ఇతర భాషలకు తర్జుమా చేయడానికి సాధ్యమైతుంది. అయితే, మాటల నిధి తయారుచేసే క్రమంలో మనం ప్రతి ఒక మాండలికం నుండి నమూనాలను తీసుకోవాలి. ఉదాహరణకు ఉత్తర తెలంగాణ తెలుగు, దక్షిణ తెలంగాణ తెలుగు మాండలిక భేదాలన్నీ మాటల నిధిలో చేరేలాగా చూడాలి. అలా చేర్చినప్పుడే, చురుకైన, తెలివైన అనువర్తనాలను తయారుచేయడానికి వీలుపడుతుంది. అలా చేయని పక్షంలో, మాండలికాల భేదాలన్నీ గుర్తించలేకపోవచ్చు.

తెలంగాణ తెలుగు మాటల నిధి

సాధారణంగా సహజ భాషా ప్రణాళిక లో భాషానిధుల ఆవశ్యకత ఎంతైనా ఉంది. భారతీయ భాషలకు ఎలాంటి భాషోపకరణాలు తయారు చేయలన్న భాషానిధి ప్రాథమిక వనరులుగా సహజ భాషా ప్రక్రియ లో పరిగణిస్తాము. ఈ భాషనిధులు రెండు రకాలు. అవి మౌఖిక మరియు లిఖిత. మాటల నిధి నిర్మాణం యొక్క ముఖ్య ఉద్దేశ్యం స్పష్టంగా ఉండాలి. మొదట తెలంగాణ తెలుగు మాటల నిధి నిర్మించడానికి ఒక క్షేత్రాన్ని ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు ఆరోగ్యం, వ్యవసాయం, వినోదం మొదలైనవి. తెలంగాణ తెలుగు వ్యవహర్తల కోసం ఈ మూడు రంగాలలో స్పీచ్ అనువర్తనాలను అభివృద్ధి చేయాలంటే మాటల నిధి అవసరం. ఆరోగ్య రంగం లో ఆరోగ్య సహకారులను (Health Assistant) తయారు చేయడానికి ఆరోగ్య రంగానికి చెందిన మాటలనిధి అవసరం. అలాగే వ్యవసాయ రంగం లో వ్యవసాయ సహకారులను (Agriculture Assistant) తయారు చేయడానికి వ్యవసాయ రంగానికి చెందిన మాటలనిధి అవసరం. తెలంగాణ తెలుగు లో మాటలను వాయిస్ రికార్డర్ తో రికార్డింగు చేసి, ఆడియో దస్త్ర (ఫైల్) రూపం లో దానిని నిక్షిప్తపరిస్తే దానిని మాటల నిధి (స్పీచ్ కార్పస్ లేదా స్పీచ్ డేటాబేస్) అంటారు. భాషలో ఏదైనా ఒక అంశం మీద ఒక క్షేత్రానికి (ఆరోగ్యం, వ్యవసాయం, వినోదం) సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని పాఠ రూపం లో రాసుకొని సాధారణంగా చదువుకుంటూ రికార్డింగు చేస్తారు. ఈ రికార్డింగు చేసేవారు తెలంగాణ తెలుగు వ్యవహర్తలు తెలంగాణ ప్రాంతం లో స్థిరపడిన వాళ్లు అయి ఉండాలి.

తెలంగాణ తెలుగు మాటల నిధి (స్పీచ్ కార్పస్) లక్షణాలు

తెలంగాణ తెలుగు మాటల నిధి (స్పీచ్ కార్పస్) అనేక లక్షణాలను కలిగి ఉంటుంది. ముఖ్యంగా ఎనిమిది ముఖ్యమైన లక్షణాలు ఉన్నాయి. అవి తెలంగాణ తెలుగు వ్యవహర్తల వైవిధ్యం, వివిధ రకాల ప్రసంగ శైలులు, ఆడియో రికార్డింగులు, లిప్యంతరీకరణలు, మెటాడేటా, పాఠ/వచన వైవిధ్యం, పరిమాణం మరియు పరిధి, ప్రయోజనం-నిర్దిష్ట రూపకల్పన మొదలైనవి. ప్రతీ లక్షణం వివరంగా చర్చిస్తాము.

1. తెలంగాణ తెలుగు వ్యవహర్తల వైవిధ్యం:

తెలంగాణ తెలుగు మాటల నిధి నిర్మించడానికి తెలంగాణ తెలుగు వ్యవహర్తలను ఎంపిక చేసుకోవాలి. మొగ మరియు ఆడ వ్యవహర్తలను సమతుల్యంగా ఎంపిక చేసుకోవాలి. వివిధ వయస్సుల వారిని మాటల నిధి నిర్మాణం కోసం ఎంపిక చేసుకోవాలి. వివిధ తెలంగాణ ప్రాంతాల నుండి (ఉత్తర, దక్షిణ తెలంగాణ మండలాలు) వ్యవహర్తలను ఎంపిక

చేసుకోవాలి. అన్నీ ప్రాంతాల మాండలికాల వ్యవహర్తలు అన్నీ సామాజికాంశాల నుండి ప్రాతినిధ్యం వహించాలి. ఈ ప్రక్రియ లో స్థానికతకు ప్రాతినిధ్యం వహిస్తూ వక్తలను ఎంపిక చేయాలి.

2. వివిధ రకాల ప్రసంగ శైలులు:

తెలంగాణ తెలుగు లో మనం ఎంపిక చేసుకున్న వార్తలను, కథలను, కథానికలను లేక లిఖిత ప్రతులను సిద్ధం చేసుకోవాలి. [illegible] లేక పాఠాలను లేక వచనాలను వ్యవహర్త గట్టిగా స్పష్టంగా చదవాలి. వ్యవహర్త సహజమైన తెలంగాణ తెలుగు సంభాషణలు లేక మాటలు రికార్డు చేయాలి. అసహజ తెలంగాణ తెలుగు సంభాషణలు రికార్డు చేసినట్లైతే యంత్రం అసహజ మాటలు లేక సంభాషణలు నేర్చుకునే ప్రమాదం ఉంది. అలాగే తెలంగాణ తెలుగు లో వివిధ ప్రసంగాలు నిర్దష్ట పనులు లేదా కార్యకలాపాల సమయం లో రికార్డు చేయాలి. ఆలాగే వివిధ భావోద్వేగాలతో (కోపం, ఆనందం, విచారం) కూడుకున్న తెలంగాణ తెలుగు ప్రసంగం, వివిధ రకాల శైలులను ఉపయోగించి వ్యక్త పరిచిన ప్రసంగం అయి ఉండాలి.

3. అధిక నాణ్యత గల ఆడియో రికార్డింగులు:

ఆడియో రికార్డింగుల నామూనా రేటు సాధారణంగా తెలంగాణ తెలుగు లో స్పష్టంగా, వివరణాత్మకంగా 16 కిలో హెర్ట్జ్ లేదా 44.1 కిలో హెర్ట్జ్ మధ్య ఉండాలి. భాషోపకరణాల అవసరాన్ని బట్టి మాటల (భాషా) నిధిలో మాటలను రికార్డింగు చేసేటప్పుడు మాటలు మాత్రమే రికార్డింగు చేయాలి. మాటలు కాకుండా భాషేతర శబ్దములను రికార్డు చేయకపోవడమే మంచిది. అలాగే రికార్డు చేసే స్టూడియోలో రికార్డింగు నాణ్యతను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. భాషేతర ధ్వనులు రికార్డు అయినచో వాటిని అడాసిటి లాంటి ఉపకరణాలు ఉ పయోగించి భాషేతర ధ్వనులను నిర్మూలించవచ్చు.

4. ఖచ్చితమైన లిప్యంతరీకరణలు:

తెలంగాణ తెలుగు లో మాటల నిధి రికార్డింగులను వినుకుంటూ ఇంటర్నాషనల్ ఫొనెటిక్ అల్ఫాబెట్ ఉపయోగిస్తూ ట్రాన్స్ క్రైబ్ చేయడం. ఈ క్రమం లో పదాలు, విరామ చిహ్నాలు లేదా సంకోచ (hesitation) సంకేతాలను ట్రాన్స్ క్రైబ్ చేసే క్రమం లో జాగ్రత్తలు పాటించాలి. తెలంగాణ తెలుగు మాటల రికార్డింగులు ఫొనిటిక్ లేక ఫొనిమిక్ ట్రాన్స్ క్రిప్షన్ ఉ పయోగించి రాయడం. రికార్డు చేసిన ఆడియో రికార్డింగు ఎప్పుడు రికార్డు చేశామో తేదీ, సమయం మొదలైన వివరాలన్నీ నిక్షిప్తపరుస్తుంది.దానిని ఆంగ్లం లో టైమ్ స్టాపింగు అంటారు. ఆడియో ఫైలు పేరు 2025-09-28 యు.టి.సి. (అంటే టైమ్ ఇన్ సెకండ్స్) 07.34.00 (ఏడు గంటల ముప్పై నాలుగు నిమిషాల సున్నా సెకండ్లు).

5. మెటాడేటా:

తెలంగాణ తెలుగు వ్యవహర్త దగ్గర నుండి రికార్డు చేసిన రికార్డింగుల తోపాటు వక్తల సమాచారం పొందుపరుస్తాము. అందు లో వక్త వయస్సు, లింగం, ఉచ్చారణ మరియు భాషా నైపుణ్యం వంటి వివరాలు మొదలైనవి. రికార్డింగు ఎలాంటి వాతావరణం లో చాశారో తెలుసుకోవడం. ఇందు లో ముఖ్యంగా రికార్డింగు చేసిన పరిసరాల పర్యావరణం, మైక్రోఫోన్ వివరాలు మరియు దాంట్లో ఎంపిక చేసుకున్న అంశాల సమాచారం. రికార్డింగు చేసిన కాలాంశం వివరాలు ఉదాహరణకు రికార్డింగు చేసిన తేదీ, స్థానం లేక స్థలం మరియు వాటి ఉపయోగం మొదలైనవి, రికార్డింగు వివరాలు వాటి సందర్భం గురించిన సమాచారం నిక్షిప్తపరుస్తాము.

7. పరిమాణం మరియు పరిధి:

తెలంగాణ తెలుగు వ్యవహర్తల సంఖ్య మరియు వాటికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచడం. ఉదాహరణకు కొన్ని డజన్ల నుండి వేల మంది తెలంగాణ తెలుగు వ్యవహర్తల సంభాషణలను అవసరం ఉండవచ్చు. తెలంగాణ తెలుగు ప్రసంగాల రికార్డింగులు మొత్తం వ్యవధి కొన్ని గంటల నుండి వేల గంటల వరకు చేయవచ్చు. తెలంగాణ తెలుగు మాటల నిధి ఉద్దేశిత వినియోగాన్ని బట్టి ఏకభాష, ద్విభాష లేదా బహుభాషా అయిఉండవచ్చు.

8. ప్రయోజనం-నిర్దిష్ట రూపకల్పన:

స్వయంచాలకంగా మాటలను గుర్తించే శిక్షణ (ఆటోమెటిక్ స్పీచ్ రికగ్నీషన్ శిక్షణ): స్వయంచాలకంగా మాటలను గుర్తించే (ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నీషన్ /ఎ.ఎస్.ఆర్.) వ్యవస్థల శిక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది.

భాషాశాస్త్రీయ పరిశోధన: నిర్దిష్ట భాషాశాస్త్రీయ విషయాలను అధ్యయనం చేయడానికి రూపొందించబడింది.

టి.టి.ఎస్. సిస్టమ్స్: టెక్ట్స్-టు-స్పీచ్ (TTS) సిస్టమ్లను సహజ ఛందస్సు మరియు స్వరంతో యంత్రానికి శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తారు.

ఈ అంశాలు మాటల గుర్తింపు వ్యవస్థల (స్పీచ్ రికగ్నిషన్ సిస్టమ్) అభివృద్ధి, భాషాశాస్త్రీయ పరిశోధన మరియు స్వర (వాయిస్) ఆధారిత సాంకేతికతలకు కృత్రిమ మేధస్సు (AI) నమూనాల శిక్షణతో సహా వివిధ అనువర్తనాల కోసం మాటల నిధికి (స్పీచ్ కార్పోరా) అవసరమైన సాధనాలను తయారు చేస్తాయి.

తెలంగాణ తెలుగు మాటల నిధిని (స్పీచ్ కార్పస్) అభివృద్ధి చేయడంలో సవాళ్లు?

తెలంగాణ తెలుగు మాటల నిధిని (స్పీచ్ కార్పస్) అభివృద్ధి చేయడానికి అనేక సవాళ్లను పరిశోధకులు ఎదుర్కొవాల్సి ఉంటుంది. అవి భాషా వైవిధ్యం (మాండలికాలు),

జానపదాలు, సామాజిక–సాంస్కృతిక అంశాలు మరియు సాంకేతిక సంక్లిష్టత లాంటి అనేక ప్రత్యేక సవాళ్లను అదిగమించాల్సి ఉంటుంది. తెలంగాణ తెలుగు మాటల నిధి ప్రక్రియ లో ఆరు రకాల వివిధ సవాళ్లను గుర్తించాను. అవి భాషావైవిధ్యం, తెలంగాణ తెలుగు వక్త వైవిధ్యం, రికార్డింగు చేసే పరిసరాలు, భాషా మరియు సాంకేతిక వనరుల పరిమితులు, డేటా సేకరణ మరియు సమ్మతి, భాషాశాస్త్ర సమాచార గుర్తింపు మరియు ధ్రువీకరణ మొదలైనవి. ఈ ఆరింటిని క్రింద వివరంగా చర్చిస్తున్నాను.

1. భాషా వైవిధ్యం:

ప్రామాణిక తెలంగాణ తెలుగు: తెలంగాణ ప్రాంతం లో మాట్లడే తెలంగాణ తెలుగు భాష లో వివిధ మాండలికాలు ఉన్నాయి. ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం కోసం ఇప్పటి వరకు తెలంగాణ తెలుగు లో జరిగిన సైద్ధాంతిక పరిశోధనలు, గ్రంధాలు, ఇతర పరిశోధనలు కూలంకషంగా అధ్యయనం చేయాలి. తెలంగాణ మాండలిక వృత్తిపద కోశాలు, మాండలిక బులిటెన్సు (తెలుగు అకాడమీ, హైదారాబాదు), మాండలిక పదకోశాలు (నలిమెల భాస్కర్, చంద్రయ్య, ఎస్. మొదలైనవి) మొదలైనవి అధ్యయనం చేయాలి. ఉదాహరణకు ఉత్తర, దక్షిణ తెలంగాణ ప్రాంతాల లో తెలంగాణ ప్రాంతీయ భేధాలు ఉన్నాయి. ఇవన్నీ సమీకరించి విస్తృత స్థాయి లో తెలంగాణ తెలుగు లో నిక్షిప్తమై ఉన్న భాషా వైవిధ్యాన్ని, మాండలిక భేధాలను అధ్యయనం చేయడం ద్వారా తెలంగాణ తెలుగు భాషా వైవిధ్యం బోధపడడానికి అవకాశం ఉంది.

2. తెలంగాణ తెలుగు వక్త వైవిధ్యం:

తెలంగాణ తెలుగు వక్త స్వరం లేదా ఊనిక మరియు ఉచ్చారణ వైవిధ్యాలను అర్థం చేసుకోవడం ఒక సవాలు. తెలంగాణ తెలుగు విస్తృతిని నిర్ధారించడానికి వివిధ ప్రాంతాలలో ఉన్న తెలంగాణ తెలుగు (ఉత్తర, దక్షిణ) వ్యవహర్తల ఉచ్చారణల విస్తృత వైవిధ్యాలను అధ్యయనం చేయడం లో ఎదుర్కొంటున్న సవాళ్ళను అధికమించగలం. తెలంగాణ తెలుగు వక్తలు వివిధ సామాజిక వర్గాల నుండి, నేపథ్యం నుండి మాట్లాడేవారు విభిన్నమైన ధోరణలను కలిగి ఉండవచ్చు. ఇది భాషలోని సంక్లిష్టతను పెంచుతుంది. ఇలాంటి అంశాలన్నీ విస్తృతస్థాయి లో పరిశోధన చేసి భాషా వ్యవహర్తల వైవిధ్యాన్ని తెలంగాణ తెలుగు మాటల నిధి (స్పీచ్ కార్పస్) రూపకల్పనలో భాగంగా పరిగణలోకి తీసుకోవాలి.

3. రికార్డింగు చేసే పరిసరాలు:

ధ్వని (శబ్ద) ప్రదేశాలు: కొన్ని కొన్ని సార్లు అనర్గళమైన ప్రసంగాల కోసం చాలా సార్లు తెలంగాణ తెలుగు మాటల నిధి కోసం వ్యవహర్తల మాటలను వివిధ ప్రదేశాల లో అవసరాన్ని బట్టి రికార్డింగు మార్కెటు ప్రదేశాలలో లేదా వీధులలో ఎక్కువగా శబ్ద కాలుష్యం ఉన్న ప్రదేశాలలో రికార్డింగు చేయవలసి ఉంటుంది. ఇవన్నీ కూడా వక్త మాటను రికార్డు చేసే క్రమం లో ఆడియో నాణ్యతను పరిగణలోకి తీసుకునే అంశాలు. రికార్డింగు సౌకర్యాలకు ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు గ్రామీణ లేదా మారుమూల ప్రాంతాల్లో, అధిక–నాణ్యతగల తెలంగాణ తెలుగు ఆడియో రికార్డింగు చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే మంచి రికార్డింగు పరికరాలు మరియు నియంత్రిత పరిసరాలు ఎంపిక చేసుకోవడం లో చాలా లాభాలు ఉన్నాయి.

4. భాషా మరియు సాంకేతిక వనరుల పరిమితులు:

ప్రస్తుతం ఉన్న వనరుల కొరత: ప్రామాణిక తెలుగు భాషకు పరిశోధనల కోసం కావాల్సిన భాషానిధులు, భాషావనరులు ఉన్నాయి. కానీ తెలంగాణ తెలుగు లో భాషానిధులు, మాటల నిధులు, భాషావనరులు చాలా తక్కువగా ఉన్నాయి. తెలంగాణ తెలుగు మాటల నిధి రూపకల్పన కోసం భాషా పరిశోధకులు, పండితులు (పాఠశాల నుండి విశ్వవిద్యాలయం వరకు), భాషిణీ, భారత ప్రభుత్వం, తెలుగు వికీపీడియా బృందం, హైదరాబాదు, తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ, తెలుగు అకాడమీ, తెలంగాణ ఇతర సంస్థలు, బృందాలు, సమూహాలు ఈ వనరుల తయారీ లో భాగంగా వారి వారి తోడ్పాటు, సహాయ సహకారాలు అందించడం వల్ల తెలంగాణ తెలుగుకు భాషావనరులు అభివృద్ధి చేయడం మరింత సులభమవుతుంది.

అలాగే ఒక భాషకు వనరులు తయారు చేయాలంటే నిధులు కూడా అత్యంత అవసరం. పరిమిత నిధులతో మాటల నిధిని (స్పీచ్ కార్పస్) అభివృద్ధి చేయడం చాలా కష్టం తో కూడుకున్న పని. ఈ మధ్య కాలం లో తెలంగాణ తెలుగు వాడుకు సినిమా రంగం పెరిగింది. కథానాయకుడికి, కథానాయకురాలికి కూడా డైలాగులు తెలంగాణ తెలుగు లో రాస్తున్నారు. ఉదాహరణకు ఇటీవల కాలం లో విడుదలైన బలగం సినిమా. ఇటీవల జరిగిన 71 వ జాతీయ చలనచిత్ర అవార్డు ప్రధానోత్సవం లో భాగంగా బలగం సినిమా లోని 'ఊరుపల్లెటూరు' గీత రచయిత కాసర్ల శ్యామ్ కు ఉత్తమ గీత రచయిత గా అవార్డు భారత ప్రభుత్వం ప్రధానం చేశారు. ఇలాంటి అవార్డులు తెలంగాణ తెలుగు పై మరిన్ని పరిశోధనలు చేయడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

5. డేటా సేకరణ మరియు సమ్మతి:

తెలంగాణ తెలుగు మాటల నిధి నిర్మాణ క్రమం లో విషయ సేకరణ వక్తల ద్వారా చేసేటప్పుడు వారి పూర్తి అనుమతి లేక సమ్మతి తప్పకుండా తీసుకోవాలి. వివిధ రంగాలలో (ఆరోగ్యం, వ్యవసాయం) విషయ సేకరణ సమయం లో వారి సమ్మతి తీసుకొని డేటా సేకరణ చేయడం అత్యవసరం. ఈ విషయ సేకరణ యజ్ఞం లో పాల్గొనే వారి వివరాలు మరియు వారి వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాలి.

6. భాషాశాస్త్ర సమాచార గుర్తింపు మరియు ధ్రువీకరణ:

నైపుణ్యం కలిగిన భాషాశాస్త్రవేత్తలు తెలంగాణ తెలుగు భాషలో మరియు వాటి మాండలికాల బేధాల పైన ప్రావీణ్యం ఉన్న భాషా శాస్త్రవేత్తలు మాటల నిధిని భాషాశాస్త్రీయ దృష్టితో విశ్లేషణ చేయాలి.

తెలుగు స్పీచ్ టెక్నాలజీ పై కొనసాగుతున్న ప్రాజెక్టులు

తెలుగు స్పీచ్ టెక్నాలజీపై దృష్టి సారించిన అనేక ఎన్.ఎల్.పి. ప్రాజెక్టు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థలు మరియు సాంకేతిక సంస్థలచే నడపబడుతున్నాయి. ఈ ప్రాజెక్టు స్పీచ్ రికగ్నిషన్, టెక్స్ట్-టు-స్పీచ్ (TTS) మరియు ఇతర ప్రసంగ-సంబంధిత సాంకేతికతలను తెలుగు భాషకు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. కొన్ని ప్రధాన ప్రాజెక్టుల పేర్లు. మొదటిది భాషిణి ప్రాజెక్టు (జాతీయ భాషా అనువాద మిషన్), మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం, కొత్త ఢిల్లీ. దీని లక్ష్యం, డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద విస్తృత చొరవలో భాగంగా, ఈ ప్రాజెక్టు తెలుగుతో సహా భారతీయ భాషలకు స్పీచ్ మరియు భాషా సాంకేతికతను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు లో స్పీచ్ రికగ్నిషన్, టెక్స్ట్-టు-స్పీచ్ మరియు తెలుగు కోసం మెషిన్ ట్రాన్స్లేషన్, డిజిటల్ పాఠాన్ని తెలుగు మాట్లాడేవారికి మరింత అందుబాటులోకి తెస్తుంది. రెండవది సమానాంతర్ ప్రాజెక్టు. దీని లక్ష్యం తెలుగుతో సహా బహుళ భారతీయ భాషలకు యంత్రానువాదం కోసం భారతదేశంలో ప్రజలకు అందుబాటులో ఉన్న అతి పెద్ద సమాంతర భాషానిది. దీన్ని లక్ష్యం అనువాద నమూనాలు మరియు స్పీచ్ రికగ్నిషన్ సిస్టమ్ల అభివృద్ధిని సులభతరం చేస్తూ, తెలుగు కోసం సమాంతర డేటాను అందిస్తుంది. ఈ ప్రాజెక్టు ఎ.ఐ.4భారత్, ఐ.ఐ.టి (IIT), మద్రాసు, మైక్రోసాఫ్ట్ రీసెర్చ్ సహకారంతో అభివృద్ధి చేయబడింది. మూడవది తెలుగు ఎ.ఎస్.ఆర్. (ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్) వ్యవస్థలను తయారు చేయడం. దీని లక్ష్యం తెలుగు భాష కోసం ప్రత్యేకంగా ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నిషన్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం. దీని లక్ష్యం తెలుగు మాటలను ఖచ్చితంగా గుర్తించి లేదా శబ్ద కాలుష్య పరిస్థితుల లో కూడా వివిధ ఊనికలతో ఉన్న తెలుగు మాటలను ఖచ్చితంగా గుర్తించి, లిప్యంతరీకరించగల సామర్థ్యం గల నమూనాలను రూపొందించడం. ఈ ప్రాజెక్టు ఐ.ఐ.ఐ.టి, హైదరాబాదుతో సహా వివిధ విద్యాసంస్థలు మరియు గూగుల్ మరియు మైక్రోసాఫ్ట్ వంటి సాంకేతిక కంపెనీల భాగస్వామ్యంతో నడుస్తుంది. ఈ ప్రాజెక్టు లక్ష్యం తెలుగుతో సహా భారతీయ భాషల కోసం స్పీచ్ వనరులు మరియు ఉల్లేఖన డేటాసెట్లను అభివృద్ధి చేయడం. ఇందు లో తెలుగు స్పీచ్ రికగ్నిషన్ మరియు సింథసిస్ వ్యవస్థల పనితీరును మెరుగుపరచడానికి స్పీచ్ డేటాను సేకరించడం మరియు భాషాశాస్త్రీయ విశ్లేషణ చేయడం. లింగ్విస్టిక్ డేటా ఫర్ కన్సార్టియం ఫర్ ఇండియన్ లాంగ్వేజస్, భారతీయ భాషా సంస్థ, విద్యా మంత్రిత్వ శాఖ, మైసూరు అభివృద్ధి చేసింది.

ముగింపు

తెలంగాణ తెలుగు మాటల నిధి యొక్క ఆవశ్యకతను ఈ వాసం చర్చించింది. స్పీచ్ టెక్నాలజీ ఉపయోగించి స్పీచ్ ఉపకరణాలను తయారు చేయడానికి కేవలం ప్రామాణిక తెలుగు భాషలో మాత్రమే తయారు చేశారు. కానీ ఇప్పటికీ తెలంగాణ తెలుగు లో ఎవరైన ఈ స్పీచ్ అనువర్తనాలను ఉపయోగిస్తే ఆశించనంత విధంగా పని చేసి పెట్టదు. అందుకే తెలంగాణ తెలుగు మాటల నిధి తయారీ వాటి ఉపయోగం స్పీచ్ టెక్నాలజీ రంగంలో స్పీచ్ ప్రాసేసింగు, స్పీచ్ సిన్తథీస్, టెక్స్టు టు స్పీచ్, స్పీచ్ టు టెక్స్టు, ఆటోమేటిక్ స్పీచ్ రికగ్నీషన్ (ఎ. ఎస్. ఆర్) మొదలైన అనువర్తనాలు తయారు చేయడానికి తెలంగాణ తెలుగు మాటల నిధి ఎంతైనా అవసరం. అప్పడే మన తెలంగాణ తెలుగు లో కూడా వాక్కు లేక మాటల రూపం లో ప్రశ్నలు అడిగితే మనకు తిరిగి సమాధానం ఇస్తుంది. ఇలాంటి ఉపకరణాలు తెలంగాణ తెలుగుకు కూడా అభివృద్ధి చేయడం తో భాష సమృద్ధి చందుతుంది. అలాగే ఆధునిక అవసరాలకు అనుగుణంగా మన భాషలను కూజా అభివృద్ధి చేసుకున్నవాళ్లం అవుతాం.

ఆధార గ్రంథాలు

1. ఉమామహేశ్వర రావు, జి. 2012. తెలుగు భాషా సంగణనం. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.

2. ప్రవీణ్, గట్ల మరియు ప్రకాష్, పి. 2021. తెలంగాణ తెలుగు భాషాభివృద్ధి: భాషానిధి ఆవశ్యకత. విజయవాడ: అమ్మనుడి తెలుగు జాతి పత్రిక.

3. ప్రకాష్, పి. 2022. తెలంగాణ తెలుగు – మారుతున్న వైఖరి. విజయవాడ: అమ్మనుడి తెలుగు జాతి పత్రిక.

4. Bharati, Akshara et al. 1994. NLP: Paninian Perspective. New Delhi: Prentice-Hall of India.

5. Prakash, P. and Gatla, Praveen. 2020. Lexical Variation in Telangana Telugu and Coastal Telugu: A Linguistic Study. Working Papers on Language and Linguistics. Vol No. XIV. Coimbatore: Bharathiar University.

రచయిత: సహాయ ఆచార్యులు,
భాషాశాస్త్ర శాఖ, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్,
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

తెలంగాణ సాహిత్య విమర్శ-వాదం, ధోరణి, ఉద్యమం

డా.ఇమ్మడి మహేందర్

1

సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను అధ్యయనం చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా చారిత్రకంగా, ప్రక్రియ పరంగా, వాదాల (భావజాలాలు) పరంగా, ప్రాంతీయంగా అధ్యయనం చేయవచ్చు. ప్రస్తుతం నేను వాదాల వారిగా సాహిత్య విమర్శను అధ్యయనం చేస్తున్నాను. సాహిత్య విమర్శను వాదాల వారిగా ఎందుకు అధ్యయనం చేయాలన్న విషయాన్ని స్పష్టపరుచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ అధ్యాయంలో పేర్కొన్న వివిధ వాదాలకు సంబంధించిన సమాచారం అనేక పుస్తకాలలో ఉన్నాయి కదా? అప్పుడు ఈ వ్యాస ప్రాసంగికత ఏమిటి? అనే ప్రశ్న ముందుకు వస్తుంది. చాలా పుస్తకాలలో వివిధ వాదాల గురించిన చర్చ వాదం, ధోరణి, ఉద్యమం వంటి విషయాలతోనే ప్రారంభం అవుతుంది. కానీ, ఈ వ్యాసంలో భౌతిక సమాజం – సంఘటన దాని వల్ల కలిగే ప్రభావం, ఆ ప్రభావాల్లోంచి వచ్చే కొత్త ఆలోచనలు, ఆ ఆలోచనలు కల్పించే చైతన్యం వంటి పునాది అంశాలను చర్చలోకి తీసుకొని, తర్వాత వాదాల గురించిన చర్చ వస్తుంది. ఈ రకమైన అవగాహన తర్వాతనే సాహిత్య విమర్శ వికాసంలో వాదం, ధోరణి, ఉద్యమాల గురించి అధ్యయనం చేయడానికి వీలు అవుతుంది.

మానవ శ్రేయస్సుకోసం అందరు ఒకే మార్గాన్ని అన్వేషించరు. అనుసరించరు. పుర్రెకో ఆలోచన పుడుతుంది. భిన్నమైన మార్గాల్లో ఆలోచిస్తారు, అనుసరిస్తారు. ఈ మానవ శ్రేయస్సు ముసుగులో మతాధిపత్యం, కులాధిపత్యం, వర్గాధిపత్యం, వర్ణాధిపత్యం, లింగాధిపత్యాలు ఏర్పడతాయి. ఈ ఆధిపత్యాలను ధిక్కరించే భావనలు కూడా సమాంతరంగా రూపొందుతాయి. ఈ విధంగా ఆధిపత్యాలకు – ధిక్కారాలకు మధ్య పోరాటం, పెనుగులాట జరుగుతుంది. వీటినే మనం వాదాలు లేదా భావజాలాలుగా భావించవచ్చు.

మనిషిని రాజకీయ సమూహంలో భాగంగా గుర్తిస్తారు. ఆ మనిషి సామాజిక సందర్భాల్లో కళాత్మకంగా స్పందిస్తాడు. అప్పుడు సాహిత్యం పుడుతుంది. సాహిత్యంపై స్పందనగా దాన్ని విశ్లేషిస్తాడు. ఫలితంగా సాహిత్య విమర్శ పుడుతుంది. సమాజాన్ని ప్రభావితం చేసే అనేక భావజాలాలు సహజంగానే సాహిత్యంలోను ప్రతిఫలిస్తాయి. తెలంగాణ సమాజం ప్రాచీన కాలం నుండి ప్రత్యామ్నాయ సామాజిక, రాజకీయాల ఉద్యమాలకు, ధిక్కారాలకు వేదికగా ఉన్నది. హేతువాద చింతనతో వచ్చిన చార్వాకులు, లోకాయతుల తాత్విక చింతనను అనుసరించింది. ఒక మత విధానాలపై ధిక్కారంగా వచ్చిన బౌద్ధం, జైనం, శైవం వంటి అనేక మతాలకు తెలంగాణ వేదికగా నిలిచింది. ఏక చక్రాధిపత్యానికి, సువిశాల సామ్రాజ్య కాంక్షకు ఎదురొడ్డి, రాజ్య ధిక్కారాన్ని హక్కుగా చాటిన సమ్మక్క, సారలమ్మల పోరాట పటిమ ఈ నేల సొంతం. తర్వాత వచ్చిన కుతుబ్ షాహీ, ఆసఫ్ జాహీలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలు, బ్రిటీష్ రెసిడెంట్లకు వ్యతిరేకంగా పోరాడిన తుర్రెబాజ్ ఖాన్ అమరత్వం ఈ నేలలో ఉన్నది. తెలంగాణ దేశ్ ముఖ్ దొరలకు, నిజాం రజాకార్ల ఆగడాలకు, ఇండియన్ యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన మట్టి వీరుల త్యాగాలు, రైతాంగ పోరాటాలు ఈ నేలంతా పరచుకొని ఉన్నాయి. తర్వాత వచ్చిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, నక్సల్బరీ పోరాట వారసత్వంలో గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలు, సిరిసిల్ల – జగిత్యాల పోరాటం, జల్ – జంగల్ – జమీన్ పోరాట నినాదాలు, సామాజిక విప్లవానికై కాలికి గజ్జెకట్టి పాట పాడి, ముక్కలుగా నరకబడ్డ బెల్లి లలిత అమరత్వం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరులైన విద్యార్థి అమరవీరుల వరకు తెలంగాణది పోరాటాల చరిత్ర. ప్రత్యామ్నాయ అభిప్రాయాలకు వేదిక. ఈ పోరాటాలు తెలుగు సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేసుకోవాల్సిన పరిస్థితులను కల్పించాయి.

తెలంగాణలో సాహిత్య విమర్శను "సాహిత్యాన్ని ప్రభావితం చేయగలిగిన సామాజిక, రాజకీయార్థిక, సాహిత్య చలనాల" నేపథ్యం నుంచి అధ్యయనం చేయాలి. ఈ విధమైన అధ్యయనం ఇంతవరకు తెలుగు సాహిత్య విమర్శలో చెప్పుకోదగ్గ స్థాయిలో జరగలేదు. కనుక తెలంగాణ సాహిత్య విమర్శ వికాసం అన్న ఈ పరిశోధనలో ఈ అంశాలను భాగం చేయడం ద్వారా "సాహిత్య – సమాజ సంబంధాల"ను సాహిత్య విమర్శలో అధ్యయనం చేయడానికి ఈ పరిశోధన ప్రాతిపదికగా నిలుస్తుంది.

2

20వ శతాబ్దంలో తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభంలో శబ్ద సాధుత్వాసాధుత్వ నిర్ణయాలు చేసే దశ నుండి సాహిత్యంలో సామాజిక చరిత్రను అన్వేషించే దశకు చేరుతుంది. కవుల కాల నిర్ణయం, ప్రాంత, కుల, గోత్రాలను నిర్ణయించే దశ నుండి సాహిత్యంలో ప్రతిఫలించిన మనిషి తత్వాన్ని అన్వేషించే దశకు సాహిత్య విమర్శ చేరుకుంది. వ్యాకరణ, ఛందో అలంకార

శాస్త్రాల వెంట ఉండే దశ నుండి సామాజిక, రాజకీయార్థిక శాస్త్రాల నేపథ్యం నుంచి సాహిత్యాన్ని అధ్యయనం చేసే దశకు చేరుకుంది. ఈ విధంగా సాహిత్య విమర్శ అభివృద్ధి చెందడానికి 20వ శతాబ్ది సాహిత్య విమర్శ పాదులు వేసింది. కనుక 20వ శతాబ్ది సాహిత్యం, సాహిత్య విమర్శ మౌలికంగా అనేక మార్పులకు లోనయింది. పునర్మూల్యాంకనానికి గురైంది. కొత్త భావాలు, ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం, తెలంగాణకు నైజాం నుంచి విముక్తి రావడం, ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన మార్పులు తెలుగు సాహిత్యాన్ని చైతన్యం దిశగా ముందుకు నడిపించాయి. ఈ విధమైన మార్పులకు తెలంగాణ ప్రాంతంలో, తెలుగు భాషలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నిరంతరం చర్చలు, వాదాలు, సిద్ధాంతాలు, వాదోపవాదాలలో విమర్శ, ప్రతి విమర్శల్లో తెలంగాణ సాహిత్య విమర్శ వికాసం జరిగింది.

ఏ సాహిత్య ప్రక్రియ చరిత్రనైనా అధ్యయనం చేయాల్సి వచ్చినప్పుడు సామాజిక, రాజకీయ, సాహిత్య సందర్భాల నేపథ్యంలో దాన్ని పునర్మూల్యాంకనం, మూల్యాంకనం చేయడం ఆ కాలపు ఆకాంక్షగా, బాధ్యతగా మన ముందుకి వస్తుంది. తెలుగులో సాహిత్య విమర్శ ప్రారంభమే రెండు శిబిరాల మధ్య వాదోపవాదాలుగా ప్రారంభమైంది. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, వీరేశలింగం వంటి వారు భావజాల పరంగా భిన్నమైనవారు. కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి సంప్రదాయ వాదానికి ప్రతినిధి అయితే, కందుకూరి వీరేశలింగం ఆధునిక వాదానికి ప్రతినిధిగా ఉన్నారు. నిజానికి సాహిత్య విమర్శ ప్రారంభమే రెండు విరుద్ధ భావజాలాల సంఘర్షణలోంచి పుట్టింది. పెరిగింది. ముందుకు నడుస్తుంది. సాహిత్య విమర్శ ప్రక్రియగా రూపొందుతున్న దశలో కట్టమంచి కవిత్వ తత్త్వ విచారం రాస్తే, దీనికి ప్రతిగా కురుగంటి సీతారామయ్య అలంకార తత్త్వ విచారం అనే గ్రంథాన్ని రాశారు. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా నేటికి తెలుగు సాహిత్య విమర్శలో ఈ వారసత్వమే కొనసాగుతుంది. తెలంగాణలోని సాహిత్యాన్ని ప్రభావితం చేసిన భావజాలాలు, వాటి ప్రభావంతో వచ్చిన సాహిత్య విమర్శను చారిత్రకంగా, సామాజికంగా విశ్లేషించుకోవాల్సిన అవసరం నేడు ఉంది. దీనికోసం వివిధ వాదాలను లోతుగా అధ్యయనం చేయాలి. వాదాలు సాహిత్యంలో ధోరణులుగాను, ఉద్యమాలుగాను ప్రతిఫలిస్తాయి. సాహిత్యంలో ధోరణులు, ఉద్యమ స్థితిగతులను అన్వయం చేసుకుంటూ తెలంగాణ సాహిత్య విమర్శను అధ్యయనం చేసేందుకు ప్రాతిపదికను ఏర్పాటు చేసుకోవాలి.

సాహిత్యంలో వాదం, ధోరణి, ఉద్యమం:

ఏ సమాజం స్తబ్దుగా ఉండదు. చలన శీలంగా ఉంటూ, నిరంతరం మార్పు చెందుతుంది. ఈ మార్పుకు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చలనాలు కారణం అవుతాయి. దీన్ని తాత్విక పరిభాషలో పరిమాణాత్మక మార్పులు, గుణాత్మక మార్పుగా రూపాంతరం చెందడంగా చెప్పవచ్చు. స్థూలంగా గుణాత్మక మార్పు అంటే, సమాజంలో వివిధ మార్గాల్లో సాగిన చైతన్యం, ఒక సంఘటన ద్వారా గుర్తించబడడంగా అర్థం చేసుకోవాలి. సమాజ, సాహిత్యాల్లో కేవలం గుణాత్మకమైన మార్పులే చరిత్రగా నమోదవుతుంటాయి. నిజానికి గుణాత్మకమైన మార్పుకు చోదక శక్తి అయిన పరిమాణాత్మక మార్పులను అంతగా గుర్తించరు. ఇలాంటి స్వభావమే సాహిత్య పరిభాషలో వాదం, ధోరణి, ఉద్యమం వంటి అంశాలలో కూడా కన్పిస్తుంది. వాదం, ధోరణి, ఉద్యమాలను గుణాత్మక మార్పులుగా గుర్తిస్తే, ఈ గుణాత్మక మార్పులకు కారణం అయిన, భౌతిక సంఘటన, దాని ప్రభావం, ఆలోచన, చైతన్యం, ఆచరణ వంటి పరిమాణాత్మక మార్పులకు ఈ చర్చల్లో స్థానం కల్పించలేదు. ఈ స్థితిని సాహితీ రంగాల్లో మార్చాల్సి ఉంది.

తెలుగు సాహిత్యంలో వాదం, ధోరణి, ఉద్యమం అన్న మూడు పారిభాషిక పదాలకు స్పష్టమైన మార్గ నిర్దేశనం లేదు. దేన్ని వాదం అనాలి? దేన్ని ధోరణి అనాలి? దేన్ని ఉద్యమం అనాలి? వాటి లక్షణాలు ఏమిటి? వాటి అంతర్గత, బహిర్గత సంబంధాలు ఏమిటి? అన్న చర్చ ఇంకా అస్పష్టంగానే ఉంది. ఈ దశలో సాహిత్య పరిశోధకుడిగా వీటిని రూఢి పరుచుకోవాల్సిన అవసరం ఉంది. మనిషి ఆలోచనకు, బయట కన్పిస్తున్న విషయాలకు మధ్య ఏర్పడే భావాలు తాత్విక అంశాలతో కూడుకొని ఉంటాయి. వాటిని ఈ కింది అంశాలుగా చూడవచ్చని నా అభిప్రాయం. .

1. భౌతిక సమాజం – సంఘటన
2. ప్రభావం
3. కొత్త ఆలోచన
4. చైతన్యం
5. ఆచరణ
6. వాదం
7. ధోరణి
8. ఉద్యమం
9. భావ విప్లవం

భౌతిక సమాజంలోని అనేక సంఘటనలు మనిషిని కదిలిస్తుంటాయి. కదిలించడమంటే ఆలోచనను రేకెత్తించడం. ఈ ఆలోచనలే మనిషిలో మార్పు రావడానికి కారణమవుతాయి. ఆ మార్పును మనం చైతన్యం అంటున్నాం. ఈ చైతన్యం సమస్యను కుల్లం కుల్లంగా విప్పి చెప్తూనే, దాన్ని సాధించడానికి అవసరమైన ఆచరణను ప్రతిపాదిస్తుంది. ఈ చైతన్యం ఒక వ్యక్తిలో పుట్టొచ్చు లేదా సామూహిక ఆచరణల్లోంచి పుట్టొచ్చు.

పై విధంగా రూపొందిన చైతన్యంతో ఒక వ్యక్తి గానీ, కొంత మంది గానీ ఆలోచనలను సమీకరించుకుంటారు. ఆలోచన మార్గానికి, స్పష్టమైన తాత్విక ఆలోచన తోడైతే అది "వాదం"గా నిర్మాణం అవుతుంది. ఒక వాదంగా రూపు కట్టిన

ఆలోచనలు సమాజ మార్పుకోసం సైద్ధాంతిక చర్చలను ఆహ్వానిస్తుంది. ఆ ఆలోచనలు ప్రపంచాన్ని మార్చేందుకు సామాజికార్థిక పరివర్తనను కోరుకుంటాయి. క్రమంగా ఒక సిద్ధాంతంగా రూపొందుతుంది. ఈ సిద్ధాంతమే భావజాలంగా ఆచరణలో కనబడుతుంది. భావజాలమే వివిధ ఆచరణ మార్గాల్లో "వాదం" అనే పేరుతో పిలవబడుతుంది. కొద్ది మంది వాదం వెలుగులో నడిస్తే అది ధోరణిగా మారుతుంది.

వాదం వెలుగులో, ధోరణిలో అభివృద్ధి అయిన సైద్ధాంతిక చర్చలు, రాజకీయ పరిణామం తీసుకొని, ఆచరణాత్మకమైన, నిర్మాణాత్మకమైన పోరాటంగా మారినప్పుడు అది ఉద్యమంగా రూపొందుతుంది. ఉద్యమం విస్తృతమవుతూ ప్రజల మానసిక, సామాజిక, భౌతిక పరిస్థితుల పట్ల ప్రజల ఆలోచన విధానాన్ని మార్చే దిశగా భావ విప్లవానికి దారి తీస్తుంది. ఇప్పటివరకు చెప్పుకున్న విషయాలను స్థూలంగా ఈ కింది అంశాల ద్వారా సూచించుకోవచ్చు.

సంఘటన – ఆలోచన – చైతన్యం – ఆచరణ – వాదం – ధోరణి – ఉద్యమం – భావ విప్లవం

సంఘటన, ఆలోచన, చైతన్యం, ఆచరణ అనే నాలుగంశాలు, తర్వాతి అంశాలకు పరిమాణాత్మక మార్పులుగా పనిచేస్తాయి. పైన చెప్పుకున్న విధంగా వాదం, ధోరణి, ఉద్యమం, భావ విప్లవం వంటి అంశాల మధ్య పరస్పర ప్రభావంతో కూడిన అంతర్గత సంబంధాలు ఉన్నాయి. వీటిని ఇంకా లోతుగా కూడా అధ్యయనం చేయవచ్చు.

ఆలోచన:

ఆలోచన అన్న పదానికి శబ్దరత్నాకరము 'యోచన' అనే అర్థాన్ని ఇచ్చింది. ఆంధ్ర వాచస్పత్యము 'తలంపు', 'యోచన' అనే అర్థాలను ఇచ్చింది. ఆలోచననే 'భావన' అని కూడా అంటారు. సాధారణంగా మనలో ఉన్న ఆలోచనలకు తోడుగా అనేక కొత్త ఆలోచనలు వస్తుంటాయి. పోతుంటాయి. అప్పటివరకు మనలో ఉన్న ఆలోచనల స్థానంలో మార్పులు జరుగుతుంటాయి. ఆలోచన అంటే కొత్తదనాన్ని మన మెదడులోకి ఆహ్వానించడంగా అర్థం చేసుకోవచ్చు.

చైతన్యం:

చైతన్యం అన్న పదానికి శబ్దరత్నాకరము 'తెలివి', 'ప్రాణము' అనే అర్థాలను ఇచ్చింది. మనిషి నిత్యం ఆలోచనపరుడైనంత మాత్రాన ఫలితం ఏమి ఉండదు. ఆలోచించిన విషయాలను చైతన్యంగా మార్చుకోవాలి. మన ఆలోచనలకు, సమాజానికి మధ్య ఉన్న నిరంతర మార్పు స్వభావాన్ని గుర్తించడమే చైతన్యం. ఈ చైతన్యానికి స్థల, కాల పరిమితులు ఉంటాయి. ఈ పరిమితులు అక్కడి సామాజిక అస్తిత్వంతో ముడిపడి ఉంటాయి. భౌతిక పరిస్థితులే మానసిక ఆలోచనలకు మూలం. కనుక చైతన్యమంటే 'భౌతిక పరిస్థితుల వల్ల రూపు దిద్దుకున్న ఆలోచనల్లో వచ్చిన మార్పుగా గుర్తించాలి'. ఈ చైతన్యమే వ్యష్టి, సమష్టిగా ఆచరణకు దారి తీస్తుంది.

ఆచరణ:

ఆచరణ అన్న పదానికి వావిళ్ల సంస్కృత తెలుగు నిఘంటువు 'ఆచారము', 'నడత' అనే అర్థాలను ఇచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయం పత్రికా భాషా నిఘంటువు 'నిజ జీవితంలో అమలు చేయటం' (Practice) అనే అర్థాన్ని ఇచ్చింది. ముదిగంటి గోపాలరెడ్డి సంస్కృతాంధ్ర నిఘంటువు 'ఆచరణము', 'ఆచరించుట', 'చూచి నేర్చుకొనుట', 'సంప్రదాయము' వంటి అర్థాలను ఇచ్చింది. మనలో కలిగిన ఆలోచనలను నిత్య జీవితంలో, సామాజిక, రాజకీయ జీవితాల్లో పాటించడాన్ని ఆచరణగా చెప్పవచ్చు. ఆచరణలో నిబద్ధత, నిమగ్నత రెండూ మిళితమై ఉంటాయి.

వాదం:

వాదము అన్న పదానికి శబ్దరత్నాకరం 'వాగ్వివాదము', 'రసవాదము', 'తగవు' అనే అర్థాలను ఇచ్చింది. జి. ఎన్. రెడ్డి పర్యాయపద నిఘంటువు 'ఒక శాస్త్రము యొక్క తత్వముల నిర్వచనము', 'ఒక శాస్త్రములోని మూల విషయముల విపులీకరణ' అనే అర్థాలను ఇచ్చింది. పై అర్థాలను పరిశీలించిన తర్వాత వాదమంటే "వివిధ మేధో సమూహాలు తమదైన ఆచరణ మార్గాల్లో, సమస్యల పరిష్కారానికై చర్చించే, లేదా సాగించే వాదన, ప్రతివాదనల సమాహారం"గా చెప్పవచ్చు. ఆలోచనల స్థాయిలో భావజాలంగాను, ఆచరణ స్థాయిలో వాదంగాను ఇది కనబడుతుంది.

సమాజాన్ని అర్థం చేసుకోవడానికి భిన్నమైన మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ప్రతి మనిషికి, రచయితకు సమకాలీన సమాజంపై తనదైన అభిప్రాయం ఉంటుంది. ఈ అభిప్రాయాలు, ఆలోచనలే ఒక సిద్ధాంతంగా రూపొందుతాయి. ఈ సిద్ధాంతాన్నే ఆలోచనల స్థాయిలో భావజాలం అని అంటాం. సామాజిక, సాహిత్యోద్యమాలు ఈ భావజాల భూమికతో పనిచేస్తాయి. భావజాలం అన్న పదానికి సాహిత్య పరిభాషలో "ప్రకృతి గురించి, సమాజం గురించి ఒక రచయితకు ఉండే అవగాహన, భావాలు, విలువలు, విశ్వాసాలు మొదలైన వాటి కూడికే భావజాలం" అని అంటారు. (నళిని. ఎస్. ఎస్. విమర్శ పారిభాషిక పదాల డిక్షనరీ. 2021: 135)

సమాజంలో అన్ని వర్గాల వారు తమదైన భావజాలాన్ని కలిగి ఉంటారు. ఈ భావజాలాల మధ్య సహజంగానే మిత్ర, శత్రు వైరుధ్యాలు ఉంటాయి. రాజకీయ, మత, సామాజిక అవసరాల్లోంచి ఉన్న ఆలోచన మార్గాల్లో సహజంగానే శత్రు వైఖరి కన్పిస్తుంది. వీటిని కొంత మంది భావ సారూప్యం కలిగిన వారు ఆచరిస్తారు. ఈ ఆచరణ వల్ల ఒక అనుచర వర్గం ఏర్పడుతుంది. వారు ఆయా మార్గాల్లో ప్రయాణిస్తారు. వారికి ఒక దృక్పథం ఏర్పడుతుంది. ఆ దృక్పథం వాళ్లకి ఒక

దృక్కోణాన్ని అందజేస్తుంది. ఈ విధంగా వాదం, దృక్పథం, దృక్కోణాల సమాహారమే భావజాలంగా నిర్మాణం అవుతుంది. దీన్నే మరో మాటలో "ప్రాపంచిక దృక్పథం" అనవచ్చు.

దృక్పథం అనేది ఒక నిర్దిష్ట పరిస్థితిని, సంఘటనను విశ్లేషించగలిగే మార్గం. దానిపై ఏర్పరుచుకునేదే దృక్కోణం. "వస్తువుకి, రచయితకు ఉండే సంబంధం, వస్తువుకు సంబంధించిన వివిధ అంశాల అభివ్యక్తితో రచయిత అనుసరించే వైఖరి, ఆ వైఖరి ననుసరించి రచనలోని వివిధ అంశాల మధ్య ఏర్పడే సంబంధాన్ని రచయిత దృక్కోణంగా భావించాలి" (నరసింహమూర్తి. యు. ఎ. విమర్శ విజ్ఞాన సర్వస్వం. 2016: 911)

దృక్పథం అన్న పదానికి ప్రాతినిధ్యం, దృష్టి అన్న అర్థాలు ఉన్నాయి. ప్రతీ రచయిత ఏదో ఒక దృక్పథాన్ని కలిగి ఉంటాడు. సమాజాన్ని తనదైన దృష్టితోను, తనకు నచ్చిన ఇతరుల ఆలోచనలతోను, తాను ఏర్పరచుకున్న దృష్టితోను చూస్తారు. అర్థం చేసుకుంటారు. సమకాలీనంగా ఉన్న సామాజిక, రాజకీయార్థిక స్థితిగతుల నుండి కూడా వివిధ ఆలోచనలను ఏర్పరచుకుంటారు. ఈ ఆలోచనల నేపథ్యం నుండి సమాజాన్ని అర్థం చేసుకోవడం, అర్థం చేసుకున్న సమాజాన్ని విశ్లేషించడం "దృక్పథం" అవుతుంది.

"దృక్పథం అంటే ఒక స్పష్టమైన ఆలోచనా విధానం. ఏ విషయం గూర్చి అయినా ఒక నిర్దిష్టమైన ఆలోచనా సరళిని కలిగి ఉండటాన్ని దృక్పథంగా నిర్వచించుకోవచ్చు. లేదా, ఏదైనా ఒక ఆలోచనా విధానం దృష్ట్యా, భావజాలం దృష్ట్యా సమాజాన్ని సాహిత్యాన్ని పరిశీలించడాన్ని, విశ్లేషించడాన్ని దృక్పథం అని చెప్పవచ్చు." (నాగేందర్, పగడాల. సమకాలీన వచన కవిత్వం ప్రాంతీయతా దృక్పథాలు. 2008: 54)

పై విశ్లేషణల్లో పేర్కొన్నట్లు సిద్ధాంతం, భావజాలం, దృక్పథం, దృక్కోణం వంటి అంశాలను తాము విశ్వసిస్తున్న ఆలోచనలను, ఇతరులు విశ్వసిస్తున్న ఆలోచనలతో చర్చలు సాగించడం, ఎదుటి వారి భావజాలాన్ని అన్ని రంగాల్లో పూర్వ పక్షం చేస్తూ, తమ భావజాలాన్ని నిలబెట్టే క్రమంలో చేసే ప్రతిపాదనలను అన్నింటినీ స్థూలంగా భావజాలం అని అంటున్నా, దానిని "వాదం" అని కూడా అనవచ్చు.

వాదం మెజార్టీ సమాజంలో తన అస్తిత్వాన్ని ప్రకటించుకోవచ్చు. కొత్త ఆలోచనలను ప్రవేశపెట్టవచ్చు. సాహిత్య వివేచన మార్గాలను సూచించవచ్చు. సమాజానికి, సాహిత్యానికి మధ్య దూరమైన అంశాలను ప్రతిపాదించవచ్చు. తెలుగు సాహిత్యంలో వచ్చిన వాదాలన్నీ భావజాలాల వెలుగులో సిద్ధాంత భూమికను ఏర్పరచుకొని ఇతర వాదాలతో విభేదిస్తూ తమ అస్తిత్వాన్ని ప్రకటించుకున్నాయి. కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. సాహిత్యంలో తమదైన వ్యక్తీకరణలను ప్రవేశపెట్టాయి.

వాదానికి సాహిత్యంలో రెండు వ్యక్తీకరణ మార్గాలు ఉంటాయి. అవి ధోరణి, ఉద్యమం. ఈ రెండింటికి పూర్వ రంగంలో వాదం ఉంటుంది. రచయితలు వాదం వెలుగులో సమాజం ముందు తమ ప్రతిపాదనలను, ఆలోచనలను ప్రకటిస్తారు. చర్చలు జరుగుతాయి. ఆ చర్చల వెలుగులో నూతన వాదాలు కూడా పుట్టుకొస్తాయి.

తెలుగులో వాదం, ఉద్యమం అనే మాటలను భేదం లేకుండా వాడుతుంటాం. సంఘ సంస్కరణ వాదం – సంఘ సంస్కరణోద్యమం, జాతీయ వాదం – జాతీయోద్యమం, మార్క్స్ వాదం, అభ్యుదయ వాదం – అభ్యుదయోద్యమం, విప్లవవాదం – విప్లవోద్యమం, స్త్రీవాదం, దళిత వాదం – దళితోద్యమం, మైనార్టీ వాదం, ప్రాంతీయ వాదం, బీ. సి. వాదం ఇలా వాడుతుంటాం. వీటిపై స్పష్టత రావాల్సి ఉంది. తెలుగు సాహిత్యంలో వివిధ వాదాలు ధోరణి గాను, కొన్ని ఉద్యమాలుగాను వ్యక్తమయ్యాయి. "తెలుగు సాహిత్యంలో సంఘ సంస్కరణ, అభ్యుదయ, విప్లవ, దళిత, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదాలు ఉద్యమాలుగా, నవ్య సంప్రదాయ, స్త్రీ, ముస్లిం మైనారిటీ, బీ. సి. వాదాలు ధోరణులుగా ఉన్నాయి." ఈ ప్రతిపాదనకు కొన్ని పరిమితులు ఉన్నాయి. ముమ్మందు చర్చకు వస్తాయి.

ధోరణి:

ధోరణి అన్న పదానికి శబ్ద రత్నాకరము 'పద్ధతి', 'పంక్తి' అనే అర్థాలను ఇచ్చింది. ముదిగంటి గోపాలరెడ్డి సంస్కృతాంధ్ర నిఘంటువు 'క్రమంగా పొందబడునది', 'పరంపర', 'ప్రవర్తన' అనే అర్థాలను ఇచ్చింది. దీన్ని బట్టి ధోరణి అంటే పోకడ, ఒక పద్ధతిలో పయనించడం, ఒక ఆలోచన విధానం, అనుసరణ మార్గంగా చెప్పవచ్చు. సాహిత్యంలో కొత్త కొత్తగా వస్తున్న మార్పులను, కవితావేశంలో వచ్చిన వ్యక్తుల మార్గాన్ని గుర్తించడానికి ధోరణి అన్న పదాన్ని ఉపయోగిస్తున్నారు.

"నిర్దిష్ట భావాత్మకాశయంతో కొంత మంది ఉమ్మడిగా చేసే వ్యక్తిగత ప్రయత్నాల, చర్యల పరంపర ధోరణి" (శివశంకర్, పాపినేని. సాహిత్యంలో మౌలిక భావనలు. 2020: 119) అనే పాపినేని శివశంకర్ నిర్వచించారు.

"దేశ కాలాదులకు అనుగుణంగా ప్రతీ యుగంలోను సాహిత్య కళా రంగాల్లో ఒక వినూత్న లక్షణం కనిపిస్తుంది. ఒక దిశ మరొక దిశకు మారడమూ కనిపిస్తుంది. కొన్ని స్థిరంగా, కొన్ని పరివర్తన చెందుతూ ఉంటాయి. ఈ స్థిరపడే, పరివర్తన చెందే సాహిత్య లక్షణాలు గల రచనా పద్ధతిని ధోరణి అంటారు." (చక్రవర్తి, లక్ష్మణ. విమర్శ విజ్ఞాన సర్వస్వం. 2016: 915)

"పరిమితమైన ప్రయోజన పరిధికి, పరిమిత వ్యక్తులకు మాత్రమే లోబడి కొనసాగితే దాన్ని ధోరణిగా చెప్పవచ్చు. ప్రధాన సాహిత్య ప్రవంతి నుంచి వైదొలిగి లేదా విభేదిస్తూ కనిపించే సామాజిక సాహిత్య పరిణామం ధోరణి అని చెప్పడానికి వీలుంది. సామూహిక ప్రయత్నం, సంఘటిత సంకల్పం

ధోరణిలో కనిపించదు" (యాకుబ్. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ. 2018: 47) అని నిర్వచనాన్ని ఇచ్చారు.

సాహిత్య లోకంలో నెలకొన్న స్తబ్ధతను ఛేదించడానికి కొంతమంది తమ స్వీయ లేదా పరుల ఆలోచనల మార్గంలో పయనిస్తారు. అప్పటివరకు ఉండే సాహిత్య విలువలను ప్రశ్నిస్తారు. సామాజిక, సాహిత్య పరిస్థితులపై త్వరగా స్పందించేందుకు అనువైన సాహిత్య ప్రక్రియ కవిత్వం. దీని మూలంగా ఏ సాహిత్య ధోరణి అయినా ముందుగా కవిత్వంతో ప్రారంభమవుతుంది. ఏదైనా ధోరణి కవిత్వ రూపం దాటి ఇతర ప్రక్రియల వైపు ప్రయాణిస్తుందంటే అది ఉద్యమ స్వభావాన్ని రూపొందించుకుంటుందని అర్థం. ఈ రకమైన ధోరణిలో కవిత్వం రాసేవారు వేగంగా తమ భావాలను సాహితీ రంగంలోకి పంపడానికి ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో సాహిత్య, సామాజిక రంగాల్లో ఉద్యమ, సాహిత్య సంఘాల నిర్మాణంపై పెద్దగా దృష్టిపెట్టరు. దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోరు. నిశ్శబ్దంగా ఉన్న పరిస్థితులను తమ మాటలతో, రాతలతో పరీక్షకు గురిచేస్తారు. ఈ విధంగా తాము ఛేదించడానికి వచ్చిన స్తబ్ధతపై మార్పు వచ్చిన తర్వాత వారిలో కొందరు పూర్తిగా కనుమరుగై పోతారు. లేదా, ఇతరేతర భావజాలాలలోకి వెళ్తారు. ఉదాహరణకు భావ కవిత్వం, దిగంబర కవిత్వం, పైగంబర కవిత్వం, చేతనావర్తన కవిత్వం, తిరగబడు కవిత్వం, అనుభూతి కవిత్వం మొదలైనవి ఈ విధంగా ధోరణిగా ప్రారంభమైనవే.

ఇదిలా ఉండగా ధోరణి అంటే మరో చర్చ కూడా ఉంది. ఈ చర్చను రావులపాటి సీతారాం తన సిద్ధాంత గ్రంథం "తెలుగులో ఆధునిక కవితా ధోరణులు" అనే గ్రంథంలో చెప్పారు. ఏదైనా ఒక వాదంలో నూతన అభివ్యక్తి మార్గానికి మొగ్గ చూపినట్లయితే అది "వాద ధోరణి" అనే అవకాశం ఉంటుంది. వాదంలో అంతర్గతంగా భిన్నమైన కవితాభివ్యక్తి మార్గాన్ని ఎంచుకున్నా, మరే ఇతర సాహిత్య వ్యక్తీకరణ మార్గాలు, అవగాహన పరమైన భేదాలు ఉన్న వాదంలోని వివిధ ధోరణులుగా భావించవచ్చు. "ధోరణికి ఆధార భూమిక అనదగిన కళా వాదం ఏదో ఒకటి ఉంటుంది. ఒక వాదం పట్ల చూపుతున్న మొగ్గను ఆ వాద ధోరణిగా పిలవడం పరిపాటి. ధోరణి కవిత్వానికి తత్పూర్వ కవిత్వంలో లేని నూతనమైన అభివ్యక్తి విధానం ఉంటుంది. దీనితో పాటుగా విలక్షణత్వమూ, విభిన్నత్వమూ ఉంటుంది. దీన్ని బట్టి ఒక కవి లేదా కొంతమంది కవుల విశిష్ట రచనా విధానం ధోరణిగా గుర్తింపుకు వస్తుందని చెప్పవచ్చు. ధోరణి కవిత్వంలో కనిపించే ముఖ్య లక్షణం. ఆ ధోరణికి వెనుకనున్న కళా వాదం యొక్క తాత్త్విక దృక్పథం. ఆ దృక్పథాన్ని అందించే వాదం పట్ల అనుకూలతతో పాటు నిమగ్నత ఉంటుంది." (సీతారామరావు, ఆర్. తెలుగులో ఆధునిక కవితా ధోరణులు. 1992: 132) ఇటువంటి అభిప్రాయాన్నే ముదిగంటి సుజాతా రెడ్డి కూడా వ్యక్తీకరించారు.

"అభ్యుదయ వాదంలో దిగంబర కవిత్వం ఒక ధోరణిగా చెప్పవచ్చును. స్త్రీవాదం సంప్రదాయ పద్ధతిని, మార్క్సిస్టు భావజాలాన్ని పెట్టుబడిదారీలోని వ్యక్తివాదాన్ని అనుసరిస్తూ ఎన్నో దిశలుగా విస్తరిస్తూ అనేక పాయలుగా కన్పిస్తున్నది. వాటిని స్త్రీవాద ధోరణులు అని అనవచ్చును. దళిత వాదంలో మేమే కవులదొక మార్గం. దాన్ని దళిత వాదంలోని ధోరణిగా చెప్పవచ్చును" (సుజాతా రెడ్డి, ముదిగంటి. ముద్దెర. 2005: 05) ఈ అభిప్రాయాన్ని బట్టి చూస్తే ముదిగంటి సుజాతా రెడ్డి గారు దిగంబర కవిత్వాన్ని అభ్యుదయ వాద సాహిత్యంలో భాగంగా వెలువడిన సరికొత్త మార్గంగా గుర్తించారు. స్త్రీవాదంలో, దళిత వాదంలో వచ్చిన నూతన భావాల వ్యక్తీకరణ, సాహిత్య నిర్మాణ వైవిధ్యం మొదలైన అంశాలను వాదంలో వచ్చిన ధోరణులుగానే చెప్పారు. దీన్ని బట్టి వివిధ సాహిత్య వాదాల ఆచరణలో వచ్చిన మార్పులను సాహిత్య ధోరణిగా గుర్తిస్తున్నారు.

సాహిత్యంలో ధోరణులు స్థానిక పరిస్థితుల వల్ల గానీ, ప్రపంచ మార్పుల వల్ల కాని రావచ్చు. సాహిత్య వికాసంలో ఒకే సమయంలో అనేక ధోరణులు ఒక్కో సమయంలో ఒక్కోటి బలంగా తమ వాదనలను వినిపిస్తాయి. అంతే కానీ ముందు ఉన్న వాదాలు ఆగిపోయాయని కాదు. కొన్ని సందర్భాలలో ఒక్కో ధోరణి, శత్రు ధోరణి, మిత్ర ధోరణులు అంటూ పని చేస్తుంటాయి. ధోరణి విడిగా ఉండి కనుమరుగై పోవడం, మిత్ర ధోరణులు కలిసి సంఘంగా ఏర్పడడం, కలిసి పనిచేయడం వంటివి జరుగుతుంటాయి. ఈ ధోరణి ఎప్పుడు ప్రారంభమై, ఎప్పుడు ఆగిపోయిందని చెప్పడానికి అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. కాల నిర్ణయం చేయడం దాదాపు కుదరదు. ప్రతినిధులు, అనుచరులు అంటూ ఒక్కో ధోరణికి ఉజ్వల దశ, స్తబ్ధత, క్షీణ దశ వంటివి ఇందులో చోటు చేసుకుంటాయి.

ఏదైనా ఒక ధోరణి సామాజిక ఉద్యమాల కేంద్రంగా, ఆచరణాత్మక అనుభవంతో నేర్చుకున్న విషయాలను సాహిత్యానికి అనువర్తన చేస్తారు. సామాజిక రంగంలోనూ, సాహితీ ప్రపంచంలోనూ వారు సాధించాలనుకున్న ఫలితాలను సాధించే వరకు సాహిత్యానికి సమాంతరంగా సామాజికోద్యమ నిర్మాణాలవైపు పెద్దగా ఆసక్తి చూపరు. మొదట్లో ఉప్పెనగా వచ్చి తర్వాత కాలంలో మందగిస్తుంది. ధోరణి మొదట కవిత్వంలో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఇతర ప్రక్రియల్లోకి అవసరాల దృష్ట్యా మారుతుంది. ఒక్కో ధోరణి సంఖ్యాబలం, నిబద్ధత, పాఠకుల ప్రోత్సాహం, సంఘ నిర్మాణం, రచనా సామర్థ్యం, సైద్ధాంతిక దృక్పథం వంటి అంశాలను బట్టి, సామాజిక సాహిత్య అవసరాల తీవ్రతను బట్టి ఉద్యమంగా మార్పు చెందుతుంది. సాహిత్యంలో ప్రారంభమైన ఉద్యమాలు మొదట ఒక ధోరణిగా ప్రారంభమైనవే.

 పై అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ధోరణికి ఈ కింది లక్షణాలను రూఢి చేసుకోవచ్చు.

1. ధోరణి అంటే ఒక ఆలోచనాత్మకమైన మార్గం, చూపు. ధోరణి అనేది నడిచి వచ్చిన చరిత్రను విమర్శనాత్మకంగా అంచనా కడుతూ, నడవాల్సిన మార్గాన్ని అభివృద్ధి చేస్తుంది.

2. ధోరణి అంటే కొంత మంది వ్యక్తులు పరిమితమైన లక్ష్యాలతో, నిర్మాణంతో సాగించే ఒక సాహిత్య నడక.

3. ఒక సాహిత్య వాదంతో విభేదాలు కలిగి, మరొక వాదనతో ముందుకు వచ్చిన కొంతమంది ప్రారంభించే ఒక మార్గం.

4. సాహిత్య ధోరణి కొంత మంది ఆలోచనలకి ప్రతిరూపమే కనుక, దీనికి ఉద్యమ స్థాయి లేకపోవడం వల్ల సామాజిక మౌలికాంశాలను ప్రభావితం చేసే శక్తి ఉండదు.

5. సాహిత్య ధోరణికి సామాజికోద్యమాలతో సంపర్కం లేదు. ఒక నిర్మాణాన్ని విభేదిస్తూ బయటికి వచ్చిన వారితో ధోరణి ప్రారంభ అవకాశం ఉంది కనుక సామాజికోద్యమ నిర్మాణంలో ఎక్కువగా భాగస్వామ్యం ఉండే అవకాశం ఉండదు.

6. ఈ పద్ధతుల్లో ఏకకాలంలో అనేక ధోరణులు ఉండవచ్చు. వాటి మధ్య సామరస్యమైనా, వైరుధ్యమైనా ఉండవచ్చు.

7. సాహిత్య ధోరణికి ఉద్యమం వలె చలన శీలత, తీవ్రత, లోతు ఉండవు.

8. సాహిత్య ధోరణిలో సమాజానికి, సాహిత్యానికి మధ్య ఉన్న వైరుధ్యాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి.

9. దీనిని ఆంగ్లంలో TREND అనే పదానికి సమానార్థకంగా వాడుతున్నారు.

10. A general direction in which something is developing or changing.

ఉద్యమం:

ఉద్యమ శబ్దం సంస్కృతంలో 'యమ్' అనే ధాతువుకు, 'ఉత్' అనే ఉప సర్గ చేరి ఉద్యమం అనే పదంగా తయారైనది. యమ్ అనే ధాతువుకు స్వాధీనములో ఉంచుకొను అనే అర్థం ఉంది. ఆంగ్లంలో Movement అన్న పదానికి సమానార్థకంగా ఉద్యమం అనే పదాన్ని వాడుతారు. A Series of Concerted organised activities or related events working towards or shaping some objecting. దీన్నే "తీవ్రమైన ఏకోన్ముఖమైన ప్రయత్నము ఉద్యమం" గా చెప్పవచ్చు.

"నిర్దిష్ట భౌతికాశయంతో ఒక సమూహం చేసే సమష్టి ప్రయత్నాల, చర్యల పరంపర ఉద్యమం" (శివశంకర్, పాపినేని. సాహిత్యం మౌలిక భావనలు. 2020: 140) సామాజిక వర్తమానంతో నిరంతరం సంఘర్షిస్తూ, దానిపై ప్రభావం చూపుతూ, తిరిగి దానిచేత ప్రభావివతమవుతూ ఉద్యమం కొనసాగుతుంది. సామాజిక పరిణామాలతో సాహిత్యోద్యమానికి నిరంతర పరస్పర ప్రభావం, చలన తీవ్రత ఉంటే అది ఉద్యమ సాహిత్యంగా చెప్పవచ్చు.

1. సాహిత్య ఉద్యమం, సామాజిక (సాహిత్య) వస్తువుతో అన్యోన్య సంబంధాన్ని కలిగి ఉంటుంది.

2. సైద్ధాంతిక దృక్పథం సాహిత్యోద్యమానికి జీవగర్ర.

3. సాహిత్యోద్యమం ఆర్థిక రాజకీయాలతో ప్రధాన ప్రమేయాన్ని కలిగి ఉంటూ, ఆ మౌలికాంశాలను ప్రభావితం చేసే శక్తిగా ఉంటుంది.

4. సాహిత్యోద్యమానికి సామాజిక భౌతిక పరిణామంతో నిరంతరం పరస్పర చలన తీవ్రత ఉంటాయి.

5. ఉద్యమ సాహిత్యానికి సామూహిక వినియోగ సంబంధాలుంటాయి.

సాహిత్య ఉద్యమంలో, సిద్ధాంతానికి సమాంతరంగా సామాజికోద్యమాల నిర్మాణాలు ఉంటాయి. ఆచరణ జ్ఞానం కేంద్రంగా సాహిత్యం ఉద్భవిస్తుంది. ఉద్యమం ఉన్నంత వరకు సాహిత్యం నిరంతరాయంగా ప్రవహిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికి నిరంతర ప్రవాహం ఉద్యమ సాహిత్య లక్షణం.

"కళా సాహిత్య రంగాల్లో ప్రక్రియల్లో గాని, ఇతి వృత్తాల్లో గాని, శైలిలో గాని విస్తృత స్థాయిలో మార్పు వస్తే, దాన్ని సూచించడానికి వాడే మాట. ప్రారంభమైన మార్పుకి అనుకూలంగా విస్తృత స్థాయిలో రచయితలు స్వయంగా కదలడం గానీ, కొందరు క్రియాశీల రచయితలు కదలడం కానీ, మేనిఫెస్టో వంటి అవగాహన పత్రాన్ని వెలువరించడం గానీ, భావ స్వామ్యం, రచనా స్వామ్యం ఉన్న రచయితలు ఒక వేదికలో సంఘటితం కావడం గాని జరిగినప్పుడు దాన్ని ఉద్యమంగా ప్రకటిస్తూ ఉంటారు. పాఠకుల నుంచి క్రియాశీలమైన మద్దతు (విరాళాలివ్వడం, రచనలను చదవడం, చర్చా గోష్ఠుల్లో పాల్గొనడం, ఇతరుల చేత చదివించడం మొదలైనవి) ఉన్నప్పుడు కూడా ఉద్యమ వాతావరణం ఉన్నట్టే భావిస్తారు. ఒకలాంటి భావజాలంలో, దృక్పథంతో రచన సాగిన కాలాన్ని ఉద్యమ కాలంగా గుర్తిస్తారు". (నళిని. ఎస్. ఎస్. విమర్శ పారిభాషిక పదకోశం. 2021: 47)

ప్రక్రియ, భాష, శైలి, శిల్పం, ఇతివృత్తం, సైద్ధాంతిక దృక్పథం మొదలైన విషయాలలో రచయితలు చెప్పుకోదగిన సంఖ్యలో అనుసరించే మార్గం, పద్ధతిని సాహిత్యంలో ప్రవేశపెట్టి, లక్ష్య సాధనకు కృషి చేస్తే దాన్ని ఉద్యమంగా చెప్పవచ్చు.

రచయిత: సహాయ ఆచార్యులు, ఓయు

పుస్తక
పరిచయం

ఇరవై ఐదేళ్ల పాటల బైరాగి రమణ

ఎం.విప్లవ కుమార్

నేలతల్లి చనుబాల ధార పాట. మట్టి వాసనంత సహజంగా పాట తెలుగు ప్రజల జీవనంలో భాగమైంది. ఇక్కడ అన్యాయాలకు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు కన్నెర్ర జేస్తే ప్రజా చైతన్యం పాటై వర్షిస్తుంది. అలాంటి పాటల వర్షంలో తడిసి ముద్దై, ఎగిరి, దునికి, ఆడి, పాడుతూ, అలుపు, సొలుపు లేకుండా చైతన్య ప్రవాహమైన వాడు పి.వి. రమణ. నిజానికి మరే స్వంత పని చూసుకోకుండా, నిర్విరామంగా ప్రజా కళల సాగులో మమేకమై ఉండడం అంత ఈజీ కాదు. మట్టి కలమై, ఉద్యమ గళమై ప్రజా చైతన్యం కోసం తన బాల్యాన్ని, యవ్వనాన్ని, విలువైన జీవితాన్ని, కాలాన్ని ఖర్చు చేసి ఇరవై అయిదేళ్లుగా సాంస్కృతిక విప్లవకారుడిగా సాగుతున్న పాటల బైరాగి రమణ. కళ కళ కోసం కాదు, కళా ప్రజల కోసం అని పిలుపునిచ్చిన సఫ్దర్ హష్మీ, టి.జె. రామనాథం స్ఫూర్తితో రమణ నిలబడగలిగాడు. కనుకనే ఇంతకాలంగా ప్రజలను చైతన్యం చేస్తూ, ప్రజా సమస్యలపై పాటల నగార మోగిస్తున్నాడు. తన సహచర పాటగాడైన రాజేష్ తో కలిసి "పాట నేనవుతా/ కోయిల పాట నేనవుతా'' అని పాడినట్టుగానే పాటే బాటగా సాగుతున్నాడు.

ఎక్కడో నెల్లూరు జిల్లా పెళ్లకూరు మండలం, చెంబేడు గ్రామంలో దళిత కుటుంబంలో పుట్టినవాడు రమణ. పాఠశాల స్థాయి నుండే రమణ పాటలు పాడడం అలవాటు చేసుకున్నాడు. అట్లా ఒకసారి రమణ హైస్కూల్ లో చదువుతుండగా అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి పాల్గొన్న ఒక సభలో చింతల యాదగిరి రాసిన "నా చిట్టి చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో" పాట పాడి జనార్దన్ రెడ్డిని ఏడ్పించడమే కాకుండా ఆయన చేతుల మీదుగా పెన్ను బహుమతిగా తీసుకున్నాడు. దాంతో పాటలపై మరింత మక్కువ పెంచుకున్నాడు. అంతకు ముందే అక్షరాస్యతోద్యమంలో కళాకారులుగా ఉన్న తన మేనమామలు చెంబేటి ప్రేమానందం, బుజ్జయ్య ప్రభావంతో బగాది వెంకట్రావు రాసిన "అక్షరం యాదున్నాదో ఆడనే సుఖమున్నది" అనే పాటను నేర్చుకున్నాడు. క్రమంగా ప్రజానాట్యమండలి వర్క్ షాప్స్ కి హాజరవడం మొదలెట్టి తొలి రోజుల్లో కోలాటం నేర్చుకుని అనేక గ్రామాల్లో ప్రజలకి శిక్షణ ఇచ్చాడు. పగలు పాటల శిక్షణలో పాల్గొని, రాత్రిపూట గ్రామాల్లో కోలాటం బృందాలను తయారు చేసేవాడు. ఆ బృందాల ద్వారా చదువు ప్రాధాన్యతను తెలియజెబుతూ తెలుగు నేల మీద అక్షరాస్యతాభివృద్ధికి కృషి చేసినవాడు రమణ. ఆ వర్క్ షాప్స్‌లో పరిచయమైన అప్పటి గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి నూతులపాటి కాళిదాసు గారు రాసిన ఉత్తరాల ఆహ్వానంతో, ప్రోత్సాహంతో కన్నవారిని, ఉన్న ఊరును వదిలి ప్రజానాట్యమండలి కోసం జిల్లాలు దాటుకుని వచ్చి గుంటూరులో స్థిరపడ్డాడు రమణ. ఏ. సి కాలేజీలో ఇంటర్మీడియట్ లో చేరి ఎస్.ఎఫ్.ఐ కాలేజీ అధ్యక్షుడయ్యాడు. ఆ రోజుల్లోనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీ.జి) చదివాడు. అంత ఉన్నత చదువు చదివినా సొంత జీవితం అనే స్వార్థంలో పడిపోకుండా పాటగాడిగా, ప్రజానాట్యమండలి కార్యకర్తగా ఉండిపోదలచుకున్నాడు. నాకు తెలిసిన ప్రజానాట్యమండలి గాయకుల్లో ఇంతలా ఉన్నత విద్య చదువుకుని సుమారు ఇరవై అయిదేళ్లు పాటగాడిగా, పూర్తి కాలం కార్యకర్తగా, కేవలం పాటే జీవితంగా పని చేసినవారు లేరు.

ప్రపంచీకరణ ఇనుపడెక్కలు మన నేల మీద అడుగు పెట్టడం ప్రారంభమైనప్పటి నుండి రమణన్న పాటను

చేతబట్టుకుని, గోసిపెట్టి, గొంగడి భుజాన వేసుకుని, కాళ్లకు గజ్జెలు కట్టుకుని ఆకలి దూపకు ఎడబాసి ప్రజా కళా సైనికుడై తిరిగాడు. కుటుంబాన్ని వదిలి వేల రోజులు ప్రజా క్షేత్రంలో గడిపాడు. కరెంట్ చార్జీల వ్యతిరేక ఉద్యమంలో, భూపోరాటాల్లో, పోలవరం ప్రజల హక్కుల కొరకు, చేనేత కార్మికుల రక్షణ కొరకు, తెలుగు భాష పరిరక్షణ కోసం, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, రైతు గిట్టుబాటు కోసం, కూలి రేట్ల పెంపు కోసం, కుల వివక్ష అంతం కోసం ఇలా ఒకటేమిటి గత ఇరవై అయిదేళ్లలో ప్రజలకు వచ్చిన ప్రతి సమస్యకు వ్యతిరేకంగా నిలువెత్తు పాటాయుధమై నిలబడ్డవాడు రమణ. అక్షరాస్యత ఉద్యమం నుండి అమరావతి రాజధాని ఉద్యమం వరకు, కూలీ రేట్ల పెంపు పోరాటం నుండి కుల వివక్ష వ్యతిరేక పోరాటం వరకు రమణ గొంతు రాజీలేని పాటై మార్మోగుతూనే ఉంది. "గుట్కా తినకన్నో, నువు గుట్టుక్కు మనకన్నో" అంటూ తానే రాసి పాడిన పాట నాడు ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన గుట్కా వ్యతిరేకోద్యమానికి పెద్ద ఊపునిచ్చింది. "మాల మాదిగలంత మైల బడ్డోళ్లంటూ/ అగ్ర కుల పెద్దలు అణగదొక్కుతుంటే/ నిదురెట్ల పడుతుందిరన్నా దళితన్న/ నిప్పులై మండాలిరన్నా దళితన్న" అని బండి సత్తెన్న రాసిన పాట రమణ ఎగిరి దునుకుతూ, అభినయిస్తూ కసిగా పాడుతుంటే చూసినవారెవ్వరైనా ముగ్ధులవ్వాల్సిందే.

"రంగు వెలసిన రాట్నామా/ చేనేత బతుకుల స్వప్నమా" అని పోతగాని రాసిన పాటకు రమణ జీవంపోసి "చేతిమగ్గం చేతులిరుసుట యేలెటోళ్లకు న్యాయమా... బహుళజాతి కంపెనీలకు వృత్తులా పందేరమా.." అనే హుక్కులైన్‌ని రమణ హైపిచ్‌లో పాడుతూ వింటున్న శ్రోతలను ఒకేసారి ఇటు శోకతీరంలో, అటు ఆవేశం అంచుల్లో కూర్చోపెడతాడు. ఇలా చాలా మంది ప్రజా గాయకులు చేయగలరు కానీ, రమణ గాత్రంలో అది ఇంకా ఎక్కువగా పెల్లుబికుతుంది. ఆర్. ఏ. వాసు రాసిన "నా సెమట సుక్కో నా సేమట సుక్కో/ ఎర్రని ఎండల్లో నిగనిగలాడే నా సేమట సుక్క" అంటూ శ్రమ ప్రాధాన్యతను వివరించే పాట రమణ గొంతులో నిగనిగలను పొదవికొని వచ్చిన ఆడియో రికార్డ్ తెలుగు నేలంతా వినిపించింది. ఇలా ఒకటేమిటి ప్రజానాట్యమండలిలో ఎన్నో వందల పాటలు రమణ గొంతులో రాగాలనల్లుకున్నాయి. ఇట్లా ప్రజా పాటలే కాదు, రమణకి సరిగమలు కూడా తెలుసు. పాటలకి ట్యూన్ కట్టడంలో దిట్ట. సన్యాసిరావుగారు రాసిన "పాట నేనవుతా" పాటను రంగం రాజేశ్ తో కలిసి డ్యూయెట్ పాడి ప్రయోగాలు చేశాడు. గుర్రం జాషువా గబ్బిలం కవిత్వాన్ని రమణన్న కోయిల రాగాలాపనలా పాడుతుంటే విని తీరాల్సిందే.

సాంస్కృతిక కార్యకర్తగా, గాయకుడిగా, నాయకుడిగా, కళాకారుడిగా రెండున్నర దశాబ్దాల రమణ జీవితం ప్రజానాట్యమండలితో పెనవేసుకుని ఉన్నది. జిల్లా నుండి రాష్ట్ర స్థాయి వరకు నడిపిన కళాజాతాలన్నింటిలో రమణ కీలకంగా ఉన్నాడు. నెలల తరబడి ఇల్లు, వాకిలి వదిలి పాట చేతబట్టుకుని, రెండు తెలుగు రాష్ట్రాలు తిరిగి ప్రజా కళలకు ఊపిరి పోసినవాడు, ప్రజానాట్యమండలికి ఊతమిచ్చినవాడు, ప్రజా చైతన్య ప్రవాహమైనవాడు రమణ. కారణాలేవో తెలియదుగానీ కరోనా కాలంలో తన మాతృసంస్థ ప్రజానాట్యమండలి తనని వదులుకున్నది. అమ్మలాంటి సంఘం అంటరాదనగానే ఊపిరాడక కుప్పకూలిపోయాడు. కానీ ప్రజలు ఆయన్ని వదులుకోలేదు. సంస్కృతి బాలచందర్ లాంటి కళాపోషకులు రమణకి అన్ని రకాలుగా అండగా నిలిచి, కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అలా ఎడబాటు నుండి తమాయించుకుని బయటబడ్డాడో లేదో అమరావతి రాజధాని ఉద్యమమై రాజుకున్నాడు. "రాజధాని మార్పు పేర మా బతుకులు బుగ్గి చేస్తే/ ఉరుకోము మేమంతా పాలకులారా" అంటూ తానే పాట రాశాడు. కణకణ మండే నిప్పై, దమదమ మోగే దప్పై ఆంధ్రప్రదేశ్ అంతా కాలినడకన తిరిగి ప్రజల్లో కదనోత్సాహం నింపాడు రమణ. ఢిల్లీలో జరిగిన రైతుల ఉద్యమానికి సంఘీభావంగా ఎన్నో పాటలు పాడాడు. ఇలా ప్రతి సందర్భంలో తన పాటలో ప్రజా దృక్పథం పల్లవిస్తూనే ఉంది. ఎక్కడ కూడా ప్రజా పాటను, ఉద్యమ బాటను మాత్రం వీడలేదు. రమణ విక్టర్ జారాలా చిలీలో కాకుండా ఘనీభవించిన కుల భారతాన పుట్టాడు. అందుకే అడుగడుగున అణగారిన దళితుడనే చిన్నచూపుకు గురయ్యాడు. ఆహ్వాన పత్రికల్లో పేర్లు వేశాక కూడా మీటింగులకు రానివ్వని అగ్రకుల నిషేధాలు, అవమానాలెన్నింటినో పంటి బిగువన భరించాడు. మొక్కవోని సంకల్పంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పాటల జెండాలా రెపరెపలాడుతున్నాడు రమణ. జాషువా కల్చరల్ సెంటర్ స్థాపకుడిగా ప్రజా సంస్కృతి పరిరక్షణలో నిమగ్నమై, ప్రసిద్ధ కవి గుర్రం జాషువా వారసత్వ కొనసాగింపుకు కృషి చేస్తున్నాడు. అట్టడుగు కులంనుండి, అవమానపు కొలిమి నుండి, దగాపడ్డ గొంతుల దండోరా అయ్యి సదా మోగుతూ, విరామమెరుగని సాంస్కృతిక యుద్ధంలో రమణ గొంతు సదా వర్ధిల్లాలని ఆశిద్దాం.

రచయిత: రీసెర్చ్ స్కాలర్, ఢిల్లీ యూనివర్సిటీ

తెలంగాణ దాస సాహిత్యం

డా. ఉండేటి ప్రవంతి

1. పరిశోధన శీర్షిక (Title of the Research)

నాకు వ్యక్తిగతంగా చిన్ననాటి నుండే పాటలు పాడటం, ఆధ్యాత్మిక అంశాలను తెలుసుకోవడం చాలా ఇష్టం. దీంతో సంగీతంలోను కొంత ప్రవేశాన్ని సాధించాను. రామదాసు, అన్నమయ్య, పురందరదాసు, త్యాగయ్య, క్షేత్రయ్య వంటి వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించటం, అందులోని నిగూఢ అర్థాలు, ఆధ్యాత్మిక కోణాలను అర్థం చేసుకోవాలనే కుతూహలం నాలో నానాటికి పెరిగిపోయింది. దీంతో నేను అసంకల్పితంగానే పదకవుల కీర్తన సాహిత్యం పట్ల ఆకర్షితురాలినైనాను. రామదాసు లాంటి భక్తకవులు ఉన్నారా అని వెతకడం మొదలు ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యుల సలహాలు, సూచనలు స్వీకరించటం ఈ పరిశోధనా అంశానికి నాంది. కొంతమంది దాసనామ వాగ్గేయకారులను సేకరించాను. వీరందరి సాహిత్యమే 'తెలంగాణ దాస సాహిత్యం' అనే శీర్షికగా రూపుదిద్దుకుంది. ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆచార్య సాగి కమలాకర శర్మ పర్యవేక్షణలో తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2024లో సమర్పించాను.

2. పరిశోధన నేపథ్యం (Background of Research)

భావం, సంగీతం, సాహిత్య సమ్మిశ్రిత వినూత్న రూపం దాస సాహిత్య వ్మాయం. సంగీతం, సాహిత్యం మానవాళి ఆనందానికి, మోక్షానికి హేతువులు. ఈ రెండు సమాజంలోని ఆధ్యాత్మిక సామాజిక పరిణతులను ఏర్పరచగలవు. భక్తి భావం, ధర్మ నీతి పరివర్తనలను బోధించు దాస సాహిత్యానికి ప్రధాన ప్రేరణ దక్షిణ భారతదేశంలోనే ఏర్పడిందని కన్నడ హరిదాస సాహిత్యం ద్వారా చెప్పవచ్చు. తెలంగాణ సరిహద్దు ప్రాంతంగా కన్నడ ప్రాంతం ఉండడం వలన దాస సాహిత్య ప్రభావం తెలంగాణలోనూ ప్రసరించింది. పేరు చివర దాస నామం చేర్చుకున్న వందల సంఖ్యలో భక్తదాసులు తెలంగాణలోనూ ఉదయించారు. రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, ఈగ బుచ్చిదాసు వంటి పలువురు దాస కవుల పైన మాత్రమే వ్యక్తిగతమైన పరిశోధన జరిగింది. కానీ, వారి గూర్చిన విస్తృత పరిశోధన ఇంతవరకు జరగలేదు. వారి సాహిత్యాన్ని పరిచయం చేయాలనుకోవడమే ఈ పరిశోధన నేపథ్యం.


తెలంగాణ - దాస సాహిత్యం
పిహెచ్.డి. పట్టా కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి
సమర్పించిన సిద్ధాంత గ్రంథం

పరిశోధన
ఉండేటి ప్రవంతి

పర్యవేక్షణ
ఆచార్య సాగి కమలాకరశర్మ
తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

తెలుగుశాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్, తెలంగాణ
2024

3. పరిశోధన పరిధి (Scope of Research)

తెలంగాణ దాస సాహిత్యం అనే ఈ పరిశోధన విస్తృతమైన పరిధి కలిగి ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలలో గణనీయ సంఖ్యలో దాసకవులు ఉన్నప్పటికీ ఉమ్మడి తెలంగాణ 10 జిల్లాలలో వ్యాపించి ఉన్న దాసకవులను, వారి కీర్తనా సాహిత్య పరిచయాలను నా పరిశోధన పరిధిగా ఎంచుకున్నాను.

4. పూర్వ పరిశోధనల సమీక్ష (Review of Literature)

తెలంగాణ దాస సాహిత్యంపై పూర్తిస్థాయిలో ఇంతవరకు ఎటువంటి పరిశోధన జరగలేదు. ఇదే తొలి పరిశోధన అని చెప్పవచ్చు. కానీ కొందరు దాస కవుల పైన వైయుక్తిక పరిశోధన జరిగింది. ఆ పరిశోధనలను కొన్నింటిని పేర్కొంటున్నాను.

1. ఆంజనేయ శాస్త్రి, సాగి. 1990. రాకమచర్ల వెంకట దాసు కీర్తనలు – జీవిత విశేషాలు. డా. రఘురామ రెడ్డి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్డీ సిద్ధాంత గ్రంథం. ఓరియంటల్ డిగ్రీ కళాశాల, నల్గొండ.

2. భాస్కరయోగి, పి. 2010. పాలమూరు జిల్లా సంకీర్తన సాహిత్యం – ఒక పరిశీలన. డా. బి జయరాములు గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్డీ సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

3. రామ చంద్రయ్య, ఎం. 2008. అన్నమయ్య, త్యాగయ్య శ్రీరామ కీర్తనలు – ఒక పరిశీలన. ఏ చంద్రమౌళి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్డీ సిద్ధాంత గ్రంథం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం.

4. శ్రీనివాసు, మంత్రి. 2023. ఈగ బుచ్చి దాసు సాహిత్యం – సమగ్ర పరిశీలన. ఆచార్య సూర్య ధనంజయ్ గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్డీ సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

5. పరిశోధన మెథడాలజీ, సిద్ధాంత భూమిక (Methodology and Conceptual Framework)

ఈ పరిశోధన విషయ సేకరణ, విశ్లేషణ దృష్టితో సాగింది. రీసెర్చ్ మెథడాలజీ ప్రకారం పరిమాణాత్మక (Quantitative Research) గుణాత్మక పద్ధతులు (Qualitative Research) ఉంటాయి. ఈ పరిశోధన విషయం పట్ల సమగ్రమైన అవగాహనను అందించటానికి పరిణామాత్మక, గుణాత్మక పద్ధతులను మిళితం చేస్తూ మిశ్రమ పద్ధతిని (Mixed Method) అనుసరించాను. దాససాహిత్యం, దాసకవుల సేకరణలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ లైబ్రరీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణ దేవరాయరాయాంధ్ర భాషా నిలయం, నిజాం కళాశాల లైబ్రరీ నుండి కొంత సమాచారం సేకరించాను. బాలరాజ్ బుక్ సెల్లర్ మహబూబ్ నగర్ నుండి కొన్ని పుస్తకాలు తెప్పించుకున్నాను. రాకమచర్ల కుటుంబీకుల నుండి వారి పుస్తకాలు సేకరించాను. మహబూబ్ నగర్ వాసి అంజి కరమ్ అనే యూట్యూబర్ నుండి భజన కీర్తనలు పాడే వారిని చరవాణి ద్వారా సంప్రదించి మరికొందరు దాసుల సమాచారాన్ని తెలుసుకున్నాను. మన్నెంకొండ కామారెడ్డి, నేలకొండపల్లి, వరంగల్ ప్రాంతాలు పర్యటించి అక్కడి నుండి కొంత సమాచారం సంపాదించాను. డా. భాస్కర్ యోగి గారి నుండి పాలమూరు జిల్లా సంకీర్తనకారుల పుస్తకాలు కొన్నింటిని తీసుకున్నాను. జీడిమెట్లలోని అచల గురు పీఠం నుండి పుస్తకాలను తెచ్చుకున్నాను. అలాగే మహబూబ్ నగర్ కి చెందిన తత్వ ప్రజా కవి గోరేటి వెంకన్నని కలిసి ముఖాముఖి జరిపి నా సందేహాలను నివృత్తి చేసుకున్నాను. వాటన్నింటినీ అనుబంధంలో పొందుపరిచాను.

6. పరిశోధన లక్ష్యం (Research Objectives)

ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు తెలుగులో అనేక ప్రక్రియలు, ధోరణులు పరిశోధనలు వెలువడ్డాయి. కానీ, కొంత సాహిత్యం జనసామాన్యంలోనే మిగిలిపోయింది. సామాన్యుల పక్షాన నిలబడిన ప్రజా వాగ్గేయకారులు ఉన్న నేల తెలంగాణ. ఇక్కడ ఒకప్పుడు భక్తి మార్గంలో భజనలు ద్వారా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న సంకీర్తనాకారులు, భక్తదాసులు వందల సంఖ్యలో ఉన్నారు. కారణాలు ఏవైనా వారి సాహిత్యం పరిశోధనకు వస్తువుగా మారకపోవడం, విస్మృతికి గురవడం నన్ను ఆలోచింపజేసిన అంశాలు. అదే లక్ష్యంగా వారిని గూర్చిన పూర్తిస్థాయి పరిశోధన యావత్ తెలంగాణలోని దాసుల సాహిత్యాన్ని సిద్ధాంత గ్రంథంగా వెలువరించడమే ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం.

7. అధ్యయన విభజన (Chapter Division)

నా పరిశోధన గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించాను

1. దాస సాహిత్య పరిచయం
2. తెలంగాణ దాస సాహిత్య వికాసం
3. తెలంగాణ దాస సాహిత్యం– వస్తు వైవిధ్యం
4. తెలంగాణ దాస సాహిత్యం– సామాజికత
5. తెలంగాణ దాస సాహిత్యం ప్రత్యేకతలు

8. పరిశోధన ఫలితాలు (Research Findings)

1. తెలంగాణలో కన్నడ ప్రాంత ప్రభావంతో వందల సంఖ్యలో దాసకవులు జనించారని వెల్లడైంది.

2. ద్వైత, అద్వైతాలను అనుసరించి తెలంగాణ దాసకవుల సాహిత్యం వెలుగొందిందని అని అర్థమవుతుంది.

3. తెలంగాణలో తత్వ కవులు, భక్తకవులు అను రెండు రూపాలలో దాసకవులు ఉన్నారని స్పష్టమవుతుంది.

4. దక్షిణ తెలంగాణలో దాసకవులు అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది.

5. మహమ్మదీయులు దాసులుగా మారి తత్వాన్ని బోధించడం, అచల సంప్రదాయాన్ని అనుసరించటం, స్త్రీ తత్వవేత్తలు, హరిదాసీలు, గురుదాసీలు, హరిహరాద్వైత దాసులు మొదలగున్నవి తెలంగాణ దాస కవుల ప్రత్యేకతగా నిరూపించబడింది.

9. భావి పరిశోధకులకు సూచనలు (Suggestions for Upcoming Researchers)

పరిశోధన పరిమితుల దృష్ట్యా దాస సాహిత్యాన్ని కొంత పరిచయం, కొంత వివరణతో పాటు కొందరి సాహిత్యాన్ని కేవలం స్పృశించాను. దాస కవులు ఒక్కొక్కరిని తీసుకొని పరిశీలిస్తే ఒక్కో పరిశోధన అవుతుంది. నేడు వారి సాహిత్యాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉన్నది. ఆ దిశగా పరిశోధిస్తే జాతి సమైక్యతకు, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేసిన వారవుతారు. T

సమవీక్షకులు ఎస్వీరామారావు

డా. వెల్దండి శ్రీధర్

“డా. ఎస్వీ రామారావు సంయమన శక్తులు తుల్యయోగంలో సమన్వయించుకున్న సద్విమర్శకుడు. స్థూల దృష్టికి శుష్కంగా తోచే ఆంధ్ర సాహితీ విమర్శను రసాత్మకంగా సమీక్షించిన భావుకుడు.”–డా. సి. నారాయణరెడ్డి

తెలంగాణ సాహితీ వినీలాకాశం నుండి ఒక్కొక్క సాహితీ ధ్రువతార నేల రాలిపోతుంటే సాహిత్య లోకం ఏమీ చేయలేక దిగ్భ్రమంగా చూస్తూ ఉండిపోతోంది. 17 సెప్టెంబర్, 2025న ప్రముఖ విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు (సూగూరు వెంకట రామారావు) తుదిశ్వాస విడిచారు. నిరంతర అక్షర తపస్వి, బతికినంతకాలం పుస్తకాల మధ్యనే జీవించిన ఎస్వీ రామారావు, వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో 1941 జూన్ 5న జన్మించారు. పదిహేను సంవత్సరాల వయసులోనే ఆయన ‘పద్మిని’ అనే కథానిక రాశారు. అది ఆనాడు ‘ఆంధ్ర జనత’ దినపత్రికలో అచ్చు అయింది. కొన్నాళ్ళు మద్రాసు నుండి వెలువడిన చిత్రసీమ పత్రికలో సినిమా రివ్యూలు రాశారు. తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో ఎం. ఏ. చేసి అదే విశ్వవిద్యాలయంలో, తెలుగుశాఖ అధ్యక్షుడిగా, డీన్‌గా పనిచేసి విశేష ఖ్యాతి గడించారు.

ఏడు పదుల తన సుదీర్ఘ సాహిత్య జీవితంలో ఎస్వీ రామారావు పాతికకు పైగా సాహిత్య విమర్శ పుస్తకాలు రాసారు. మరో ఇరవై పుస్తకాలకు సంపాదకులుగా ఉన్నారు. అందులో తెలుగు సాహిత్య వైశిష్ట్యం, తెలంగాణ సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు వ్యాయకోశం, పాలమూరు ఆధునిక కవుల చరిత్ర తదితర రచనలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. సాహిత్య విమర్శను విశ్వవిద్యాలయ స్థాయిలో చారిత్రక దృష్టితో అధ్యయనం చేయడానికి ఎస్వీ రామారావు బాటలు వేశారు. దీనికి నిలువెత్తు నిదర్శనం ‘తెలుగులో సాహిత్య విమర్శ– అవతరణ వికాసములు’ గ్రంథం. ఇది ఆచార్య సి. నారాయణ రెడ్డి పర్యవేక్షణలో వెలువడిన తొలి పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఈ గ్రంథంలో అలభ్యమైన, విస్మరించబడిన విమర్శనా గ్రంథాలను కూడా వెలికితీసి, వాటికి అకడమిక్ గౌరవాన్ని కల్పించారు.

ఎస్వీ రామారావు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యులుగా పనిచేసిన కాలంలో 19 పిహెచ్. డి. 15 ఎంఫిల్ పరిశోధనలకు పర్యవేక్షకులుగా వ్యవహరించి యువ పరిశోధకులకు మార్గదర్శనం చేశారు. ఎన్నో విలువైన వ్యాసాలు రాసి వాటిని అన్వీక్షణం, సమవీక్షణం, అభివీక్షణం, కావ్యామృతం, గ్రంథావలోకనం పేరా పుస్తకాలుగా వెలువరించారు. తన సుదీర్ఘమైన సాహిత్య జీవితంలో ఎన్నో పుస్తకాలకు విలువైన పీఠికలు రాశారు.

అవన్నీ ‘కృత్యాలోకనం’ పేరుతో గ్రంథరూపం తీసుకున్నాయి. ఆకాశవాణిలో ఎన్నో ప్రసంగాలు చేశారు. అవి కూడా ‘మనోవీక్షణం’గా వెలువడ్డాయి.

పాఠ్య గ్రంథాల రూపకల్పనకు, సంస్థాగత రూపాన్ని ఇచ్చారు. ‘శతజయంతి సాహితీ మూర్తులు’ పేరుతో కొన్ని వందలమంది తెలుగు రచయితల జీవితసాహిత్యాలను పరిచయం చేశారు. 1965 లోనే పాలమూరు జిల్లాలో సాహిత్య చైతన్యం కలిగించాలనే తలంపుతో ‘జ్యోతిర్మయి’ అనే సాహిత్య సాంస్కృతిక సమితిని స్థాపించి, ఆ సంస్థ తరపున ‘జ్యోతిర్మయి’ అనే కవితా సంపుటిని వెలువరించారు. తరువాత ఇదే సంస్థ పక్షాన రెండు రోజులపాటు పాలమూరు జిల్లా రచయితల మహాసభలను నిర్వహించారు. 2009లో వెలువరించిన ‘శతాబ్ది కవిత’ ఒక మైలురాయి. ఇందులో నూరేళ్ళ కవిత్వ ధోరణుల సమాలోచన చేశారు. 2010లో వెలువడిన ‘సాహితీ కదంబం’ వీరిని కవిగా, కథకునిగా నిలబెట్టింది. ఇందులో ఐదు కథలు, తొమ్మిది కవితలు చోటుచేసుకున్నాయి. 2011లో ప్రచురించిన ‘విమర్శక వతంసులు’ గ్రంథంలో తెలుగు నేలలోని ప్రసిద్ధ విమర్శకుల జీవిత, సాహితీ రేఖలను అంచనా వేశారు.

ఆయన 85వ జన్మదిన సందర్భంగా పలువురు సాహిత్య విమర్శకులు ఎస్వీ రామారావు మీద అభిమానంతో ‘విమర్శనారామం’ వ్యాస సంకలనాన్ని వెలువరించారు. సాహిత్య విమర్శలో ఎస్వీ రామారావు చేసిన కృషిని గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం, శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయం దాశరథి స్మారక పురస్కారంతో గౌరవించాయి. బూర్గుల రామకృష్ణారావు, బీఎన్ శాస్త్రి స్మారక అవార్డులతోపాటు ఎన్నో పురస్కారాలు వరించాయి. ఎస్వీ రామారావు వంటి దిగ్గంతులైన విమర్శకులు కాలపు పుటల్లో కలిసిపోవడం తెలుగు సాహిత్యానికి తీరనిలోటు. వారికి అక్షర నివాళి.

రచయిత: అసోసియేట్ ప్రొఫెసర్,
నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్గొండ

కొంపల్లి వెంకటన్న మరణం మిగిల్చిన ప్రశ్నలు

డా. చంద్రయ్య శివన్న

కొంపల్లి వెంకట్ గౌడ్ వ్యవస్థను ప్రశ్నించీ ప్రశ్నించీ అలసిపోయాడు. తన ఒక్కని శక్తి చాలక ఈ స్వార్థపు లోకంమీద ఉమ్మేసి తనువు చాలించాడు. చరిత్రకారునిగా, కవిగా, పరిశోధకుడిగా ఎంతో కృషిచేసిన యోధుడు. సాహిత్యంలో వెంకట్ గౌడ్ లాంటి చారిత్రక వ్యక్తులు పుట్టడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. వీరు సమాజం విధించే సోకాల్డ్ కట్టుబాట్లను ధిక్కరిస్తారు. వేళ్లూనుకొని ఉన్న పాత విలువల స్థానే కొత్త విలువల్ని పాదుగొల్పుతారు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని సమాజం, వారిని అరాచకులుగా, అనార్కిస్టులుగా ముద్రవేస్తుంటుంది. నవనవోన్మేషమైన ప్రతిభావంతులు వీరు. ఏ విషయాన్నైనా ఎంతో సృజనాత్మకంగా, విమర్శనాత్మకంగా చూడగలిగే చూపున్నవారు. వారిదైన 'క్రమశిక్షణ' కలిగిన ప్రపంచాన్ని సృష్టించుకొని, నిస్వార్థంగా రేపటికోసం ఏమీ దాచుకోని, సొంత కుటుంబం, ఆస్తులపై పెద్దగా ఆశలు లేని బైరాగులు వీరు. వారు బతికున్నప్పుడు వారికి దూరందూరంగా జరిగిపోయే సమాజం గురించి, వారు చనిపోయాక మాత్రం వారిని ఆకాశానికి ఎత్తే ధూర్తలోకం గురించి "దొంగ లం..." అనే శ్రీశ్రీ మాటల్ని ఎన్నింటిని ఉటంకించినా వృధానే. బతికున్నరోజుల్లో వారిని అనేక రకాలుగా ఉపయోగించుకొని లబ్దిపొందినవారెవరూ వారితో ప్రేమగా మాట్లాడినవారు కాదు. కలేకూరి, అలిశెట్టి, పైడి తెరేశ్ బాబు మనకు ఇట్లా కనిపించే ధిక్కార స్వరాలే. ఎవరికీ కాకుండా ఒరిగిపోయిన ఒంటరి యోధానుయోధులే. కొంచెం అటూఇటూగా ఇవే లక్షణాలు కలిగిన తెలంగాణ భాస్వరం కొంపల్లి వెంకట్ గౌడ్.

వెంకన్నకంటూ ఒక ప్రాపంచిక దృక్పథముంది. బహుజన వీరుడనీ, అందునా, గౌడకులస్థుడని ఓన్ చేసుకొంటున్న సర్దార్ సర్వాయి పాపన్నను ఆయన దళిత, బహుజన యోధుడిగానే తీర్మానించాడు. సర్వాయి పాపన్న చరిత్రను ప్రపంచానికి వాస్తవరీతిలో పరిచయం చేసాడు. తనకు ముందున్న చరిత్రకారులు విస్మరించిన ఆనేక విషయాల్ని క్షేత్ర పర్యటనద్వారా సేకరించిన Raw materialను అద్భుతమైన తన రచనా నైపుణ్యంద్వారా మనముందు ఉంచాడు. ఈ పుస్తకంతో ఆయన అందించిన స్ఫూర్తి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది బహుజన రచయితలమీద పడింది. వెంకట్, పాపన్నను దళిత, బహుజన వీరుడిగాసూత్రీకరించడంతోనే ఆయన దళిత, బహుజన రాజ్యాధికారకాంక్ష వ్యక్తమైంది. బొమ్మగాని ధర్మ బిక్షం, నోముల సత్యనారాయణ, విద్యాసాగర్, ఆచార్య జయశంకర్ మొదలైన స్ఫూర్తిదాతల జీవితాల్ని నమోదుచేసి అసలైన బహుజన చరిత్ర రచనా పద్ధతులను, పరికరాలను మనముందుంచాడు. తన దేహాన్ని కూడా తనకోసం మిగిల్చుకోకుండా నిశ్శబ్దంగా వెళ్లిపోయిన ఒంటరి నావ కొంపల్లి వెంకటన్న.

తెలంగాణ వచ్చిన తరువాత ప్రభుత్వంతో కలిసిపోయి, పదవులను పొందే అవకాశం ఉన్నా, ప్రజలవైపే నిలబడి, కలబడిన మనిషి కొంపల్లి వెంకటన్న. తెలంగాణ అస్తిత్వం ప్రశ్నార్థకమైనప్పుడల్లా తన స్వరాన్ని ఏ ఆచ్ఛాదనలు లేకుండా మన ముందుంచిన నిఖార్సైన తెలంగాణవాది. గౌడకులంలో పుట్టినా, ఆయన దళిత బహుజనుల ఉమ్మడి రాజ్యాధికారాన్నే కోరుకున్నాడు. ఇన్ని చేసిన వెంకన్న కొన్ని సంవత్సరాలుగా ఏ సమూహాల్లో కలవకుండా మౌనమునిలా ఒంటరి జీవితాన్ని గడుపుతూ వచ్చాడు. ఆయనకు సరైన 'మెంటర్' దొరికి ఉంటే, మరెన్నో విలువైన పుస్తకాలను అందించేవాడు. ఆయన ఉత్సాహాన్ని, నిస్వార్థ సేవల్ని సరైనమార్గంలో నడిపించుకోలేని ఈ అసమర్థ లోకంనుంచి సెలవు తీసుకొని వెళ్లిపోయాడు. మన చుట్టూరా ఇలాంటి ఎంతోమంది వెంకన్నలు ఇప్పటికీ నడయాడుతున్నారు. వారితో ప్రేమగా మాట్లాడి సరైన 'మెంటర్ షిప్' ఇవ్వాల్సిన సీరియస్ బాధ్యతను వెంకన్న మరణం మనముందు ప్రశ్నలుగా మిగిల్చింది. జోహార్ దళిత బహుజన యోధుడా!

రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007